సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
గురువారం, 09.04.2026


www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 167
పేజీలు: 12 వెల: రూ. 5


## నేడు ముక్కోణపు పోరు!

- అస్సాం, కేరళ, పుదుచ్చేరిలో పోలింగ్ కు అంతా రెడీ
- కేరళలో 'విజయం' ఎవరిది?
- అస్సాంలో బీజేపీ పట్టు నిలుస్తుందా?
- పుదుచ్చేరిలో రంగస్వామికి విజయ్ చెక్

09




అస్సాం, కేరళ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో మంగళవారం సాయంత్రం ప్రచారం ముగిసింది. అస్సాంలోని *126*, కేరళ *140*, పుదుచ్చేరిలోని *30* స్థానాలకు బుధవారం ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. కేరళలో అధికారం కోసం ఎల్డీఎఫ్, ఎలాగైనా పీఠం దక్కించుకోవాలని యూడీఎఫ్ పోటీపడుతుండగా.. అస్సాంలో బీజేపీ–కాంగ్రెస్ మధ్య పోరు సాగుతోంది. మోదీ, అమిత్ షా, రాహుల్ వంటి అగ్రనేతల పర్యటనలతో హీటెక్కిన ప్రచారం ముగియడంతో, ఇప్పుడు ఓటరు తీర్పుపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.

-ముద్ర డెస్క్ :

## పాలమూరు కాంగ్రెస్‌లో ఎవరికి వారే..!

### మున్సిపల్ ఎన్నికల తర్వాత పార్టీలో కల్లోలం




- ఎమ్మెల్యే కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న డీసీసీ అధ్యక్షులు
- తమ వర్గం నేతకు మేయర్ పదవి ఇవ్వలేదని ఎమ్మెల్యే పై తిరుగుబాటు
- టీపీసీసీ అధ్యక్షుల ముందు నేతల ఎడమోహం

10

## ముక్కు నేలకు రాస్తా

### అక్రమాలు నిరూపించండి

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



- నాదర్గుల్, వట్టినాగులపల్లి, కొత్వాల్‌గూడ భూ అక్రమాల్లో మా ప్రమేయం లేదు
- శకుని మామ డైరెక్షన్ లో డ్రామా రావుల నాటకం
- ప్రభుత్వ ఆదరణ చూసి ఓర్వలేకే నిరాధార ఆరోపణలు

03

## హరీశ్ రావు పర్యటనకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

- పోలీసుల ఆంక్షలు కొట్టివేత
- శాంతియుతంగా సభ నిర్వహించుకోండి
- ప్రజాస్వామ్యంలో నిరసన హక్కును కాలరాయలేరు

03



10న ఇస్లామాబాద్‌లో చర్చలు

## యుద్ధానికి బ్రేక్




- పశ్చిమాసియాలో శాంతి వీచికలు
- 14 రోజుల కాల్పుల విరమణకు అమెరికా–ఇరాన్ అంగీకారం
- చివరి నిమిషంలో దాడి నిలిపివేసి ట్రంప్ ట్విస్ట్
- పాల్గొననున్న జేడీ వాన్స్, అమెరికా ప్రతినిధి బృందం
- హర్మూజ్ జలసంధి తెరవాలని అమెరికా షరతు
- 90 డాలర్లకు పడిపోయిన చమురు ధరలు

10



*పశ్చిమాసియాలో ముంచుకొస్తున్న యుద్ధ మేఘాల మధ్య అంతర్జాతీయ సమాజానికి భారీ ఊరట లభించింది. అగ్రరాజ్యం అమెరికా, ఇరాన్ దేశాలు 14 రోజుల పాటు తాత్కాలిక కాల్పుల విరమణకు అంగీకరించడంతో ప్రపంచం ఊపిరి పీల్చుకుంది. దాడులకు కేవలం 90 నిమిషాల ముందు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైనిక చర్యను నిలిపివేయాలని తీసుకున్న సంచలన నిర్ణయం ఉద్రిక్తతలను చల్లార్చింది. పాకిస్థాన్, చైనాల దౌత్య నీతితో కుదిరిన ఈ ఒప్పందంలో భాగంగా కీలకమైన హర్మూజ్ జలసంధి పునఃప్రారంభం కానుండటం.. చమురు ధరలు ఒక్కసారిగా దిగిరావడం అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల పవనాలను నింపింది. 10న ఇస్లామాబాద్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలో జరిగే చర్చలు ఈ ప్రాంతంలో శాశ్వత శాంతికి పునాది వేస్తాయో లేదో వేచి చూడాలి.*

-ముద్ర డెస్క్ :

## తెలంగాణలో ఏరోస్పేస్ విప్లవం

### రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి!

- సీఎంతో టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్ ఎండీ భేటీ
- తెలంగాణలో కార్యకలాపాల విస్తరణ
- సీ130జే సూపర్ హెర్క్యులస్ ఫైనల్ అసెంబ్లీ లైన్ ఏర్పాటు
- తెలంగాణలో విమాన రెక్కల తయారీ!
- గ్లోబల్ డిఫెన్స్ హబ్‌గా రాష్ట్రం

09





## తెలంగాణలో కొత్త విమానాశ్రయాలు

### మామునూర్ ఎయిర్ పోర్టుకు మూడు నెలల్లో శంకుస్థాపన

### ఆదిలాబాద్‌లో పెద్ద ఎయిర్ పోర్టు నిర్మాణం

- సైనిక, పౌరుల అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు
- సివిల్ ఏవియేషన్‌తో కలిసి పని చేసేందుకు రక్షణ శాఖ అంగీకారం
- ఈ నెల 17న ఆదిలాబాద్ భూముల పరిశీలనకు అధికారులు
- అంతర్గాం ఎయిర్ పోర్టు ప్రతిపాదనపై ఫీజబులిటీ నివేదిక సానుకూలం
- మీడియాతో కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్ నాయుడు

**ముద్ర, న్యూ ఢిల్లీ :**
దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు సంబంధించి వస్తోన్న అన్ని డిమాండ్లను పరిశీలిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఫీజిబులిటీ ఉన్న చోట ఎయిర్ పోర్టుల నిర్మాణానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బుధవారం ఢిల్లీలో కేంద మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డితో కలిసి ఆయన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో భేటీ అయ్యారు. అనంతరం కిషన్‌రెడ్డితో కలిసి అక్కడి మీడియాతో మాట్లాడారు. వరంగల్ ప్రజల చిరకాల స్వప్నం మామునూరు ఎయిర్‌పోర్టుకు మూడు నెలల్లో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఆదిలాబాద్ లో పెద్ద ఎయిర్ పోర్టు నిర్మించాలని కేంద్రం భావిస్తోందన్న ఆయన సైనిక, పౌరుల అవసరాలకు అనుగుణంగా నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఇందుకోసం సివిల్ ఏవియేషన్‌తో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రక్షణశాఖ సైతం చెప్పిందని వెల్లడించారు. ఈ నెల 17న ఆదిలాబాద్ భూముల పరిశీలనకు అధికారులు వెళ్తారని, రక్షణ శాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిన తర్వాత నిర్ణయం తీసుకుంటారన్నారు. ఆదిలాబాద్ లో రక్షణ శాఖకు 360 ఎకరాలు ఉందని, ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం 450 ఎకరాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఎయిర్ పోర్టు ఏర్పాటుకు కావాల్సిన అనుకూలతు ఆదిలాబాద్ లో ఉన్నాయని చెప్పారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం వద్ద ఎయిర్ పోర్టును రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించింది. ఇక్కడ ఎయిర్ పోర్టు ప్రతిపాదనపై ఫీజబులిటీ నివేదిక సానుకూలంగా ఉందని చెప్పారు.

## తీర్పే తరువాయి

### కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ నివేదిక

- హైకోర్టులో పిటిషన్లు.. ముగిసిన వాదనలు
- తుది తీర్పు వాయిదా వేసిన హైకోర్టు
- ఇదే సమయంలో హరీశ్ లేఖ



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పుతున్న కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణకు సంబంధించి రాష్ట్ర హైకోర్టు తీర్పు వాయిదా తీసింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై తీర్పును ఏప్రిల్ 22వ తేదీకి వాయిదా వేసింది. వాస్తవానికి ఈ పిటిషన్లపై ఇప్పటికే సుదీర్ఘంగా వాదనలు విన్న ధర్మాసనం, బుధవారం (ఏప్రిల్ 8) నాడే తుది తీర్పు వెలువరించాల్సి ఉంది. అనివార్య కారణాలతో తీర్పు వెల్లడిని తెలంగాణ హైకోర్టు మరికొన్ని రోజులు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది.

**పీసీ ఘోష్ కమిషన్ నివేదిక**

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంతో పాటు వాటి నిర్వహణలో జరిగిన లోపాలు, అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2024, మార్చి 14న జీవో నంబర్ 6ను జారీ చేసింది. ఈ జీవో ద్వారా జస్టిస్ పీసీ ఘోష్ అధ్యక్షతన బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలు, జరిగిన మిగతా 02లో

## జీవన్ రెడ్డికి.. లైన్ క్లియర్

### పార్టీలోకి తీసుకునేందుకు కేసీఆర్ ఒకే

- కేటీఆర్, హరీష్ తో భేటీలో నిర్ణయం
- జీవన్ ను ఆహ్వానించనున్న కేటీఆర్



- నేడు జగిత్యాలలో కేటీఆర్‌తో కీలక భేటీ

09

## వాసవి తీరుతో.. బయ్యర్లు బేజారు

### హఫీజ్‌పేట్ లేక్‌సిటీ అప్పగింత ఆలస్యం

- 2024లో ప్రాజెక్టును హ్యాండోవర్ చేయాలి
- ప్రాజెక్టు సైటు వద్ద బయ్యర్లు నిరసన..
- వాసవి అర్బన్ కూడా ఇదే పరిస్థితి..
- పత్తా లేని వాసవి డైరెక్టర్లు, పార్ట్‌నర్లు
- నిధుల దారి మళ్లింపుతోనే వచ్చిన చిక్కు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
సొంతింటి కలను నిజం చేస్తామంటూ రంగు రంగుల ప్రచారం చేస్తున్న వాసవి గ్రూపు మోసాలు రోజుకోతీరుతో బయటకు వస్తున్నాయి. వాసవి గ్రూపు చేస్తున్న ఆగడాలపై బయ్యర్లు ఫిర్యాదులతో క్యూ కడుతున్నారు. తమ ఫ్లాట్ల కోసం అడిగితే.. దాడులు చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. నిజానికి, వాసవి గ్రూపు ముందు నుంచీ వివాదాల్లోనే కొనసాగుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ఆ పార్టీకి చెందిన కీలక నేతల అండదండలతో చెరువులు.. నాలాలు కబ్జా చేసి నిర్మాణాలు చేశారు. వాటిపై హైడ్రా ఇప్పటికే నోటీసులు ఇచ్చింది. కానీ, ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీ కీలక నేతలతో ఉన్న సయోధ్య కారణంగా వాసవి గ్రూపు నిర్మాణాలపై ఇంకా హైడ్రా అడుగు మిగతా 02లో

ఖర్చుగా కాదు..


## భాగస్వామ్యంగా చూడండి

### కంపెనీల ప్రతినిధులతో సీఎం భేటీ



**ముద్ర, హైదరాబాద్:**
సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సీఎస్ఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కంపెనీలు సీఎస్ఆర్‌కు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుందని తెలియజేశారు. కంపెనీలు వీటితో పాటు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచుకొని సీఎస్ఆర్ నిధులు వినియోగించాలని సూచించారు. ప్రభుత్వంతో పాటు కంపెనీలు కలిపి చేసే వ్యయంతో తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యం మిగతా 02లో

ఛత్తీస్‌గఢ్‌లోని దమ్తరీ జిల్లాకు చెందిన రూపేశ్ కోసరియా-కిరణ్ కోసరియా దంపతులకు వారి వంశంలో దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఆడపిల్ల జన్మించడంతో కుటుంబసభ్యులు సంబుర పడ్డారు





సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 09.04.2026
www.mudranews.in | @mudranews



శక్తివంతమైన ప్రోటీన్ మూలం



కోడిగుడ్డు పూర్తి ప్రోటీన్‌ను అందిస్తుంది. ఇది శరీర కండరాల పెరుగుదలకు, మరమ్మతుకు సహాయపడుతుంది.

# తీర్పే తరువాయి

(మొదటి పేజీ తరువాయి)

అవకతవకలపై విచారణ కమిషన్ ఏర్పాటైంది. కమిషన్ సైతం విచారణ చేపట్టి నివేదిక రూపొందించింది. ఈ రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. అయితే, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు, ఐఏఎస్ స్మితా సభర్వాల్, మాజీ ఐఏఎస్ ఎస్.కె.జోషిలు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ కీలక అంశంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గతంలోనే సుదీర్ఘ విచారణ జరిపింది. పిటిషనర్ల తరపున వాదనలు, ప్రభుత్వ తరపున వాదనలు పూర్తికావడంతో తుది తీర్పును ధర్మాసనం రిజర్వ్ చేసింది. ఈ తీర్పు ఈ నెల 22కు వాయిదా పడటంతో, కాళేశ్వరం విచారణ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా రాజకీయంగానూ, సాంకేతికంగానూ ప్రాధాన్యత కలిగిన ఈ వ్యవహారంలో హైకోర్టు ఎలాంటి తీర్పు ఇవ్వబోతుందనేది అటు బీఆర్ఎస్‌తో పాటు ఇటు కాంగ్రెస్ పార్టీలో ఉత్కంఠ నెలకొంది.

**ఇటు హరీశ్ లేఖ**

ప్రతిష్టాత్మక కాళేశ్వరంతో పాటు దేవాదుల ప్రాజెక్టుల మోటార్లను కాంగ్రెస్ ప్రభుత్వం పాడుచేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. భారీ నీటిపారుదల మోటార్లను ఇష్టానుసారంగా ఆన్, ఆఫ్ చేయడం వల్ల వాటి పనితీరు దెబ్బతింటుందని, కనీసం అవగాహన లేదా అంటూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ప్రాజెక్టులకు సంబంధించిన భారీ మోటార్లను నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా ఆన్ ఆఫ్ చేసి అశాస్త్రీయంగా వర్క్ చేస్తున్నారని హరీష్ రావు విమర్శించారు. ఇలా చేస్తే వైబ్రేషన్స్ వచ్చి పంపులు, ఇంప్లర్స్, మోటార్స్ పాడయ్యే ప్రమాదం ఉందని.. వీటిని గత తమ ప్రభుత్వంపై నెట్టేందుకే ఉద్దేశపూర్వకంగా మోటార్లను పాడు చేస్తున్నారా అని లేఖలో ప్రశ్నించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ పాలనాపరమైన నిర్లక్ష్యంగా భావించాలా ? లేక ఉద్దేశపూర్వకంగానే జరుగుతున్న కుట్రనా? అని నిలదీశారు. భారీ మోటార్లు నిరంతరాయంగా నడిచేలా డిజైన్ చేసి ఉంటాయి. కానీ వాటిని పదే పదే ఆన్ చేయడం, ఆఫ్ చేయడం చేస్తే తీవ్ర నష్టం తప్పదని హెచ్చరించారు. ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులపై రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. చందలాపూర్ సహా ప్యాకేజీ 6, 8, 10, 11, 12 లలో మోటార్ల ఆపరేషన్ తీరు సరిగ్గా లేదన్నారు. మోటార్లను ఇంజనీరింగ్ నిబంధనల ప్రకారం శాస్త్రీయంగా ఆన్ ఆఫ్ చేయాలని సూచించారు.



# వాసవి తీరుతో.. బయ్యర్లు బేజారు

(మొదటి పేజీ తరువాయి)

పెట్టడం లేదు. ఇదంతా ఓవైపు కొనసాగుతుండగానే.. రెండేండ్ల కిందట అప్పగించాల్సిన హఫీజ్ పేట లేక్ సిటీ ఫ్లాట్లు ఇంకా ఇవ్వడం లేదు. ఈ ప్రాజెక్టు సైటు దగ్గర ఇప్పటికే చాలా మంది బయ్యర్లు ఆందోళనకు దిగారు.

**సమాధానం ఇవ్వరు.. చిక్కరు.. దొరకరు**

కేవలం కొనుగోళ్లు మొదలుపెట్టినప్పుడే వాసవి గ్రూపు యాజమాన్యం, డైరెక్టర్లు కనిపించి.. మాయమాటలు, రంగుల పత్రాలతో ప్రాజెక్టును చూపిస్తారు. ప్రీలాంచ్ తరహాలో ముందుగానే లక్షలు వసూలు చేస్తారు. కానీ, అనుకున్న సమయానికి ఫ్లాట్లు హ్యాండోవర్ చేయడంలో మాత్రం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల వాసవి గ్రూపు మీద వరుసగా ఆరోపణలు, విమర్శలు వస్తున్నా.. బయ్యర్లు ఆందోళన చేస్తున్నా డైరెక్టర్లు, పార్టనర్లు పత్తా లేకుండా పోయారు.

**పన్నులు ఎగవేత**

వాసవి కన్‌స్ట్రక్షన్స్, వాసవి గ్రూప్ ఆఫ్ వెంచర్స్ పై ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఇటీవల దాడులు చేసిన విషయం తెలిసిందే. వందల కోట్ల వ్యాపారం చేస్తూ భారీగా పన్ను ఎగ్గొట్టారన్న సమాచారంతో 40కి పైగా అధికార బృందాలు ఏకకాలంలో 20 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. వాసవి గ్రూప్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌తోపాటు డైరెక్టర్ల ఇళ్లపై కూడా దాడులు చేశారు. సంస్థ ప్రధాన కార్యాలయం, అనుబంధ ఆఫీసుల్లో సోదాలు చేశారు. ఈ క్రమంలో ఐటీ అధికారులు పలు కీలక డాక్యుమెంట్లను సీజ్ చేశారు. వాసవి గ్రూప్ సంస్థకు వస్తున్న ఆదాయం.. ప్రభుత్వానికి చెల్లిస్తున్న ఆదాయపు పన్న మధ్య భారీ వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించి ఇప్పటికే కేసలు నమోదు చేశారు.



**వసూలు చేసి.. నిధులు దారి మళ్లించి..**

ఇప్పటికే చాలా ఆర్థిక కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న వాసవి గ్రూపు.. ఆదాయం సమకూర్చుకోవడంలో మాత్రం మోసపూరిత ప్రణాళికలు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఒక ప్రాజెక్టును మొదలుపెట్టకముందే అక్కడ అమ్మకాలు మొదలుపెడుతోంది. పెద్ద ఎత్తున ప్రచారం, మధ్య దళారులకు కమీషన్లతో బయ్యర్లకు వల వేస్తోంది. వారి నుంచి సేకరించిన సొమ్ముతో ఆ నిర్మాణాలు చేయకుండా.. మరో చోట భూములను కొనుగోలు చేసి అక్కడ కూడా ఓ ప్రాజెక్టు చేస్తామంటూ ప్రచారానికి దిగుతోంది. అయితే, ఇక్కడ వసూలు చేసి సొమ్ముతో నిర్మాణాలను కొంత మేరకు చేసి వదిలేస్తున్నారు. మరోవైపు ఫైనాన్స్ రాకపోవడం, కొత్తగా కొనుగోలు చేసిన భూముల దగ్గర కొత్త ప్రాజెక్టు అంటూ మాయమాటలతో బయ్యర్లను నిండా ముంచుతున్నారు. ఇలా నిధులు దారి మళ్లించడంలో వాసవి గ్రూపు ఆరితేరిందని బయ్యర్లు ఆరోపిస్తున్నారు.

**వెంటాడుతున్న హైడ్రా భయం**

మరో వైపు వాసవి గ్రూప్ ను హైడ్రా భయం వెంటాడుతోంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నిజాంపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బాచుపల్లిలో సంస్థ వాసవి అర్బన్ పేర భారీ ప్రాజెక్టును నిర్మిస్తోంది. అయితే, కోమటి కుంట చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్ లో వాసవి అర్బన్ పేర భారీ టవర్లను నిర్మించింది. దీనిపై విచారణ జరిపిన ఇరిగేషన్ శాఖ అధికారులు గతంలోనే హెచ్ఎండీఏకు నివేదిక కూడా ఇచ్చారు. మొత్తం 8 ఎకరాల్లో 23 అంతస్తులతో 12 టవర్లను నిర్మిస్తున్న వాసవి గ్రూప్ దీంట్లోని 8, 9 టవర్లను కోమటి కుంట చెరువు బఫర్ జోన్ లో నిర్మించింది. దీనిపై సర్వే చేసిన ఇరిగేషన్ అధికారులు బఫర్ జోన్ ఆక్రమణ జరిగినట్టుగా నిర్ధారించారు కూడా. బఫర్ జోన్ ఆక్రమణలపై పలువురు హైడ్రాకు ఫిర్యాదులు చేశారు. దాంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు మరోసారి ఇరిగేషన్ అధికారులతో కలిసి జాయింట్ సర్వే చేశారు. దీంట్లో కూడా వాసవి గ్రూప్ కోమటి కుంట చెరువు బఫర్ జోన్ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేసినట్టుగా నిర్ధారణ అయ్యింది. అయితే, హైడ్రా అధికారులు ఇప్పటివరకు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

**వెంటాడుతున్న నాలా కబ్జా ఆరోపణలు**

ఇక, కూకట్ పల్లిలో వాసవి సరోవర్ ప్రాజెక్ట్ పేర నిర్మించిన నిర్మాణాలపై కూడా ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీంట్లో నాలా కబ్జా చేశారని స్థానికులు చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువుల పరిరక్షణ, సుందరీకరణ కోసమంటూ పలు చెరువులను దత్తతకు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మైసమ్మ చెరువు, కాముని చెరువులను దత్తత తీసుకున్న వాసవి గ్రూప్ దాని పేర రెండు చెరువుల నాలాలను కబ్జా చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. మైసమ్మ చెరువు, కాముని చెరువు మధ్య వాసవి సరోవర్ పేరుతో 21 ఎకరాల్లో 11 బ్లాక్స్ గా జీ ప్లస్ 29 అంతస్తుల నిర్మాణాలు చేపట్టింది. అయితే, దీని కోసం చెరువుల స్థలాలతోపాటు నాలాను కబ్జా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. నిజానికి నిర్మాణాల కోసం హెచ్ఎండీఏ అనుమతులు తీసుకున్న సమయంలో 17 మీటర్ల నాలా నిర్మిస్తామి వాసవి గ్రూప్ పేర్కొంది. అయితే, నాలా నిర్మాణం చేయకపోగా నాలాలోనే పిల్లర్లు వేసి నిర్మాణాలు చేపట్టింది. చెరువు స్థలంలో మట్టి పోసి నిర్మాణాలు ప్రారంభించింది. దీనిపై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు కూడా చేశారు. ఇక, నాలా కబ్జాపై ఇరిగేషన్ అధికారులు చేసిన ఫిర్యాదుపై కూకట్ పల్లి పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. దీనిపై కూడా హైడ్రా ఏ క్షణంలోనైనా చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.

**కొనుగోలుదారులను ముంచుతున్నారు**

వాసవి గ్రూప్ పై కొనుగోలుదారులు ఆందోళనకు దిగుతున్నారు. డబ్బు మొత్తం చెల్లించినా ప్లాట్లను అప్పగించక పోవటంతో వందలాది మంది కొనుగోలుదారులు కార్పోరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు. హఫీజ్ పేటలో వాసవి లేక్ సిటీ ప్రాజెక్ట్ పేర సంస్థ నిర్మాణాలు చేపట్టగా 2020లో ఫ్లాట్లను బుక్ చేసుకున్న వందలాది మంది 90శాతం డబ్బు కూడా చెల్లించారు 2024 నాటికి ప్రాజెక్ట్ పూర్తి చేసి డబ్బు చెల్లించిన వారికి ఫ్లాట్లు అప్పగించాల్సి ఉన్నా వాసవి గ్రూప్ ఇప్పటికీ నిర్మాణాలను పూర్తి చేయలేదు. ఈ నేపథ్యంలోనే కొనుగోలుదారులు ఆందోళనకు దిగారు. ఇక్కడ గమనించాల్సిన మరో అంశం ఏమిటంటే ఉప్పల్‌లో వాసవి మెట్రో పోలిస్ ప్రాజెక్టులో ఫ్లాట్లు కొనటానికి డబ్బు చెల్లించిన వారు కూడా నిరసనలో పాల్గొనటం. చెప్పిన సమయానికి తమకు ఫ్లాట్లను ఎందుకు అప్పగించ లేదని నిలదీయటం. ఇలా జరుగుతున్న వరుస పరిణామాలతో వాసవి గ్రూప్ యాజమాన్యం ఉక్కిరిబిక్కిరవుతోంది. గత ప్రభుత్వ హయాంలో కీలక నేతల అండతో ఆడింది ఆటగా పాడింది పాటగా వ్యవహరించింది.

## గల్ఫ్ యుద్ధం మాటున బలూచిస్తాన్‌లో

# రక్తపాతం!

**ముద్ర డెస్క్ :**

ప్రపంచం మొత్తం ఇరాన్–అమెరికా యుద్ధం, గల్ఫ్ సంక్షోభంపై దృష్టి సారించింది. యుద్ధం ఇంకా ఎన్నాళ్లు సాగుతుంది. ఎవరు గెలుస్తారు. ఎవరు ఎవరిపై దాడులుచేస్తున్నారు అని ఆలోచిస్తున్నారు. ఈ పందెట్లో సడేమియా అన్నట్లుగా పాకిస్తాన్ మధ్యవర్త్విం చేస్తున్నట్లు, సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కొరియర్ ఉద్యోగాలు చేసింది. కానీ పాకిస్తాన్ బయట పల్లకి మోత మోగించుకుంటుంది. కానీ అంతర్గతంగా బలూచిస్తాన్‌లో మార్చి 29 నుంచి ఏప్రిల్ 1 వరకు కేవలం నాలుగు రోజుల్లో 65 దాడులు ఒక్క బలూచిస్తాన్‌లోనే జరిగాయి. బయటకు మాత్రం 'మధ్యవర్తిత్వం వహిస్తున్న శాంతి దూత'గా చిత్రించుకుంటున్న పాకిస్తాన్.. లోపల మాత్రం బలూచిస్తాన్‌లో విలయ తాండవం సృష్టిస్తోంది.

**నాలుగు రోజుల్లో 65 దాడులు..**

మార్చి 29 నుంచి ఏప్రిల్ 1 వరకు కేవలం నాలుగు రోజుల వ్యవధిలో బలూచిస్తాన్‌లోని 9 జిల్లాల్లో 65 సమన్వయ దాడులు జరిగాయి. బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) నిర్వహించిన ఈ 'ఆపరేషన్ హెరాఫ్'లో 84 నుంచి 86 మంది పాకిస్తాన్ సైనికులు, అధికారులు మరణించారు. 18 మంది కీలక అధికారులు బందీలుగా పట్టుపడ్డారు. పంజ్‌గుర్, షాపుక్, బసిమా, సిబి, మాస్తంగ్, క్వెట్టా, నుష్కి, ఝూల్ మాగ్సి, ఖారన్ తదితర జిల్లాల్లో దాడులు జరిగాయి. పోలీస్ స్టేషన్లు, హై–సెక్యూరిటీ జైళ్లు, మిలటరీ క్యాంపులు, ఎయిర్ బేస్ రాడార్లు, గ్యాస్ పైప్‌లైన్లు, రైల్వే ట్రాక్‌లు లక్ష్యంగా దాడులు జరిగాయి.

**14 నిమిషాల వీడియో విడుదల..**

బలూచ్ లిబరేషన్ ఆర్మీ తన అధికారిక యూట్యూబ్ ఛానల్ 'హక్కల్'లో ఈ దాడులకు సంబంధించిన 14 నిమిషాల నిడివి గల వీడియోను విడుదల చేసింది. ఈ వీడియోలో ధ్వంసమైన పాకిస్తాన్ మిలటరీ కాన్వాయ్‌లు, కూలిపోయిన శంషేర్ ఎయిర్ బేస్ రాడార్ వ్యవస్థ, మృతదేహాలుగా పడిఉన్న పాక్ జవాన్లు, అధికారులు, మండిపోతున్న పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ భవనాలు, క్వెట్టా ఈస్టర్న్, వెస్టర్న్ బైపాస్‌లపై దాడుల దృశ్యాలు ఉన్నాయి.

**కీలక అధికారుల బందీ..**

సాధారణ జవాన్లు బందీ అయితే పాకిస్తాన్ పెద్దగా పట్టించుకోదు. కానీ, 18 మంది కీలక అధికారులు(సీనియర్ ఆర్మీ ఆఫీసర్స్, ఇంటెలిజెన్స్ అధికారులు) బందీ కావడం ఇస్లామాబాద్‌కు తీవ్రమైన సవాలుగా మారింది. వీరిని విడిపించడానికి పాకిస్తాన్ ఇప్పుడు బేరసారాలు చేయాల్సిన పరిస్థితి. బీఎల్ఏ గతంలో కూడా బందీలను విడిపించడానికి భారీ ఖైదీల మార్పిడికి డిమాండ్ చేసింది.

**బీఎల్ఏ బలం ఎలా పెరిగింది?**

బీఎల్ఏ కూడా కొన్ని రోజులుగా బలం పుంజుకుంటోంది. ఆత్మాహుతి దాడులను 'ఫిదాయీ ఆపరేషన్స్'గా మార్చి, యువతను ఆకర్షిస్తోంది. భారత్, పశ్చిమ దేశాల నుంచి పరోక్ష మద్దతు లభిస్తోంది. యూట్యూబ్, ట్విట్టర్ ద్వారా ప్రపంచానికి తమ పోరాటాన్ని చేరువ చేస్తోంది. ఒకేసారి అనేక ప్రాంతాల్లో దాడులు చేసి, పాక్ సైన్యాన్ని అస్తవ్యస్తం చేస్తోంది.

**నామమాత్రంగా పాకిస్తాన్ ప్రభుత్వం..**

బలూచిస్తాన్‌లో పాకిస్తాన్ ప్రభుత్వ అధికారం కేవలం క్వెట్టా నగరం వరకే పరిమితమైందని, మిగిలిన ప్రాంతాలన్నీ బీఎల్ఏ, ఇతర వేర్పాటువాద సంస్థల నియంత్రణలో ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పగటిపూట పాక్ సైన్యం నియంత్రణలో ఉన్న ప్రాంతాలు, రాత్రిపూట బీఎల్ఏ వశమవుతున్నాయి. క్వెట్టా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే హైవేలు, బైపాస్‌లు బీఎల్ఏ దాడులకు గురవుతున్నాయి. పాక్ సైనిక స్థావరాలే ప్రధాన టార్గెట్‌లుగా మారాయి.

పాకిస్తాన్ మీడియా బ్లాక్అవుట్, అంతర్జాతీయ దృష్టి మళ్లించే వ్యూహాలు తాత్కాలిక పరిష్కారాలు మాత్రమే. బీఎల్ఏ విడుదల చేసిన 14 నిమిషాల వీడియో, 84 మంది జవాన్ల మరణం, 18 మంది అధికారుల బందీ ఇవన్నీ దాచలేని నిజాలు. పాకిస్తాన్ ఇప్పుడు ఎంచుకునే మార్గమే ఆ దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

# ఖర్చుగా కాదు.. భాగస్వామ్యంగా చూడండి



(మొదటి పేజీ తరువాయి)

ఉన్న వారిగా తీర్చిదిద్ది భవిష్యత్ అవకాశాలను వారు అందిపుచ్చుకునేలా తయారు చేయగలమని సీఎం అన్నారు. విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్ నగరంలోనే 44 శాతం ఉన్నారని.. వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. కంపెనీలు స్థానికంగా ఉన్న అన్ని మౌలిక వసతులను వినియోగించుకుంటున్నందున తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలన్నారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటి వరకు సరైన విధానం లేనందున తాము ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఇందుకు నియమించామని సీఎం తెలిపారు. కంపెనీల ప్రతినిధులు ఆయనతో సమన్వయం చేసుకొని తమకు ఆసక్తి ఉన్న విద్యా, వైద్యం, జల వనరులు, నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణ ఇలా దేనికైనా సీఎస్ఆర్ నిధులు వినియోగించవచ్చని సీఎం తెలిపారు. ఇప్పటికే రహేజా గ్రూప్ రూ.50 కోట్లు, రాంకీ గ్రూప్ రూ.50 కోట్లు, యశోద ఫౌండేషన్ రూ.10 కోట్లు విద్యాభివృద్ధికి కేటాయించేందుకు ముందుకు వచ్చాయని.. వారికి సీఎం అభినందనలు తెలిపారు. కంపెనీల ప్రతినిధులు స్పందిస్తూ సీఎస్ఆర్ నిధుల విషయంలో ఇప్పటి వరకు ఇలా ఎవరూ తమను సంప్రదించలేదని తెలిపారు. ఈ విషయంలో చొరవ తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్యా, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు వారు ఆసక్తి చూపారు.. సమావేశంలో రహేజా ఫౌండేషన్ నుంచి శ్రావణ్ కుమార్, రాంకీ ఫౌండేషన్ నుంచి దాక్షయణి ఆళ్ల, యశోద ఆసుపత్రి నుంచి డాక్టర్ గోరుకంటి సురేందర్ రావు, గోరుకంటి ఫల్గుణ్ రావు, మేఘా నుంచి సుధా రెడ్డి, అపోలో ఆసుపత్రి నుంచి అపర్ణా రెడ్డి, కామినేని భాస్కర్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి శేఖర్ రెడ్డి, NAA-DAM ఫౌండేషన్ నుంచి పగిడిపాటి దేవయ్య, రుద్రమదేవి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రాజకీయాలతో బీపీ, షుగర్ వచ్చింది

## రోజా కీలక వ్యాఖ్యలు

**ముద్ర డెస్క్ :**

రాజకీయాలు అంటే కేవలం అధికారం.. ప్రోటోకాల్, ప్రజాకర్షణ మాత్రమే కాదు.. వాటి వెనుక అంతులేని మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ, ఆరోగ్య సమస్యలు కూడా దాగి ఉంటాయని మాజీ మంత్రి, వైసీపీ ఫైర్ బ్రాండ్ ఆర్.కె. రోజా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఆమె మీడియా తో మాట్లాడుతూ తన రాజకీయ ప్రయాణంలో ఎదురైన ఆరోగ్య సవాళ్లను, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను విశ్లేషించారు.

**రాజకీయ ప్రయాణం..**

రోజా తన వ్యక్తిగత అనుభవాలను పంచుకుంటూ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత తన ఆరోగ్యం ఎలా ప్రభావితమైందో వివరించారు. ప్రజా సేవలో నిరంతరం నిమగ్నమవ్వడం వల్ల వచ్చే ఒత్తిడి సామాన్యమైనది కాదని ఆమె పేర్కొన్నారు. తాను తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన సమయంలోనే ప్రజల సమస్యలు పరిష్కరించాలనే తపన, నిరంతర క్షేత్రస్థాయి పర్యటనల వల్ల కలిగిన ఒత్తిడి కారణంగా తనకు బీపీ (రక్తపోటు) సమస్య మొదలైందని తెలిపారు. రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచి బాధ్యతలు మరింత పెరిగిన క్రమంలో పని ఒత్తిడి తోడై తనకు షుగర్ (మధుమేహం) కూడా వచ్చిందని ఆమె వెల్లడించారు. ఆశ్చర్యకరంగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత తనపై రాజకీయ ఒత్తిడి తగ్గిందని దానివల్ల ఆరోగ్యం ప్రస్తుతం మెరుగుపడుతోందని ఆమె హాస్యంగా వ్యాఖ్యానించారు. "రాజకీయాల ఒత్తిడి తగ్గితే ఆరోగ్యం కూడా 'కాంపెన్సేట్' అవుతుంది" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

**వైసీపీ పాలన.. ఓటమిపై విశ్లేషణ**

గత వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల గురించి రోజా గర్వంగా మాట్లాడారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమం అంటే ఏమిటో దేశానికి చూపించామని ఆమె అన్నారు. "మేము ప్రజల మధ్య ఉండి సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేశాం. కానీ ఎన్నికల సమయంలో అబద్ధాలు చెప్పడం మాకు చేతకాలేదు. బహుశా ఆ అబద్ధపు హామీలు ఇవ్వలేకపోవడమే మా ఓటమికి ప్రధాన కారణం కావచ్చు " అని ఆమె విశ్లేషించారు. వైసీపీకి గ్రామ స్థాయిలో చెక్కుచెదరని క్యాడర్ ఉందని, ముఖ్యంగా సర్పంచ్‌లు తమ గ్రామాల్లో గర్వంగా తిరిగేలా జగన్ ప్రభుత్వం నిధులు, అధికారాలు కల్పించిందని ఆమె గుర్తు చేశారు.


**భవిష్యత్తుపై ధీమా**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై రోజా క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన వారికి త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వైసీపీ మళ్లీ పుంజుకుంటుందని క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

మొత్తానికి రోజా చేసిన వ్యాఖ్యలు రాజకీయ నాయకుల తెర వెనుక జీవితాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ప్రజా సేవలో ఉన్నవారు తమ ఆరోగ్యాన్ని కూడా పణంగా పెట్టి పని చేస్తారని చెబుతూనే మరోవైపు తన పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటామని ఆమె స్పష్టం చేశారు. ఆమె వ్యాఖ్యలు రాజకీయాల్లో గెలుపోటముల కంటే మానసిక ప్రశాంతత, ఆరోగ్యం ఎంత ముఖ్యమో తెలియజేస్తున్నాయి.

**కోడి గుడ్డు : మెదడు ఆరోగ్యానికి మేలు**

గుడ్డులో ఉన్న చోలిన్ మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. జ్ఞాపకశక్తి పెరగడంలో సహాయపడుతుంది.



# హైకోర్టు గ్రీన్ సిగ్నల్

- శాంతియుతంగా సభ నిర్వహించుకోండి
- బీఆర్ఎస్ వనపర్తి సభపై హైకోర్టు వ్యాఖ్యలు
- సభకు వెళ్లేందుకు హరీశ్ రావుకు అనుమతి



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మాజీ మంత్రి హరీశ్ రావు వనపర్తి పర్యటనకు మార్గం సుగమమైంది. ఆయన్ను వనపర్తికి వెళ్లేందుకు హైకోర్టు అనుమతి మంజూరు చేసింది. ఈ పర్యటనకు అనుమతి నిరాకరిస్తూ జిల్లా ఎస్పీ ఇచ్చిన ఆదేశాలను బుధవారం కొట్టివేసింది. నేడు నియోజకవర్గంలో హరీశ్ రావు సభ నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసింది. కాగా వనపర్తి జిల్లాలోని గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి వ్యతిరేకంగా గత కొంతకాలంగా రైతులు ఆందోళనలు చేస్తున్నారు. నిర్వాసిత రైతులకు సంఘీభావం తెలిపేందుకు, వారి సమస్యలపై పోరాడేందుకు హరీశ్ రావు రేపు వనపర్తి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీనికోసం ముందుగా అనుమతులు తీసుకున్నప్పటికీ, చివరి నిమిషంలో శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందంటూ జిల్లా ఎస్పీ ఆ అనుమతులను రద్దు చేశారు. దీంతో పోలీసుల నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం సరికాదని ఆయన తరపు న్యాయవాదులు కోర్టులో వాదించారు. వాదనలు విన్న హైకోర్టు.. పోలీసుల అభ్యంతరాలను తోసిపుచ్చుతూ సభ నిర్వహణకు అనుమతి ఇచ్చింది. అయితే నిబంధనల ప్రకారం, శాంతియుతంగా సభ నిర్వహించుకోవాలని సూచించింది.



# వేములపల్లి శ్రీకృష్ణకు ఘన నివాళి

**ముద్ర, హైదరాబాద్:**

హైదరాబాద్ కొండాపూర్‌లోని సీ ఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి, మాజీ శాసనసభ సభ్యులు, విశాలాంధ్ర మాజీ సంపాదకులు వేములపల్లి శ్రీకృష్ణ 26వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ఆరంభంగా సీ ఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, వేములపల్లి శ్రీకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సభలో వేములపల్లి శ్రీకృష్ణ తన తుది శ్వాస వరకు సీ ఆర్ ఫౌండేషన్ స్థాపన, అభివృద్ధికి చేసిన సేవలను స్మరించుకున్నారు. అలాగే ఆయన రచించిన "చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా, గతమెంతో ఘనకీర్తి గలవోడా" గేయం ద్వారా తెలుగు జాతికి నూరిపోసిన ఆత్మగౌరవ భావనను కొనియాడారు. ప్రతిపక్ష నాయకుడిగా, శాసనసభ సభ్యునిగా, విశాలాంధ్ర సంపాదకుడిగా ఆయన చేసిన సేవలను పలువురు గుర్తు చేశారు.


ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమం డైరెక్టర్ మరియు సీ ఆర్ ఫౌండేషన్ కోశాధికారి వి.చెన్నకేశవరావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె.రజిని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోశ్యభట్ల కల్పన, సభ్యులు కనపర్తి జ్యోత్స్న, ఐ ఎస్ రాజు, వృద్ధాశ్రమ వాసులు తదితరులు పాల్గొని పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

# ఏడాది పాటు ట్రాఫిక్ డైవర్షన్

- గచ్చిబౌలి టు లింగంపల్లి మార్గంలో ఆంక్షలు
- ట్రిపుల్ ఐటీ జంక్షన్ వద్ద మల్టీ లెవెల్ ఫ్లైఓవర్, అండర్ పాస్ నిర్మాణ పనులు షురూ
- వాహనదారులకు ప్రత్యామ్నాయ మార్గాల సూచన

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

గచ్చిబౌలి లింగం పల్లి మార్గంలో ప్రయాణించే వాహనదారులకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక ప్రకటన చేశారు. గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ జంక్షన్ వద్ద మల్టీ లెవెల్ ఫ్లైఓవర్, అండర్ పాస్ నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో, ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. ఈ ఆంక్షలు ఏకంగా ఏడాది పాటు అమల్లో ఉంటాయని తెలిపారు. గచ్చిబౌలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చేపడుతున్న మల్టీ లెవెల్ ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రిపుల్ ఐటీ జంక్షన్ వైపు వచ్చే వాహనాలపై ఆంక్షలు ఉంటాయన్నారు. దీంతో గచ్చిబౌలి నుంచి లింగంపల్లి, కొండాపూర్ వైపు వెళ్లే వాహనాదారులపై ఈ ప్రభావం ఎక్కువగా పడతుందన్నారు. వాహనదారులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు. గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వెళ్లే వాహనాలు నేరుగా కాకుండా ఇతర అంతర్గత రోడ్ల ద్వారా వెళ్లాల్సి ఉంటుంది. ట్రిపుల్ ఐటీ జంక్షన్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను వివిధ పాయింట్ల వద్ద డైవర్ట్ చేస్తున్నారు. గచ్చిబౌలి జంక్షన్, రాడిసన్ హోటల్ పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీ పెరిగే అవకాశం ఉండటంతో అదనపు సిబ్బందిని మోహరించారు. ఒక సంవత్సరం పాటు ఈ పనులు కొనసాగుతాయని, వాహనదారులు తమ ప్రయాణ సమయాన్ని బట్టి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని పోలీసులు కోరారు. ముఖ్యంగా ఐటీ ఉద్యోగులు, నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే వారు గూగుల్ మ్యాప్స్, ట్రాఫిక్ పోలీసుల సూచనలను గమనిస్తూ సహకరించాలని రిక్వెస్ట్ చేశారు.



# అక్రమాలు నిరూపిస్తే.. ముక్కు నేలకు రాస్తా

- భూ అక్రమాల్లో మా ప్రమేయం లేదు
- శకుని మామ డైరెక్షన్ లో డ్రామా రావు నాటకం
- ప్రభుత్వ ఆదరణ చూసి ఓర్వలేకే నిరాధార ఆరోపణలు
- మీడియాతో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

శకుని మామ కేసీఆర్ డైరెక్షన్‌లో అబద్దాల హరీష్‌రావు, డ్రామారావు కేటీఆర్ లు తమ ప్రభుత్వం, మంత్రులపై సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దుయ్యబట్టారు. గత పదేళ్ల తమ పాలనలో రాష్ట్రాన్ని కొల్లగొట్టి, ఒంటి నిండా అవినీతి బురద పూసుకున్న కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ఆ బురదను ప్రజా ప్రభుత్వానికి అంటించాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వ పథకాలకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక, పాత తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వానికి అంటగట్టేందుకు ప్రతిపక్షం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నాదర్గుల్, వట్టినాగులపల్లి, కొత్వాల్‌గూడ భూ అక్రమాలపై హరీశ్ రావు చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ఒకవేళ రాష్ట్రంలో ఎక్కడైనా భూ అక్రమాలకు పాల్పడినట్లు నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు. బుధవారం సచివాలయంలో మంత్రులు సీతక్క, పొన్నంప్రభాకర్ , ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, సామెల్ , బి. లక్ష్మారెడ్డి, శ్రీ గణేష్, రాంమోహన్ రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. నాదర్‌గుల్ భూముల వ్యవహారంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు చేసిన అవినీతి ఆరోపణలను ఖండించారు. నాదర్‌గుల్ భూములకు సంబంధించి 2014లోనే బీఆర్ఎస్ ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు చేసిందని ఆయన ఆధారాలు బయటపెట్టారు. హరీశ్ రావు ఆరోపిస్తున్న సర్వే నంబర్ 613లోని భూములను 2014లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సంస్థలకు రిజిస్ట్రేషన్ చేసిందన్నారు. భూముల మ్యుటేషన్ జరిగిన 2016లోనూ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉందని అన్నారు. 2014, 2016లో జరిగిన రిజిస్ట్రేషన్లతో తమ ప్రభుత్వానికి ఏం సంబంధమని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. దేవాలయం లాంటి అసెంబ్లీలో వారి ప్రవర్తనను ప్రజలంతా గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతారని ఫైరయ్యారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సన్నబియ్యం పథకానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేకనే ఇటువంటి దుష్ప్రచారానికి తెరలేపారని విమర్శించారు. హ్యామ్ రోడ్ల నిర్మాణం పూర్తయితే బీఆర్ఎస్ పార్టీ ఉనికి కోల్పోతుందన్న భయంతో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డిని, అలాగే మద్యం పాలసీ, టూరిజం పాలసీల విషయంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కావాలనే టార్గెట్ చేస్తున్నారని పొంగులేటి ఆరోపించారు. ప్రొహిబిటెడ్ భూముల్లో తమ ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేయలేదన్నారు. హరీష్ రావు చెబుతున్న కంపెనీల్లో తమ కుటుంబ సభ్యులెవరూ లేరని అన్నారు. తన కుటుంబ సభ్యులు ఉన్నారని నిరూపించాలని హరీష్ రావుకు సవాల్ విసిరారు. సర్వే నంబర్ 613లోని భూములను 2014లోనే మూడు సంస్థలకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసిందని ఆధారాలతో సహా చూపుతానని అన్నారు. ఈ భూముల్లో 2022లోనే నిర్మాణాలు ప్రారంభమయ్యాయని అప్పుడు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉందన్నారు. నాలా కన్వర్షన్ విషయంలో సదరు సంస్థలు కోర్టుకు వెళ్తే అప్పటి కేసీఆర్ ప్రభుత్వం కౌంటర్ కూడా దాఖలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# జవహర్‌నగర్ పై దృష్టి సారించాలి

- బస్తీల పిల్లల కోసం ప్రత్యేక ప్రణాళిక అవసరం
- బిహెచ్‌ఎస్ఎస్

**ముద్ర, హైదరాబాద్ :**





మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ డంపింగ్ యార్డు పరిసర బస్తీల్లో నివసిస్తున్న పిల్లలకు మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు ప్రభుత్వం పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం (బిహెచ్ఎస్ఎస్) డిమాండ్ చేసింది. పిల్లలకు అందుబాటులో ఉండేలా సమీప ప్రాంతాల్లోనే పాఠశాలలు ఏర్పాటు చేయాలని సంఘం అధ్యక్షుడు డా. గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ కోరారు. ముఖ్యమంత్రి వద్దే విద్యాశాఖ ఉన్న నేపథ్యంలో జవహర్‌నగర్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, ఎల్‌కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే బస్తీల్లో వెంటనే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, బడికి వెళ్లని పిల్లలను గుర్తించి సమ్మర్ క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తూ, వచ్చే విద్యాసంవత్సరానికి అనుగుణంగా వారికి విద్య సిద్ధత కల్పించాలని అన్నారు. సమీపంలో పాఠశాలలు లేకపోవడంతో అనేక మంది పిల్లలు విద్యకు దూరమై బాలకార్మికులుగా మారుతున్నారని, అసాంఘిక శక్తుల ప్రభావానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే హెల్త్ క్యాంపులు నిర్వహించి, ఆధార్, జనన, కుల ధృవపత్రాలు లేని పిల్లలకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా పత్రాలు అందించాలని సూచించారు. బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, లైంగిక దుర్వినియోగం, డ్రాపౌట్ వంటి సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని బిహెచ్ఎస్ఎస్ నేతలు కోరారు.



# మృతుల కుటుంబాలకు పరామర్శ

**ముద్ర, హైదరాబాద్:**

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లిలో ఐదు రోజుల క్రితం ఆకస్మికంగా మృతి చెందిన ప్రజా గాయకుడు జహంగీర్ కటుంబాన్ని, అలాగే సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో ఇటీవల మాతృమూర్తిని కోల్పోయిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూ డబ్ల్యూ జే) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూతురు రాజిరెడ్డిని బుధవారం టీయూ డబ్ల్యూ జే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, టీఎన్జీఓల సంఘం మాజీ అధ్యక్షులు దేవిప్రసాద్ రావు పరామర్శించారు. మూడు రోజుల క్రితం గుండె పోటుతో ఆకస్మికంగా మృతి చెందిన సియాసత్ ఉర్దూ దినపత్రిక గజ్వేల్ సీనియర్ జర్నలిస్టు ఎక్బాల్ కుటుంబాన్ని, రాయపోలు మండలం అనాజీపూర్ గ్రామంలో తల్లిని కోల్పోయిన సాక్షి విలేకరి నాగ వెంకట్ రెడ్డిని కూడా విరాహత్ అలీ పరామర్శించారు. విరాహత్ అలీతో పాటు గజ్వేల్ జర్నలిస్ట్స్ కాలనీ సంక్షేమ సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వై.సురేందర్, కె.మధుసూదన్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు యాదగిరి, కిరణ్ తదితరులు బాధిత కుటుంబాలను పరామర్శించారు.

# ఖర్గే వ్యాఖ్యలపై మీ వైఖరేంటి?

- సీఎం రేవంత్ కు బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ప్రశ్న
- ప్రత్యర్థులను విషపూరిత పాములతో పోల్చడం దారుణం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



బీజేపీ, ఆర్ఎస్ఎస్ లను విష సర్పాలని సంబోధించిన ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి తన వైఖరి తెలపాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. రాజకీయాల్లో ఉండి ప్రత్యర్థులను విషపూరిత పాములతో పోల్చడం, ఇతర వర్గాలను రెచ్చగొట్టేలా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ఆయన నిలదీశారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. విద్వేష పూరిత ప్రసంగాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును ప్రస్తావించారు. 'హేట్ స్పీచ్'లపై కఠిన చర్యలు తీసుకుంటామంటూ రేవంత్ రెడ్డి రాష్ట్ర అసెంబ్లీలో బిల్లును పాస్ చేశారని అన్నారు. మరి ఇప్పుడు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు ఆ పరిధిలోకి రావా అని ప్రశ్నించారు. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ఇలాంటి దారుణ వ్యాఖ్యలు చేసినప్పుడు రేవంత్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదన్నారు. రాజకీయాల్లో హుందాతనాన్ని పాటించాల్సిన నేతలే ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు. ప్రజల్లో విద్వేషాలు నింపేలా మాట్లాడటం హేట్ స్పీచ్ కిందికే వస్తుందని, దీనిపై తెలంగాణ ప్రభుత్వం తన వైఖరిని తెలపాలని లక్ష్మణ్ అన్నారు.

# కాల్పుల విరమణతో భారత్‌లో ఇంధన ధరలు తగ్గుతాయా?

అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణతో అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో ఊరట కనిపించింది. హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకునే అవకాశం రావడంతో ముడి చమురు ధరలు 13-14% వరకు పడిపోయాయి. దీంతో భారత్‌లో కూడా ఇంధన ధరలు తగ్గుతాయనే ఆశలు పెరిగాయి.

అయితే వాస్తవానికి దేశీయంగా వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. కారణం ఏమిటంటే, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఇప్పటికే ఎక్కువ ధరల సమయంలోనే చమురును కొనుగోలు చేసి నిల్వ ఉంచాయి. ఆ నిల్వలను తక్కువ ధరలకు వెంటనే విక్రయించడం సాధ్యం కాదు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులు కూడా ధరలపై ప్రభావం చూపుతాయి. అయినా ఈ పరిణామం పూర్తిగా ప్రతికూలం కాదు. కాల్పుల విరమణ కొనసాగి, చమురు సరఫరా సాధారణ స్థితికి వస్తే భవిష్యత్తులో ధరలు తగ్గే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రవాణా ఖర్చులు తగ్గడం వల్ల ఆహార ధరలు మరియు ద్రవ్యోల్బణం తగ్గే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచినా.. చమురు సరఫరా ఇంతకు ముందులా జరగాలంటే ఇంకాస్త సమయం పడుతుంది. బీమా, రవాణా ఖర్చులు అధికంగా ఉండటం వల్ల నౌకలు ఈ మార్గంలో ప్రయాణించేందుకు సంకోచిస్తాయి. ఈ కాల్పుల విరమణ తాత్కాలికమే కాబట్టి.. మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకునే భయాలూ వెంటాడుతాయి. 'సీజ్‌ఫైర్' ఇలాగే కొనసాగి, హర్మూజ్ జలసంధి మీదుగా చమురు రవాణా మునుపటి స్థాయికి చేరుకునే దాన్ని బట్టి.. దేశీయంగా ఇంధన ధరలు ఆధారపడి ఉంటాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. వెంటనే ధరలు తగ్గకపోయినా, దీర్ఘకాలంలో వినియోగదారులకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
09.04.2026 గురువారం, హైదరాబాద్



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com



# బహుముఖ ప్రజ్ఞాశాలి రాహుల్ సాంకృత్యాయన్

**ఏప్రిల్ 9 రాహుల్ సాంకృత్యాయన్ జయంతి**

బహుభాషావేత్త, బహుముఖప్రజ్ఞాశాలి, హిందీ యాత్రాసాహిత్య పితామహుడిగా సుప్రసిద్ధులు, వైవిధ్యభరితమైన జీవితాన్ని జీవించిన రాహుల్ సాంకృత్యాయన్ లోక సంచారిగా పేరుపొందారు. తన జీవితంలో 45 సంవత్సరాల పాటు యాత్రలలోనే గడిపారు.లోతైన తాత్త్విక చింతన కలిగిన సాంకృత్యాయన్ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి బౌద్ధ భిక్షువుగా మారి అనంతరం మార్క్సిస్ట్ సోషలిస్టుగా పరివర్తన చెందారు. సాంకృత్యాయన్ భారత జాతీయోద్యమం లో కూడా కృషిచేశారు.జాతీయోద్యమానికి అనుకూలంగా,బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రచనలు, ప్రసంగాలు చేసినందుకు 3సంవత్సరాల కారాగార శిక్షను అనుభవించారు.

విస్మృతమైన అభిరుచులు,లోతైన చింతన, విపరీతమైన సంచార జీవనం వెరసి అపురూపమైన సాహిత్యాన్ని రచించారాయన. రాహుల్ జీ ఏక సంధాగ్రాహి అని, ఆయన టిబెట్ భాషనుండి సంస్కృతానికి అత్యంత వేగంగా అనువాదం చెయ్యగలిగేవారనీ ఆయనతో వ్యక్తిగతంగా పరిచయం ఉన్నవారు వివరించారు.ఆయన చేసిన రచనలలో ,అనువాదాలలో చాలాభాగం ఇప్పటికీ ప్రచురణ కాలేదు.పురాతన బౌద్ధ గ్రంథాలను వెలికితీసివాటిని అనువాదం చేసి,ప్రపంచానికి తెలియపరచటంలో రాహుల్ జీ అపారమైన కృషిని బౌద్ధులు ఎంతో విలువైనదిగా గుర్తించారు. ఒక్క భారతదేశంలోనే కాక యావత్ ప్రపంచ చరిత్రలోనే అంత ప్రతిభాశీలి,స్వయంకృషితో మహాపండితుడైన వ్యక్తి మరొకరులేరని అనేకులు వ్యాఖ్యానించారు.ఆయన రచనాశైలి సరళంగానూ,సామాన్య పాఠకులకు తాను చెప్పదలచుకున్నది సులువుగా అర్థం అయ్యేటట్లుగానూ ఉంటుంది.

బ్రిటిష్ పాలనలో,యునైటెడ్ ప్రావిన్సెస్ (యూపీ) రాష్ట్రంలోని అజామ్‌గఢ్ జిల్లాలో 1893 ఏప్రిల్ 9లో సనాతన ధర్మాన్ని పాటించే కుటుంబంలో రాహుల్ జీ జన్మించారు. ఆయన అసలు పేరు కేదార్‌నాథ్ పాండే. బౌద్ధాన్ని తనలో ఇంకించుకున్నవాడుగా తర్వాత తన పేరును రాహుల్ సాంకృత్యాయన్‌గా మార్చుకున్నారు.ప్రాథమిక విద్య ఉర్దూ మాధ్యమంలో చదివాడు.చిన్నతనంలోనే తల్లిదండ్రులు మరణించటంతో అమ్మమ్మ, తాతల వద్ద పెరిగాడు.తన 11వ ఏట ఒక ఫకీరు పాడిన గేయాన్ని విని, తన మొత్తం జీవితాన్ని ఒక కొత్తదారిలో నడిపానని ఆయన తన ఆత్మకథలో రాసుకున్నాడు.

ఆ గేయం విన్న తరువాత తన రెండు కాళ్లూ ఎప్పుడూ ఒకచోట నిలుపలేదంటాడు ఆయన. కాశీ విద్యాపీఠ్‌లో సంస్కృతం నేర్చుకున్నాడు.ఆర్యసమాజంలో చేరి హిందూమత వ్యాప్తికి కొన్నాళ్లు కృషి చేశాడు. ఆ సమయంలోనే చక్కటి ఉపన్యాసాలు ఇవ్వటం, కొత్త విషయాలు తెలుసుకోవటానికి గ్రంథాలు చదవటం ప్రారంభించాడు.

తొమ్మిదేళ్లప్పుడే ప్రపంచం ఏమిటో చూడాలని ఇంట్లోంచి పారిపోయాడు సాంకృత్యాయన్.8వ తరగతి తోనే అతని చదువు ఆగిపోయింది. వేలాది కిలోమీటర్లు కాలినడకన చుట్టివచ్చారు.మూడు బౌద్ధ వేదాలనూ జీర్ణించుకుని త్రిపిటకాచార్య అయ్యారు. టిబెట్, శ్రీలంక,ఇరాన్,చైనా,అప్పటి సోవియట్ రష్యా... ఎక్కడ తిరిగితే అక్కడి భాష నేర్చుకున్నారు. అరబిక్, భోజ్‌పురి, ఫ్రెంచ్,హిందీ, కన్నడం, మైథిలి, నపాలీ, పాళీ, పర్షియన్, రష్యన్, రాజస్థానీ, సింహళీస్, తమిళం, ఉర్దూ లాంటి ముప్పైకి పైగా భాషలు,అందులోని యాసలు కూడా ఆయనకు తెలుసు.ఎక్కడా అధికారికంగా చదువుకోకపోయినా విశ్వవిద్యాలయాల్లో బోధించే స్థాయికి ఎదిగారు. అందుకే ఆయన్ని మహాపండిత్ అనేవారు.

రాహుల్ జీ 20 ఏళ్ల ప్రాయం నుంచే ప్రారంభించి సోషియాలజీ, మతం, తత్వం, భాష, సైన్సు మీద చరమదశ వరకు 150 పుస్తకాలు రాశాడు. బౌద్ధం మీద లెక్కలేనన్ని పరిశోధనలు చేసిన గొప్ప పరిశోధకుడు. ఓల్గా నుంచి గంగకు,రుగ్వేద ఆర్యులు,లోకసంచారి, దివోదసు,విస్మృత యాత్రికుడు, సింహసేనాపతి,జయమౌధేయ, మధురస్వప్నం ఇతని రచనలు.

1958లో సాహిత్య అకాడమీ పురస్కారం,1963లో పద్మభూషణ్ బిరుదులు లభించాయి.1963 ఏప్రిల్ 14లో శ్రీలంకలో ఆచార్యుడుగా పనిచేస్తూ ఆయన అంతిమ శ్వాస విడిచారు. రిఫరెన్సు పుస్తకాలు కూడా కంఠోపాఠంగా ఉంచుకున్న ఈ మహావిజ్ఞాని చివరిరోజుల్లో తన పేరేమిటో తనే చెప్పుకోలేని మతిమరుపులోకి జారిపోయారు. ఆయన స్మృతి చిహ్నం డార్జిలింగ్ నగరంలో బౌద్ధ మత పద్ధతిలో నిర్మించబడింది.

* సుధాకర్.ఏ.వి
* రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
* స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
* 9000674747



# ఏఐ: డిజిటల్ విప్లవమా లేక సామాజిక విధ్వంసమా?




కృత్రిమ మేధ యుగం ప్రారంభమైందని ప్రపంచం చెబుతోంది. విద్యా రంగం నుంచి పరిపాలన వరకు, వ్యవసాయం నుంచి పరిశ్రమల వరకు కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థలను ప్రవేశపెడుతున్నామని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. ఇది అభివృద్ధి సంకేతంలా కనిపించినా, భారతదేశం వంటి సామాజికఆర్థిక అసమానతలతో కూడిన దేశంలో ఒక మౌలిక ప్రశ్న తప్పనిసరిగా ముందుకు వస్తుంది — ఈ సాంకేతిక విప్లవం ప్రజల ఉపాధిని బలోపేతం చేస్తుందా? లేక అసమానతలను మరింత పెంచుతుందా?

సాంకేతిక పరిణామాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా కంప్యూటర్ యుగం నుండి కృత్రిమ మేధ యుగం వరకు వచ్చిన మార్పును పరిశీలించాలి. కంప్యూటర్లు వచ్చినప్పుడు అవి మనిషికి సహాయక సాధనాలుగా పనిచేశాయి. లెక్కలు వేగంగా చేయడం, సమాచారాన్ని నిల్వ చేయడం, పత్రాలను సిద్ధం చేయడం, ఇవన్నీ సులభమయ్యాయి. కానీ ఆ పనిని ఎలా చేయాలి, ఏ నిర్ణయం తీసుకోవాలి అన్నది మనిషిదే. కంప్యూటర్ ఒక సాధనం మాత్రమే.

కానీ కృత్రిమ మేధ మాత్రం సాధనం స్థాయి దాటి నిర్ణయాధికార స్థాయికి చేరుకుంది. ఉద్యోగుల ఎంపిక, రుణాల మంజూరు, వైద్య నిర్ధారణ, వ్యవసాయ సూచనలు, అనేక రంగాల్లో యంత్రం స్వయంగా నిర్ణయాలు తీసుకుంటోంది. దీనివల్ల కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదు, మేధో శ్రమ కూడా యంత్రాల ఆధీనంలోకి వెళుతోంది. ఇది కేవలం ఉద్యోగ నష్టం సమస్య కాదు; ఇది మనిషి పాత్ర వినాశనం వైపు దారితీసే మార్పు.

భారత ఆర్థిక నిర్మాణం ప్రత్యేకమైనది. అసంఘటిత రంగంలో పనిచేసే వారి శాతం అత్యధికం. ఇక్కడ ఒక ఉద్యోగం కోల్పోవడం అంటే ఒక కుటుంబ జీవనాధారం కూలిపోవడం. అభివృద్ధి చెందిన దేశాల్లో యాంత్రీకరణ ప్రభావానికి నిరుద్యోగ భృతి, పునశిక్షణ అవకాశాలు వంటి భద్రతా వ్యవస్థలు ఉంటాయి. మన దేశంలో అలాంటి సమగ్ర రక్షణ వలయం పరిమితంగా ఉంది. ఈ వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కృత్రిమ మేధ అమలు వేగవంతం చేస్తే అది సాంకేతిక పురోగతి కాకుండా సామాజిక ఒత్తిడి అవుతుంది.

ఇది పెట్టుబడిదారీ ధోరణితో ముడిపడి ఉంది. లాభాలే ప్రధాన లక్ష్యంగా ఉన్న వ్యవస్థలో యంత్రం పది మందిని భర్తీ చేస్తే అది ఖర్చు తగ్గింపు. కానీ ఆ పది కుటుంబాల జీవితం ఎక్కడ? వనరులు, పెట్టుబడి, సాంకేతిక మౌలిక వసతులు కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమై ఉన్నప్పుడు, కృత్రిమ మేధ వంటి ఖరీదైన సాంకేతికత కూడా అదే వర్గాల చేతుల్లోకి వెళుతుంది. దీనివల్ల కొత్త డిజిటల్ విభేదం ఏర్పడుతుంది, ఒక వైపు సాంకేతిక ఆధిపత్యం, మరో వైపు ఉపాధి కోల్పోయిన శ్రామిక వర్గం.

విద్యా రంగాన్ని పరిశీలిస్తే కృత్రిమ మేధ వ్యక్తిగత అభ్యాసాన్ని బలోపేతం చేయగలదు, మూల్యాంకన పారదర్శకతను పెంచగలదు. కానీ ఉపాధ్యాయుడి స్థానాన్ని భర్తీ చేసే దిశగా వెళ్తే అది విద్యా మానవత్వాన్ని దెబ్బతీస్తుంది. ఉపాధ్యాయుడు కేవలం పాఠ్యాంశం చెప్పడు; విలువలు, బాధ్యత, సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తాడు. యంత్రం సమాచారం అందించగలదు, కానీ మానవ అనుభూతిని ఇవ్వలేదు. కాబట్టి కృత్రిమ మేధ ఉపాధ్యాయుడికి తోడుగా ఉండాలి గానీ ప్రత్యామ్నాయంగా కాదు.

మధ్యస్థ నైపుణ్య ఉద్యోగాల్లోనూ ఇదే పరిస్థితి. డేటా నమోదు, ప్రాథమిక లెక్కల నిర్వహణ, కార్యాలయ పరిపాలన వంటి రంగాలు యంత్రాధారిత వ్యవస్థలకు మారుతున్నాయి. దీని ప్రభావం కేవలం ఉద్యోగ నష్టం మాత్రమే కాదు — ఆదాయ అసమానత పెరుగుదల, వినియోగ శక్తి తగ్గుదల, ఆర్థిక మందగమనం వంటి పరిణామాలకు దారి తీసే అవకాశం ఉంది. ఆర్థిక అస్థిరత సామాజిక అస్థిరతకు దారితీయడం చరిత్రలో కొత్త విషయం కాదు.

మరొక కీలక అంశం డేటా ఆధారిత వివక్ష. గ్రామీణ మరియు అట్టడుగు వర్గాల ప్రతినిధిత్వం డిజిటల్ వ్యవస్థల్లో పరిమితమైతే వనరుల కేటాయింపులో అసమానతలు పెరుగుతాయి. ఆల్గోరిథమిక్ పక్షపాతం ఒక సాంకేతిక సమస్య మాత్రమే కాదు; అది సామాజిక న్యాయ సమస్య కూడా. సాంకేతికత అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి, కొత్త డిజిటల్ విభేదాలను సృష్టించకూడదు.

అయితే కృత్రిమ మేధను పూర్తిగా తిరస్కరించడం పరిష్కారం కాదు. వ్యవసాయంలో పంటల ఆరోగ్య విశ్లేషణ, నీటి వినియోగ సామర్థ్యం, రైతులకు సరైన ధరల సమాచారం వంటి రంగాల్లో ఇది రైతుకు తోడ్పడగలదు. చేతి వృత్తుల వారికి విస్తృత మార్కెట్ అవకాశాల దారి చూపగలదు. ప్రభుత్వ సేవల్లో పారదర్శకతను పెంచగలదు. కానీ ఇది "మనుషులను తగ్గించే సాంకేతికత" కాకుండా "మనుషుల పనిని బలోపేతం చేసే సాంకేతికత"గా మారాలి.

ఈ నేపథ్యంలో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అవసరం. కృత్రిమ మేధ వల్ల ఉద్యోగాలను తగ్గించే సంస్థలపై అదనపు పన్ను విధించాలి; ఆ నిధిని ఉపాధి కోల్పోయిన వారికి ఆదాయ భద్రత(కానీ కంపెనీలు కల్పించవు అన్నది సత్యం ), పునశిక్షణ కోసం వినియోగించాలి. రంగాలవారీగా కృత్రిమ మేధ వాడకానికి స్పష్టమైన చట్టపరమైన నియంత్రణ ఉండాలని అని నిబంధన పెట్టిన వాటిని వాయిలేట్ చేస్తాయి. భారీ ఉపాధి కల్పించే రంగాల్లో మనుషుల స్థానాన్ని పూర్తిగా భర్తీ చేయకుండా పరిమితులు విధించాలి. ప్రభుత్వం ముందుగా ప్రభావ అంచనా నివేదికలు సిద్ధం చేసి ప్రజలకు వెల్లడించాలి. ప్రైవేట్ సంస్థలు ఉద్యోగులను తొలగించే ముందు వారికి శిక్షణ ఇవ్వడం తప్పనిసరి చేయాలి. ఆలా చేసి పరిస్థితి ఉంటుందా అన్నదే అనుమానం. విద్యాసంస్థలు పాఠ్యాంశాలను సవరించి సాంకేతిక అవగాహనతో పాటు నైతిక బాధ్యత, సామాజిక దృక్పథాన్ని బోధించాలి. ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, విద్యా వ్యవస్థ ఈ మూడు సమన్వయంతో పనిచేసినప్పుడే ఈ మార్పు ప్రజాకేంద్ర దిశగా సాగుతుంది.

కృత్రిమ మేధ మన శత్రువు కాదు. కానీ అది కొద్దిమంది లాభాలకే పరిమితమైతే అసమానతలు పెరుగుతాయి. ప్రజల ఉపాధి, గౌరవం, సమాన అవకాశాలు కేంద్రంగా ఉంటేనే ఇది నిజమైన డిజిటల్ స్వరాజ్యంగా మారుతుంది. సాంకేతికత మనుషుల కోసం ఉండాలి, మనుషులు సాంకేతికత కోసం కాదు. భారత భవిష్యత్తు కృత్రిమ మేధ వేగంలో కాదు; అది ఎంతమంది ప్రజలను కలుపుకుంటుందన్న దానిలో ఉంది. అదే డిజిటల్ విప్లవం మరియు సామాజిక విధ్వంసం మధ్య సరిహద్దు.



– పాపని నాగరాజు

# బహుగ్రంథకర్త, ఉపాధ్యాయుడు మాడభూషి కృష్ణ ప్రసాద్‌కు నివాళి!



పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు, రచయిత , చిరకాల మిత్రులు మాడభూషి కృష్ణ ప్రసాద్ (72) బుధవారం తెల్లవారు ఝామున కన్నుమూశారు. గత పది రోజులుగా ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ తో ఆయన అస్వస్థతతో ఉన్నారు.

బి.ఎ. లిటరేచర్, ఎమ్మే హిస్టరీ చదివిన కృష్ణప్రసాద్, తొలుత ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్.జి.టి. గా, తర్వాత స్కూలు అసిస్టెంట్ గా ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేసారు. అనంతరం పాలకొల్లు సవిత కళాశాలలో, పెనుగొండ వాసవి కన్యకా పరమేశ్వరి కళాశాలలో, తణుకు ఎస్.కే.ఎస్.డి. కళాశాలలో పార్ట్ టైమ్ అధ్యాపకునిగా సేవలు అందించారు.

మాడభూషి కృష్ణప్రసాద్ గొప్ప చదువరి. బహుగ్రంథకర్త. బాల్యం నుండి జర్నలిజంపై ఆసక్తి కలిగిన కృష్ణప్రసాద్ జర్నలిస్టు కావాలని కలలు కన్నారు.

అయితే ఉపాధ్యాయుడు అయ్యారు.

ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే పత్రికా రంగంపై లోతైన అధ్యయనం చేశారు. జర్నలిస్టులకంటే ఎక్కువ నిశితంగా పత్రికా రంగం గురించి పరిశోధించారు.

"భారతీయ పత్రికారంగ చరిత్ర" పేరిట జర్నలిజంపై ఒక ప్రామాణికమైన గ్రంథాన్ని రచించారు. నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన ఈ గ్రంథాన్ని APUWJ ఆధ్వర్యంలో హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో సీనియర్ సంపాదకుల సమక్షంలో ఆవిష్కరించడం జరిగింది. అదే గ్రంథాన్ని "హిస్టరీ ఆఫ్ ఇండియన్ జర్నలిజం" పేరుతో ఇంగ్లీష్ భాషలో ఆయన తిరగ రాశారు. ఈ పుస్తకాన్నీ పాట్నాలో IJU జాతీయ కార్యవర్గ సమావేశపు వేదికపై బీహార్ శాసన మండలి చైర్మన్, రాష్ట్ర కార్మికశాఖ మంత్రి , పలువురు ఎమ్మెల్యేల సమక్షంలో ఆవిష్కరణ చేయడం జరిగింది.

శంకర్స్ వీక్లీ ఫేం కార్టూనిస్ట్ శంకర్ జీవితచరిత్ర, మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవిత చరిత్ర, అన్నే ఫ్రాంక్ డైరీ, పిల్లల కథలు వంటి పలు గ్రంథాలు రచించారు.

సి.రాఘవాచారి మీడియా అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ప్రచురింప తలపెట్టిన మోనోగ్రాఫ్ ల ప్రాజెక్టులో నిపుణుల కమిటీలో సభ్యునిగా ఇటీవల నియమితులు అయ్యారు. ఖాసా సుబ్బారావు మోనోగ్రాఫ్ రాయడానికి ఆయన బాధ్యత తీసుకున్నారు.

సుప్రసిద్ధ సంపాదకుల జీవిత విశేషాలను గ్రంథస్థం చేయడానికి, "సంపాదకునిగా గాంధీజీ" పేరుతో మరో పుస్తకం రాయడానికి ఆయన సంసిద్ధం అవుతున్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఇంగ్లీష్ బోధించడం ఆయనకు కాలక్షేపం. పరిసరాల్లో జరిగే సాహిత్య సభలకు, కార్యక్రమాలకు హాజరవుతూ ఉంటారు. ఆయన ఎంత సీరియస్ రచయితో అంత హాస్యప్రియుడు. హాస్యం, వ్యంగ్యం మేళవించిన సంభాషణా చతురుడు. ఆయన సతీమణి కూడా ఇంగ్లీష్ టీచరుగా పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు.

మాడభూషి కృష్ణప్రసాద్ మరణంతో తెలుగు పత్రికా రంగం ఒక పరిశోధకుడిని కోల్పోయింది. ఆయన నుండి ఇంకా ఎన్నో రచనలను ఆశిస్తున్న సమయంలో ఆయన అకాల మరణం చెందటం తెలుగు సాహిత్యానికి పూడ్చలేని నష్టం కలిగింది.

వారానికి రెండు మూడు సార్లు ఫోన్లో మాట్లాడుకోవడం , జర్నలిజం ధోరణులపై, జరిగిన ఉదంతాలపై, సంపాదకీయాలపై చర్చించుకోవడం మా ఇద్దరికీ అలవాటు.

ఇటీవల ఐజేయు 11 వ ప్లీనరీ విశేషాల గురించి కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు.

నా అభ్యర్థన మేరకు ఐ.జే.యు. 11 వ ప్లీనరీ సావనీర్ కు ఒక వ్యాసాన్ని రాసి పంపించారు.

ఈ వారంలో కూడా తనకు ఆరోగ్యం బాగుండకపోయినా ఖాసా సుబ్బారావు మోనోగ్రాఫ్ గురించి నాతో రెండుసార్లు మాట్లాడారు. ఏవో పుస్తకాలు కావాలని అడిగారు. ఆరోగ్యం మెరుగయ్యాక మాట్లాడుకుందాం, ముందు వైద్యం చేయించుకోండి అన్నాను.ఈ రోజు ఈ విషాదకర సమాచారం వినాల్సి వచ్చింది. మాడభూషి కృష్ణప్రసాద్ మరణంతో ఒక మంచి మిత్రుడిని కోల్పోయాను. కృష్ణప్రసాద్ కు శ్రద్ధాంజలి.

కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి.

డి.సోమసుందర్.
సెక్రటరీ జనరల్,
ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్.

# 'సేవలు... విధేయత' లక్ష్యాలుగా సిఆర్‌పిఎఫ్ దళాల సేవలు

**(09 ఏప్రిల్ "సిఆర్‌పిఎఫ్ పరాక్రమ దినం" సందర్భంగా)**

భారత హోమం మంత్రిత్వ శాఖ పరిధిలో విశేష సేవలు అందిస్తున్న కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ లేదా సిఆర్‌పిఎఫ్ దళం 27 జూలై 1939లో ఏర్పడగా, 1949లే పార్లమెంట్‌లో సిఆర్‌పిఎఫ్ చట్టం ద్వారా స్థాపించబడింది. దేశంలో శాంతి భద్రతలు, సంఘ విద్రోహ శక్తులను కట్టడి చేయడం, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పోరు చేయడంతో పాటు విపత్తు నివారణ లేదా విపత్తుల సమయంలో ఆస్తి ప్రాణ నష్టాలను తగ్గించడం లాంటి ప్రధాన విధులను అంకిత భావంతో నిర్వహిస్తున్నాయి. "సేవలు విధేయత" లేదా "సర్వీస్ అండ్ లాయల్టీ" అనే నినాదంతో ఏర్పడిన సిఆర్‌పిఎఫ్‌లో ప్రస్తుతం 246 బటాలియన్లు, 293 కార్యనిర్వాహక బటాలియన్లు, 5 విఐపీల భద్రత బటాలియన్లు, 15 ఆర్ఏఎఫ్ బటాలుయన్లు, 10 కోబ్రా బటాలియన్లు, 5 సిగ్నల్ బటాలియన్లు,, ఒక పార్లమెంట్ డ్యూటీ గ్రూపు ఉన్నాయి. వీటికి తోడుగా 43 గ్రూపు సెంటర్లు, 22 శిక్షణ సంస్థలు, 3 సెంట్రల్ వెపన్ స్టోర్స్, 7 అమ్యునిషన్ స్టోర్లు, 100పడకల ఆసుపత్రులు 4, 50పడకల ఆసుపత్రులు 18, ఫీల్డ్ ఆసుపత్రులు 06 ఉన్నాయి. నేడు సిఆర్‌పిఎఫ్ విభాగంలో 3,24,093 మంది వివిధ హోదాలు కలిగిన సిబ్బంది లేదా జవాన్లు ఉన్నారు.

**సిఆర్‌పిఎఫ్ పరాక్రమ దినం:**

09 ఏప్రిల్ 1965న గుజరాత్ సరిహద్దుల్లోని రన్ ఆఫ్ కచ్ ప్రాంతంలోని ఉన్న ఆర్మీకి చెందిన 'సర్దార్ పోస్ట్'ను ఆకస్మికంగా ఆక్రమించేందుకు పాకిస్థానీ ఆర్మీ బ్రిగేడ్ చేసిన ప్రయత్నాలను వెంటనే పసి గట్టిన సిఆర్‌పిఎఫ్‌కు చెందిన కొద్ది మంది జవాన్లు మెరుపు వేగంతో ప్రతి చర్య దాడి చేయడంతో 34 మంది పాక్ జవాన్లు చనిపోగా, మన సిఆర్‌పిఎఫ్ జవాన్లు ఆరుగురు ప్రాణాలు అర్పించి అమరత్వం పొందారు. ఇలా తెలిసారి ఒక పాకిస్థానీ జవాన్లు చేసిన ఆకస్మిక దాడిని తిప్పికొట్టిన వీరులుగా మన సిఆర్‌పిఎఫ్ దళాలు చూపిన పరాక్రమానికి గుర్తుగా ప్రతి ఏట 09 ఏప్రిల్‌న దేశవ్యాప్తంగా "సిఆర్‌పిఎఫ్ పరాక్రమ లేదా శౌర్య దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. దేశ భద్రత విషయంలో అంకితభావం, త్యాగం, తెగువ అరుదైన పరాక్రమాన్ని ప్రదర్శించిన సిఆర్‌పిఎఫ్ దళాలకు కృతజ్ఞతలు తెలియజేయడం, ఆ దళాల కవాతులు నిర్వహించడం, పరాక్రమం చూపిన జవాన్లకు అవార్డులు అందించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.



13 డిసెంబరు 2001 న పార్లమెంట్‌పై ఉగ్రవాదులు చేసిన దాడిని తిప్పికొట్టిన సిఆర్‌పిఎఫ్ దళాల అత్యంత ధైర్య సాహసాలు, పరాక్రమాలను ప్రస్తుతించడం, అమరులకు నివాళులు అర్పించడం, జవాన్లకు శుభాకాంక్షలు తెలియజేయడం మన కనీస కర్తవ్యం. ఈ విధులకు తోడుగా ఐరాస కేటాయించిన విధుల్లో భాగంగా శ్రీలంక, హైతీ, కాసావో, లైబేరియా లాంటి దేశాల్లో కూడా విధులను నిర్వహించిన సిఆర్‌పిఎఫ్‌కు ఈ శుభ వేళ శుభాకాంక్షలు తెలియజేద్దాం.




డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 09.04.2026
www.mudranews.in | @mudranews



**కోడి గుడ్డు :** కంటి ఆరోగ్యానికి మంచిది. ల్యూటిన్, జియాజాంథిన్ వంటి పోషకాలు కంటి చూపును కాపాడతాయి. వయస్సుతో వచ్చే కంటి సమస్యలను తగ్గిస్తాయి.



## సంక్షిప్తంగా..

### ఈవీఎంలు భద్రం



**ముద్ర, వనపర్తి:** జిల్లా కేంద్రంలో ఈవీఎంలు భద్రపరిచిన గోదాం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. బుధవారం ఆర్డీవో కార్యాలయం వెనక ఉన్న ఈవీఎం గోదాంను ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి పరిశీలించారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా గోదాం వద్ద భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల భద్రతా వ్యవస్థను పరిశీలించారు. తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

**గద్వాలలో..**

**ముద్ర, గద్వాల:** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, గద్వాల తహసీల్దార్ హరికృష్ణ, పాల్గొన్నారు.

### ప్రొబేషన్‌ను పూర్తి చేయాలని వినతి



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** జిల్లాలో విధులు నిర్వహిస్తున్న గ్రామ పాలన అధికారులు తమ ప్రొబేసన్ పూర్తి చేయాలని కోరుతూ మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ యంత్రాంగంలో కీలక భాగస్వాములుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తమ సేవలను పరిగణనలోకి తీసుకుని, ప్రొబేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీజీఅర్ఎస్ఏ సంఘం నాయకులు అజిత్ కుమార్, ప్రశాంత్ గౌడు, శివ కుమార్,రాజేష్, జీపీఏ సంఘం జిల్లా అధ్యక్షులు యం.డి.షేక్ షావలి, ప్రధాన కార్యదర్శి బి.రాములు, జిల్లా కోశాధికారిబి. లక్మన్న, మహిళా ప్రధాన కార్యదర్శి అశ్వధ, రాష్ట్ర నాయకులు ఆనంద్, బుడ్డన్న, రాముడు, వెంకట్, పరుష రాముడు, రహమతుల్లా, జి.వెంకటేష్, గోవర్ధన్, రామక్రిష్ణ, ఆంజనేయులు, కొండయ్య, సురేందర్ పాల్గొన్నారు.

### జాబ్ మేళా విజయవంతం


**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో డైరీ సైన్స్, లైఫ్ సైన్స్ విద్యార్థుల కోసం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మద న్మోహన్ తెలిపారు. సిరవిన్ బయాలజికల్ లిమిటెడ్ లైబిలిటీ పార్ట్నర్షిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో సుమారు 80 మంది అభ్యర్థులు పాల్గొనగా 20 మందికి పైగా ఎంపికైనట్లు తెలిపారు. అధ్యాపకులు కోదండరాములు, దశరథం యాదవ్, అంజయ్య, వనిత, ఉమాదేవి, రామకృష్ణ పాల్గొన్నారు.

### మైసమ్మ నగర్‌లో 'ఇంటింటికీ సిపిఐ'

**ముద్ర, కూకట్‌పల్లి:** ఇంటింటికీ సిపిఐ' కార్యక్రమంలో భాగంగా జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మ నగర్‌లో సిపిఐ నాయకులు పర్యటించారు. పార్టీ చేసిన పోరాటాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. మైసమ్మ నగర్, అంజయ్య నగర్‌లలో గతంలో సిపిఐ ఆధ్వర్యంలోనే బోర్ల ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించినట్లు గుర్తుచేశారు. వీధి దీపాలు, రోడ్ల నిర్మా ణం కోసం నిరంతరం కృషి చేశామని తెలిపారు. ఏ పార్టీలో ఉన్నా, తమకు గూడు కల్పించిన చరిత్ర సిపిఐదే అని ప్రజలు తమ అభిమానాన్ని చాటు కున్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఏసు రత్నం, సహాయ కార్యదర్శి హరినాథ్, ప్రజానాట్య మండలి అధ్యక్షులు ప్రవీణ్బాబు, నర్సింహారెడ్డి, మల్లేశ్వ, మహేందర్, వెంకటేష్, సహదేవరెడ్డి, కీర్తి, కొండయ్య, నర్సయ్య, వీరాస్వామి పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి





**ముద్ర, వనపర్తి:** ఈ రబీ సీజన్లో వనపర్తి జిల్లాలో దాదాపు 3.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. వీటిలో గృహవసరాలు ఇతరత్రా పోను 2.70 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని మొత్తం ధాన్యాన్ని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేయాల్సి ఉంటుందని సూచించారు. బుధవారం జిల్లా పౌర సరఫరాల అధికారి ఆధ్వర్యంలో ఐ డి ఓ సి సమావేశ మందిరంలో వ్యవసాయ మండల అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, సహకార సంఘాల సీఈవోలు ఈ.పి.యంలతో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై సమావేశం నిర్వహించగా అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఈసారి 414 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందులో ఐకెపి సిబ్బందికి 192 కేంద్రాలు పిఎసిఎస్ సంఘాలకు 214 మెప్మా కు 8 వరి కొనుగోలు కేంద్రాలు కేటాయించినట్లు తెలిపారు. ధాన్యం అమ్మడానికి వచ్చే రైతుల కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, పి.డి. డిఆర్డిఓ ఉమాదేవి, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి బి. రాణి, మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, ఉద్యాన శాఖ అధికారి విజయభాస్కర్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

### ఇతర రాష్ట్రాల ధాన్యం కొనుగోలు చేస్తే కఠిన చర్యలు

**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నుంచి కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, అవకతవకలకు పాల్పడే వారిపై సస్పెండ్ వేటు తప్పదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు.

బుధవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో రబీ సీజన్ కు సంబంధించి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాలొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 87 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈనెల 9వ తేదీ నుంచి కొనుగోలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతులు తాము పండించిన ధాన్యంను తమ కల్లాల వద్దే బాగా ఆరబెట్టుకుని వస్తే కొనుగోలు కేంద్రాల వద్ద ప్రత్యేకంగా ఆరబెట్టే అవసరం ఉండదన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం రాకుండా జిల్లాలోని ఎనిమిది చెక్ పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. వేసవి నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులతో పాటు ఆయా కేంద్రాల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, పౌర సరఫరాల జిల్లా అధికారి స్వామి కుమార్, మేనేజర్ విమల, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, తదితరులు పాల్గొన్నారు.

### పదోన్నతి బాధ్యతను పెంచుతుంది

**ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి పాటిల్**



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ప దోన న్నతి బాధ్యతను మరింత పెంచుతుందని ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ బద్రీ నాయక్ ఏఎస్ఐగా పదోన్నతి పొందగా ఎస్పీ తన చేతుల మీదుగా స్టార్స్ అలంకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ పదోన్నతి పొందిన ప్రతి పోలీస్ సిబ్బంది తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడి సమస్యను సానుభూతితో వినడం, వారికి తక్షణ సహాయం అందించడం, న్యాయం జరిగేలా కృషి చేయడం పోలీస్ సిబ్బంది ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, నిరుపేదలు వంటి బలహీన వర్గాలకు పోలీసులు అండగా నిలవాలని సూచించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిస్తే మరిన్ని అవకాశాలు, గుర్తింపు లభిస్తాయని తెలిపారు.

# చెక్ డ్యాంలతో సాగునీటి సమస్యకు చెక్

**- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:** మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని హన్వాడ మండలంలో రైతుల సాగునీటి సమస్య శాశ్వత పరిస్కారనికి రూ.8.30 కోట్ల వ్యయంతో మూడు చెక్ డ్యామ్‌లు నిర్మిస్తామని విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. బుధవారం ఎమ్మెల్యే వాటికి శంకుస్థాపన చేశారు. నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ నిధులతో ఇబ్రహీంబాద్, మునిమోక్షం, వేపూర్ గ్రామాల్లో చెక్ డ్యాం నిర్మాణం చెప్పడతామని తెలిపారు. భూగర్భ జలాలు మెరుగుపడటంతో పంటల దిగుబడులు పెరిగే అవకాశాలున్నాయన్నారు. హన్వాడ మండల కేంద్రంలోని సనాతన సంగమేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో రూ.20 లక్షల ముడా నిధులతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు సల్లోనిపల్లి నుంచి పలుగు తాండ వరకు రూ.1.66 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు వేముల కృష్ణయ్య యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి బుద్దారం సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, కార్యనిర్వాహక అధ్యక్షులు చెన్నయ్య, నాయకులు యాదిరెడ్డి, నవనీత, అచ్చన్న, గంగిరెడ్డి, కోస్గి యాదయ్య, నర్సింహులు, రఘు , షబ్బీర్ హుస్సేన్, లింగం నాయక్, విజయ్ నాయక్ పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టళ్లలో మెనూ అమలు చేయాలి



**ముద్ర, నారాయణపేట :** జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ, బాలుర, ఆనంద నిలయం( బాలికల ) వసతి గృహాలను తనిఖీ చేశారు. బాలుర వసతి గృహంలో మరుగు దొడ్లను, గదులను, డైనింగ్ హాల్, వసతి గృహ పై కప్పును పరిశీలించారు. వంటగదిలో సరుకుల నాణ్యతను చూశారు. అక్కడి మెనూ బోర్డును చూసి, మెనూ ప్రకారం టిఫిన్, స్నాక్స్, రాత్రి భోజనం ఇస్తున్నారా అని హాస్టల్ వార్డెన్ ను ప్రశ్నించారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన మెనూ ను తప్పని సరిగా అమలు చేయాలని ఆదేశించారు. వసతి గృహంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీపంలో ఉన్న ఆనంద నిలయాని కి వెళ్ళి పరిసరాలను చూశారు. వంటగదిలోకి వెళ్ళి వంట మనుషులతో మాట్లాడి మెనూ గురించి ఆరా తీశారు. రోజూ ఖచ్చితంగా మెనూ ప్రకారమే పిల్లలకు ఆహారం ఇవ్వాలని స్పష్టం చేశారు. అదనపు మరుగు దొడ్ల కోసం ప్రతిపాదనలు చేసి పంపాలని వార్డెన్ కు సూచించారు.

## తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభం



**ముద్ర, పెబ్బేర్:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని బుధవారం వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రారంభించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం పక్కనే నిర్మించిన ఇందిరమ్మ నమూనా గృహంలో ఏర్పాటు చేసిన గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కస్తూర్బా బాలికల పాఠశాలలో అదనపు మౌలిక సదుపాయాల నిర్మాణ పనులకు శంకుస్థాపన, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్తగా ఏర్పడిన మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో జిల్లాలోని పలు మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు అద్దె భవనాల నుంచి సొంత భవనాలకు మారడం సంతోషకరమన్నారు. ఇప్పటికే ఏదుల, రేవల్లి మండల కేంద్రాల్లో నూతన తహసిల్దార్ కార్యాలయ భవనాలను ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు.ఈ తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణం కోసం ఒక్కో భవనానికి రూ.32 లక్షలను కలెక్టర్ తన సొంత నిధుల నుంచి కేటాయించి వేగంగా పూర్తి చేయించడం అభినందనీయమని తెలిపారు. ఈ కొత్త భవనాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సర్పంచి మద్దిలేటి, డీఈఓ అబ్దుల్ ఘని, బి డబ్ల్యు సుధారాణి, తాసిల్దార్ వరలక్ష్మి, మాజీ జెడ్పిటిసి రాజేంద్రప్రసాద్, నాయకులు శ్రీహరిరాజు, బీరం రాజశేఖర్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### తల్లిపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి

**ముద్ర, వనపర్తి:** తల్లి పాలు మాత్రమే శిశువులకు అవసరమైన పోషకాలు అందించడంతో పాటు రోగ నిరోధక శక్తిని పెంచుతాయని, కాబట్టి నవజాత శిశువులకు మొదటి రెండేళ్ల వరకు తప్పని సరిగా తల్లిపాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. జిజిహెచ్ సూపరింటెంట్ అరుణకుమారి, ఆర్ఎంవో రెడ్డి కుమారి, డిఎంహెచ్ఓ సాయినాథ్ రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్వో శ్రీనివాసులు, గర్భిణీ స్త్రీల విభాగం నిపుణులు కిరణ్మయి, ఇతర వైద్యులు, వైద్య విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

**నాగర్ కర్నూల్‌లో..**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో గర్భవతులు, బాలింతల కోసం సురక్షిత మాతృత్వంపై అవగాహన కార్యక్రమంలో జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్ పి. అమరేందర్ పాల్గొని మాట్లాడారు. ఆర్ఎంఓ డాక్టర్ రవిశంకర్, డాక్టర్ ప్రశాంత్, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ కవిత, డాక్టర్ సాత్విక, జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాలాచారి, నర్సింగ్ సూపరింటెండెంట్లు శైలజ, హెల్త్ ఎడ్యుకేటర్ నరసింహ, ఓరుగంటి శ్రీనివాసులు, నర్సింగ్ అధికారులు ఆనంద్, రూప, సువేదా, ప్రసన్న, యాదగిరి పాల్గొన్నారు.

## ఘనంగా వేములపల్లి కృష్ణ 26వ వర్ధంతి



**ముద్ర, శేరిలింగంపల్లి :** సి.ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి, మాజీ శాసనసభ సభ్యులు, విశాలాంధ్ర మాజీ సంపాదకులు ,"చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా, గతమెంతో ఘనకీర్తి గలవోడా" గేయ రచయిత వేములపల్లి శ్రీకృ 26వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు. హైదరాబాద్ కొండాపూర్ లోని సి.ఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో వేములపల్లి శ్రీకృష్ణ చిత్రపటానికి ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వర రావు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సి.ఆర్ ఫౌండేషన్ స్థాపనలో చేసిన కృషిని, ఆయన రచంచిన గేయం ప్రాచుర్యాన్నీ వక్తలు గుర్తు చేసుకున్నారు. ప్రతిపక్ష నాయకుడిగా, శాసనసభ సభ్యునిగా, విశాలాంధ్ర సంపాదకుడిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమం డైరెక్టర్ సి.ఆర్ ఫౌండేషన్ కోశాధికారి వి. చెన్నకేశవరావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె. రజిని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోశ్యభట్ల కల్పన, సభ్యులు కనపర్తి జ్యోస్న, ఐ ఎస్ రాజు. వృద్ధాశ్రమ వాసులు పాల్గొన్నారు.

## సఖి సెంటర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



**ముద్ర, మల్కాజిగిరి:** సఖి సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మల్కాజ్‌గిరి క్యాంపు కార్యాలయంలో సఖి కేంద్రం (వన్ స్టాప్ సెంటర్) అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి శారద, శాఖ సిబ్బంది, మాజీ మహిళా కార్పొరేటర్లు, మహిళా సంఘాల నాయకురాళ్లు పాల్గొన్నారు. సమావేశం ప్రధాన ఉద్దేశ్యం మహిళలు గర్భధారణ దశ నుంచి జీవితాంతం ఎదుర్కొనే సమస్యలకు సమగ్ర పరిష్కారం అందించే సఖి కేంద్రం సేవలపై విస్తృత అవగాహన కల్పించడం అని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, మేకల సునీత, రాము యాదవ్ పాల్గొన్నారు.

### పామాయిల్ సాగుతో అధిక లాభాలు

**ముద్ర, వనపర్తి:** రైతులకు దీర్ఘకాలంగా లాభాలను ఆర్జించిపెట్టే పామాయిల్ సాగుపై అవగాహన కల్పించి జిల్లాలో పామాయిల్ సాగు పెంచే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధలవారం ఐడిఓసీ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పామాయిల్ లసాగు లక్ష్యం 3 వేల ఎకరాలు సాధించే విధంగా రైతులకు ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయ ఉద్యా న శాఖ అధికారి విజయ్ భాస్కర్, ఏవో ఆంజనేయులు, సివిల్ సప్లై అధికారి కాశి విశ్వనాథ్, కో ఆపరేటివ్ అధికారి బి. రాణి, మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్ పాల్గొన్నారు.

## పాఠశాల ప్రహరీ పనులకు శంకుస్థాపన

**ముద్ర, తాండూర్:** వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం కందెనెల్లి గ్రామంలో రూ.7 లక్షలతో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడను ప్రారంభించిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అనంతరం కందనెల్లి కవితలు మరియు తాటికొండ మణిపూసలు, గాయత్రి మణిపూసలు పుస్తకాలను ఆవిష్కరణ చేసి, అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ పుస్తకాలు రచించిన వడిచర్ల సత్యం, బింగి గాయత్రి, తాటికొండ అర్చన ను, విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ దారాసింగ్, పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు

## పీడీఎస్ బియ్యం పట్టివేత

**ముద్ర, మల్కాజిగిరి:** నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం నాగాయన్‌పల్లి తండా, తుర్కపల్లి నివాసితులు బానోతు ఈశ్వర్ (23), బానోతు కవిత (57) మరో మైనర్ బాలుడు బుధవారం ఉదయం సుమారు 9.30 గంటల సమయంలో న్యూ విద్యానగర్ ప్రాంతంలో అశోక్ లేలాండ్ గూడ్స్ ఆటోలో 96 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఓటీ, నేరేడ్మెట్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. ఈ ఘటనలో పాల్గొన్న నిందితులపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి , ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి తో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలేజీ భవనం నిర్మాణానికి రూ.9 కోట్లు మంజూరు చేస్తూ పాత భవనం స్థానంలో ఆధునిక సదుపాయాలతో నూతన భవనం నిర్మించాలని నిర్ణయించారు. నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసిన ఆయన, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

## మైసమ్మ చెరువు కబ్జాపై బండి రమేశ్ ఆగ్రహం

**ముద్ర కూకట్‌పల్లి:** అలాపూర్ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్‌లో మైసమ్మ చెరువు ఆక్రమణలను పరిశీలించిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ చెరువును పూడ్చి కబ్జా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల చెరువులు అంతరించిపోయాయని, వాటిని పునరుద్దరించేందుకు 'హైడ్రా' అధికారులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.చెరువులో గుర్రపుడెక్క తొలగింపు, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు మరియు బస్తీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 09.04.2026
www.mudranews.in | @mudranews



**కోడి గుడ్డు**



బరువు తగ్గడానికి సహాయం గుడ్డు తింటే ఎక్కువ సేపు ఆకలి రాదు. దీంతో అధికంగా తిన కుండా బరువు నియంత్రణలో ఉంటుం

# విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దు

**- నాణ్యమైన సేవలందించాలి**

**- ఎమ్మెల్యే సత్యనారాయణ రావు**




**మహదేవపూర్, ముద్ర:** డాక్టర్లు తమ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిని కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి సందర్శించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులపై సూపరింటెం డెంట్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలోని క్యాజువలిటీ, ల్యాబ్, ఎంఆర్ఐ, ఔట్ పేషెంట్ గదులు పరిశీలించి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. క్యాజువాల్టీలో 6 మంచాలు మాత్రమే ఉన్నాయని, అత్యవసరంగా ఒకే సమయంలో ఎక్కువ మంది రోగులు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైద్యులు తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి నూతనంగా 15 మంచాలతో క్యాజువాల్టీ నిర్మాణం చేపడతామని, అంచనాలు తయారు చేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి ల్యాబ్ ను పరిశీలించారు. ఆసుపత్రిలో పారిశుధ్యం సరిగా లేకపోవడం, వార్డులు ,పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం గమనించిన ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు ప్రాథమిక సౌకర్యాలు సరిగా లేకపోవడంపై, సిబ్బంది సమయపాలన పాటించకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడం వంటి అంశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈలాంటి సంఘటనలు మళ్లీ పునరావృత్తం కాకుడదని ఆసుపత్రి పర్యవేక్షకున్ని హెచ్చరించారు. రోగులకు నాణ్యమైన సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసు కోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఆసుపత్రిలో పారిశుధ్యాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని, సిబ్బంది హాజరు, పనితీరుపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇకపై ఇలాంటి నిర్లక్ష్యం కొనసాగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రి ఆవరణలోని మహిళా క్యాంటీన్ ను పరిశీలించి రోగి బంధువులతో మాటాడారు. క్యాంటీన్ లో పరిశుభ్రమైన నాణ్యమైన వంటకాలను అందించాలని తెలిపారు కలెక్టర్, ఎమ్మెల్యే క్యాంటీన్ లోని టిఫిన్ల రుచి చూశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధు సూదన్, ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్ట ర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## ఆర్టిజన్ కార్మికుల సమ్మె




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** రాష్ట్ర విద్యుత్ ఎంప్లాయిస్ జేఏసీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో విద్యుత్ ఆర్టిజన్, ఆన్ మ్యాన్ ఉద్యోగులు బుధవారం నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ డివిజన్ కార్యాలయం ప్రధాన గేటు ఎదుట ధర్నా చేశారు. ఉద్యోగులు, విద్యార్హతల ఆధారంగా ఆర్టిజన్ ఉద్యోగుల కన్వర్షన్ చేయాలని, ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫ్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడుతూ టీజీఎస్పీడీసీఎల్ లో అన్ మాన్డ్ వర్కర్లను ఆర్టిజన్లుగా విలీనం చేయాలని, 2026 పిఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థల్లో 2016 డిసెంబర్ 4 కంటే ముందు అన్ని అర్హతలు ఉండి పనిచేస్తూ, ఇప్పటికీ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులుగా నసాగుతున్నవారిని ఆర్టిజన్ గా గుర్తించాలని కోరారు. విద్యుత్ సంస్థలు బ్రిటిష్ కాలం నాటి విధానాలనే కొనసాగుతున్నాయన్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న పీస్ రేట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# కార్పొరేట్ తరహా వైద్య సేవలందిండాలి

**- కలెక్టర్ అభిలాష అభినవ్**




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ తరహా వైద్య సేవలందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న అత్యవసర వైద్య సేవల విభాగాన్ని కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఆసుపత్రి భవంతి నిర్మాణానికి సంబంధించిన వివరాలను అధికారులు కలెక్టర్ కు వివరించారు. శస్త్ర చికిత్సల గదులు, డయాలసిస్ కేంద్రం, ఐసీయూ, గైనిక్ విభాగం, ఎలక్ట్రికల్ యూనిట్, ఫైర్ సేఫ్టీ విభాగాలు పరిశీలించారు. మిగిలి ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు సేవల నిమిత్తం అందుబాటులోకి తేవాలన్నారు. సమీపంలోని యూడీ ఐడీ కేంద్రం, డ్రగ్స్ డి అడిక్షన్ సెంటర్లు పరిశీలించారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర వైద్య సేవల విభాగం, రక్త పరీక్షల గది తదితర విభాగాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యవసర వైద్య సేవల విభాగాన్ని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది తప్పని సరిగా సమయపాలన పాటిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ఈ తనిఖీలలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, తహసీల్దార్ రాజు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంతకుముందు కలెక్టర్ గుల్జార్ మార్కెట్ లోని బస్తీ దవాఖానను తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవల గురించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో చికిత్స కోసం రోగులకు సేవా దృక్పథంతో వైద్యం అందించాలని సూచించారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్, అధికారులు సౌమ్య, స్థానిక కౌన్సిలర్ తౌహిదుద్దీన్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వగ్రామానికి వచ్చిన దేవ్ జీ



**కోరుట్ల, ముద్ర;** మావోయిస్టు సెంట్రల్ కమిటీ మాజీ కార్యదర్శి తిపి తిరుపతి అలియాస్ దేవ్ జీ బుధవారం కోరుట్లలోని ఆయన స్వగృహానికి వచ్చారు. బంధువులు చిన్ననాటి మిత్రులు ఘన స్వాగతం పలికి, సన్మానించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ 43 ఏళ్ల తర్వాత కోరుట్ల కు వచ్చినట్లు తెలిపారు. పట్టణంలో గడిపిన చిన్ననాటి రోజులను దేవ్ జీ గుర్తు చేసుకున్నారు.

# ముమ్మరంగా సూరమ్మ చెరువు పనులు

**- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**కోరుట్ల, ముద్ర:** కథలాపూర్ మండలంలోని కలికోట సూరమ్మ చెరువు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ఆ ది శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన ఇరిగేషన్ అధికారులతో కలికోట సూరమ్మ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ పురోగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పనుల వేగాన్ని పెంచాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేయాలన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు 43 వేల ఎక రాలకు సాగునీరు అందనున్నట్లు తెలిపారు. విప్ వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాయితీ నాగరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ పుంద్ర నారాయణ రెడ్డి, నాయకులు ఉన్నారు.

# ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** రాష్ట ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. సత్య ప్రసాద్ దరూర్ క్యాంప్ లోని ఈవీఎం లను భద్రపరిచిన గోదామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెల ఈవీఎం లను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. గోడౌన్ లోని యంత్రాల భద్రత, సీసీ కెమెరాల పనితీరు, సాంకేతిక పరమైన అంశాలను పరిశీలించామన్నారు. కలెక్టరేట్ వెం ట అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లత, ఆర్డీవో మధుసూదన్, ఎన్నికల విభా గం పర్యవేక్షకులు, కలెక్టరేట్ ఏవో హకీమ్, అర్బన్ తహసీల్దార్ రామ్మోహన్ ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

**- డీఈఓ కె. రాము**




**కోరుట్ల, ముద్ర:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు డీఈఓ కె. రాము తెలిపారు. కోరుట్ల పట్టణంలోని కల్లూరు రోడ్ లో గల క్యాంప్ గడి (ఎస్సారెస్పీ) ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గడి పాఠశాల ప్రగతిలో ముఖ్యమైన స్థానంలో ఉందన్నారు. ప్రభుత్వం సర్కారు బడులకు ఉచిత మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, దుస్తులు అందిస్తుందని పేర్కొన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో కొత్త మెనూతో భోజనం మరింత రుచికరంగా ఉండనున్నట్లు చెప్పారు. బడి బాట కార్యక్రమంలో కొత్త విద్యార్థులను ఎక్కువగా నమోదు చేయాలని సూచించారు. రాబోయే విద్యా సంవత్సరం కోసం బడి బాట కరపత్రాలు ఆవిష్కరించారు. కాగా ఈ వేడుకలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నునావత్ రాజు, మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత గంగాధర్, మున్సిపల్ కమిషనర్ జి.రవీందర్, ఎంఈవో జి. నరేశం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పి. మంగ తదితరులు పాల్గొన్నారు.


## బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడికి స్వాగతం



**కోరుట్ల, ముద్ర:** బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారి కోరట్లకు వచ్చిన సురభి నవీన్ కుమార్ కు బుధవారం ఆ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మెట్ పల్లిలోని అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి కోరుట్లలోని ఆయన ఇంటి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల బస్ స్టేషన్ ఔట్ గేట్ వద్ద కార్నర్ మీటింగ్ లో సురభి నవీన్ కుమార్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీ అంటేనే కార్యకర్తల పార్టీ అని తెలిపారు. కార్యకర్తలు లేకుంటే ఏ నాయకుడు లేరని పేర్కొన్నారు. ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా మీ కుటుంబ సభ్యుడిగా తోడుంటానని స్పష్టం చేశారు. తన చివరి శ్వాస వరకు కాషాయాన్ని విడిచేది లేదని ప్రకటించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఎదురొడ్డి పోరాడుతానని చెప్పారు. తనపై నమ్మకంతో రెండోసారి బాధ్యత ఇచ్చిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ లకు ధన్యవాదాలు తెలియచేశారు. అనంతరం పార్టీ శ్రేణులు సురభిని అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పాటల్లో దూసుకెళ్తున్న జగిత్యాల జిల్లా వాసి..

**- పోలీస్ కళాబృందం ఇంచార్జిగా సేవలందిస్తూనే పాటల జర్నీ**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వీవీ రావు పేట గ్రామానికి చెందిన కమల్ ఇస్లావత్ అనే కానిస్టేబుల్ అనేక సినీ, జానపద గీతాలను రాస్తున్నారు. ఆయన 2009 లో పోలీసు కానిస్టేబుల్ గా ఉద్యోగం సాధించాడు. పోలీస్ శాఖలో విధి నిర్వహణ చేస్తూనే మరోవైపు తనలో దాగి ఉన్న పాటల రచయిత కలను బయట పెడుతున్నారు. జిల్లా పోలీస్ కళాబృందం ఇంచార్జిగా సేవలందిస్తూ తెలంగాణ పదాలతో అల్లిన పాటలను రాస్తున్నారు.

కమల్ విద్యార్థి దశలో ఉన్నప్పుడు పదో తరగతి వరకు పాటలు పడేవారు. ఆ తర్వాత పాటలు రాయడం ప్రారంభించారు. 2003 నుంచి తన పాటల జర్నీని ప్రారం భించారు. 2005లో కిస్మత్ అనే బంజారా పాటల ఆల్బమ్ క్యాసెట్ లో 8 పాటలు రాసి మంచి గుర్తింపు పొందారు.

**పండుగల సందర్భంగా ప్రత్యేక పాటలు..**

2009 నుంచి ప్రతి ఏటా బోనాలు, శివరాత్రి, బతుకమ్మ లతోపాటు ఇతర పండుగల సందర్భంగా జానపద పాటలు రాసి గుర్తింపు పొందారు. ప్రముఖ సింగర్ మంగ్లీ కి సంబంధించిన ట్రెండింగ్ లో ఉన్న సుమారు 14 పాటలు కమల్ రాశారు. ఇప్పటి వరకు 120 వరకు పాటలు రాశారు. ఇందులో ముఖ్యంగా ఇటీవల రాసిన కన్నయ్య కాదమ్మా నేను, బాయిలోన బల్లి పలికే, మామిడి కోనాల మీద వంటి జానపద పాటలు ట్రెండ్ ను సృష్టించాయి. యూట్యూబ్ లో మిలియన్ల కొద్ది వ్యూస్ వస్తున్నాయి.

**గంజాయి పై రాసిన పాటను ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి..**

కమల్ ఇస్లావత్ పోలీస్ కళాబృందం ఇంచార్జిగా ఉంటూ ఎన్నో సామాజిక రుగ్మతలపై ప్రజలకు తన సందేశంతో అవగాహన కల్పించారు. మద్యం, గంజాయి వంటి సామాజిక రుగ్మతలపై ఎన్నో పాటలను రాశారు. గంజాయి పై రాసిన పాటను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు.

**సినిమా పాటల ప్రయాణం..**


కమల్ ఇస్లావత్ తను ఫోక్ సాంగ్స్ తో పాటు సినిమా పాటల ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు జాబిల్లి కోసం ఆకాశమల్లే, కలవి వనంలో, దేవగుడి, మారెమ్మ, కొంచెం పని కొంచెం రన్, గుడ్ లక్, సఖి తదితర సినిమాల్లో పలు పాటలు రాసి గుర్తింపు పొందారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
09.04.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**కోడి గుడ్డు**

రోగనిరోధక శక్తి పెంపువిటమిన్ A, D, B12 వల్ల ఇమ్యూనిటీ బలప డుతుంది. శరీరం వ్యాధులతో పోరాడే శక్తి పెరు గుతుంది.



# పైపు లైన్‌తో గ్యాస్ సరఫరా

- గృహ వినియోగదారులకు అందించేందుకు చర్యలు
- యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : భువనగిరి, బీబీనగర్, చౌటుప్పల్ వలిగొండ మండలాలకు మెగా పి ఎన్ జి పైపు లైన్ ద్వారా గృహ వినియోగదారులకు గ్యాస్ సరఫరా అదించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. బుధవారం మినీ మీటింగ్ హాల్ లో మండాలలో పైపు లైన్ ద్వారా గ్యాస్ ఏర్పాటు కు సంబంధించిన సమావేశంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ సంబంధిత శాఖల అధికారులతో పిఎన్జి (పైప్డ్ నేచరల్ గ్యాస్ ) అమలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో నాలుగు మండలాలకు మెగా గ్యాస్ పైప్ లైన్ ద్వారా గృహ వినియోగదారులకు సురక్షితంగా, నిరంతరంగా పిఎన్జి సరఫరా అందించేందుకు చేపడుతున్న పైపు లైన్ పనుల పురోగతి పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మెగా పిఎన్జి పైపు లైన్ ఏర్పాటు పనులు ఎలాంటి అంతరాయం లేకుండా సజావు గా కొనసాగాలని సూచించారు. పనులు వేగవంతంగా పూర్తి కావడానికి సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూ, మున్సిపల్, గ్రామ పంచాయతీ శాఖలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని తెలిపారు. మెగా గ్యాస్ పైపులైన్ పనుల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మెగా గ్యాస్ మెయిన్ పైప్ లైన్ ద్వారా వచ్చే గ్రామాలకు రోడ్ల తవ్వకాలు, డ్రైనేజీ, మరమ్మతులు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ పనులు చేపట్టాలని అన్నారు. పనులు పూర్తి అయ్యేలా ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని తెలిపారు. పైపు లైన్ ద్వారా ప్రజలకు సురక్షిత గ్యాస్ సరఫరా అందించడంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో భువనగిరి, చౌటుప్పల్ రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి , మెగా సిటీ గ్యాస్ రిప్రజెంటేటివ్ రమేష్, వంశీ,జిల్లా పౌర సరఫరాల అధికారి రోజారాణి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణు వర్ధన్ రెడ్డి, తహశీల్దార్లు పాల్గొన్నారు.



## నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

ముద్ర, యాదగిరిగుట్ట : అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. బుధవారం యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో నిర్వహణ, అందిస్తున్న సేవలను సమగ్రంగా పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో మొత్తం ఎంతమంది పిల్లలు నమోదు అయ్యారని, ప్రతి రోజు పిల్లలు ఎంత మంది అంగన్వాడీ కేంద్రానికి వస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ప్రతిరోజు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన ఆహారంఅందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో స్వయంగా మాట్లాడి, ఏబీసీడీలు చెప్పించడంతో పాటు వారి ప్రతిభను ప్రోత్సహించారు. గర్భిణీలు, బాలింతలకు అందించే సేవలు కూడా సక్రమంగా ఉండాలని, వారికి అవసరమైన పోషకాహారం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అంగన్వాడీ కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు






ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి: లింగ నిర్ధారణ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ ఎం.మనోహర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీ హాల్ లో జిల్లాలో ప్రీ–కన్సెప్షన్ & ప్రీ–నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ చట్టం – 1994 కు సంబంధించి జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అల్ట్రాసౌండ్ కేంద్రాలు, జన్యు పరీక్ష కేంద్రాల నమోదు, పునరుద్ధరణ, వార్షిక తనిఖీ నివేదికలు, చట్ట ఉల్లంఘనలపై తీసుకున్న చర్యలు పెండింగ్ అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు అన్ని నమోదిత కేంద్రాలు చట్ట నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. లింగ నిర్ధారణ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని, ఎటువంటి ఉల్లంఘనలు జరగకుండా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ యల్. యశోద, వై. ఇందిరా మణి, గైనకాలజిస్టు లు యస్. జ్యోతి, డా. శ్రీదేవి, నిర్మల, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సుమన్ కళ్యాణ్, అరుంధతి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.





## పుష్కరాల నాటికి తొలి దశ పనులు పూర్తి

ముద్ర, ఖమ్మం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధి పనుల పురోగతిపై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆర్కిటెక్ట్ కృష్ణమూర్తి కలిసి బుధవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి పనులను చేపడుతోందని తెలిపారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. మూడు దశలలో చేపట్టనున్న ఈ ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా మొదటి దశ పనులను గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేసే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. ఇందుకోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు తక్షణమే పూర్తి చేసి, వచ్చే వారంలోనే నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.







## రైతు సంఘం నూతన కమిటీ ఎంపిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా మేక అశోక్ రెడ్డి, మాటూరి బాలరాజ్ గౌడ్

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : తెలంగాణ రైతు సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా మూడో మహాసభలు ఏప్రిల్ 6, 7 తేదీల్లో పోచంపల్లి పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో జయప్రదంగా జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా, ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పోతినేని సుదర్శన్, తీగల సాగర్ లు పాల్గొని మహాసభల్లో ప్రసంగించారు. మహాసభలో జిల్లా వ్యాప్తంగా భవిష్యత్తులో నిర్వహించాల్సిన, సాగునీటి ప్రాజెక్టులైన బస్వాపురం ప్రాజెక్టు, రాచకొండ ఎత్తిపోతల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, మూసి కాల్వలకు గోదావరి జలాలను లింకు చేసి పిల్లాయపల్లి, ధర్మారెడ్డి పల్లి అసిఫ్ నహర్, బొల్లేపల్లి కాల్వ, పునాది గాని కాల్వలకు గోదావరి జలాలను లింకు చేసి అందించాలని ఈ మహాసభల్లో తీర్మానాలని ఆమోదించారు. అనంతరం మహాసభ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా మేక అశోక్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాటూరి బాలరాజు గౌడ్, ఉపాధ్యక్షులుగా ఎండి జహంగీర్, బూరుగు కృష్ణారెడ్డి, చీరిక వేలు, కందాడి సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శిగా కోట రామచంద్రారెడ్డి, దోడ యాదిరెడ్డి, గన్నె బోయిన విజయ భాస్కర్ పైళ్ళయాదిరెడ్డి, ఏదునూరి మల్లేశం తోపాటు జిల్లా కమిటీ సభ్యులుగా తుమ్మల నర్సిరెడ్డి, సూదగాని సత్య రాజయ్య, పిక్క గణేష్, బోయిని ఆనంద్, చీరిక సంజీవరెడ్డి, పొట్ట శ్రీనివాస్, ఆకుల ధర్మయ్య, ర్యాకల శ్రీశైలం ,బొమ్మ గాని శంకరయ్య, జిట్టా అంజిరెడ్డి, పగిళ్ల లింగారెడ్డి, గూడూరు బుచ్చిరెడ్డి, దడిపల్లి ప్రభాకర్, రేసు రామచంద్రారెడ్డి, మొగిలి పాక గోపాల్, సురకంటి శ్రీనివాస్ రెడ్డి, కొమ్ము మల్లేశం, పుష్పలత, చింతల రజిని, బందెల ఎల్లయ్య తుమ్మల సత్యనారాయణ రెడ్డి, కందుల మల్లారెడ్డి, పానుగుల్ల రమేష్, కొమ్ము అంజమ్మ 35 మందితో జిల్లా కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

# మహనీయుల ఆశయాలు సాధించాలి

- అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన డీఎస్ డీఓ



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : మహనీయుల ఆశయాలు సాధించాలని జిల్లా సంక్షేమ అధికారి సాహితి అన్నారు. మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి జిల్లా సంక్షేమ అధికారి సాహితి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ జోతిర్వమై, ఎ ఎస్ డబ్ల్యూఓ సుమంత్, వార్డెన్ శైలజ, ఆనంద్, విశ్వనాథం, సైదులు, జహంగీర్ ఉత్సవ కమిటీ సభ్యులు ఇటకాల దేవేందర్, శివ లింగం, కర్తల శ్రీను, బట్టు రాంచంద్రయ్య, బర్రె జహంగీర్, నర్సింహా, రవి వర్ధన్, శంకర్, రామ కృష్ణ, కుతడి సురేష్ పాల్గొన్నారు.



## పులే జయంతి ఉత్సవాల కమిటీ ఏర్పాటు

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : ఈ నెల 11న జరుగబోయే మహాత్మ జ్యోతి బా పులే జయంతి సందర్భంగా భువనగిరి పట్టణంలోని పూలే జయంతి ఉత్సవాల కమిటీని అన్ని పార్టీల,కుల సంఘాల, ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షురాలుగా పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, గౌరవ సలహాదారులుగా పొత్నక్ ప్రమోద్ కుమార్, అతికం లక్ష్మి నారాయణ గౌడ్, పెంట నరసింహ, సుర్వీ శ్రీనివాస్ గౌడ్, గొట్టిపముల బాబురావు, మాటూరి అశోక్, కొత్త బాలరాజు, మాటూరి బాలేశ్వర్ ఎన్నుకున్నారు. కన్వీనర్ కొత్త నరసింహ స్వామి, కో కన్వీనర్లుగా దేవరకొండ నర్సింహ చారి, దరిపల్లి ప్రవీణ్ కుమార్, పంచేద్దుల బల్ రామ్, పిట్టల బాలరాజు, సబంకర్ వెంకటేష్, బెండ శ్రీకాంత్, సిరికొండ శివకుమార్, యేషాల అశోక్, మాయ కృష్ణ, జిన్న మల్లేష్, కూర శివ కుమార్, రత్న పురం పద్మ, సిద్ధుల పద్మ, తలను ఎన్నుకున్నారు.

# శారీరక దారుఢ్యం అవసరం

పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని షటిల్ బ్యాడ్మింటన్ కోర్ట్ ను ప్రారంభించిన సీపీ

ముద్ర, ఖమ్మం: స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సద్వినియోగం చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. ఖమ్మం పోలీస్ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా సిటీ అర్మడ్ పోలీస్ హెడ్ క్వాటర్స్ ఆవరణలోని ఇటీవల ప్రారంభమైన స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో అత్యాధునిక హంగులతో నూతనంగా నిర్మితమైన షటిల్ బ్యాడ్మింటన్ కోర్ట్ ను బుధవారం పోలీస్ కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... పోలీస్ కుటుంబాల కోసం ఆధునిక సౌకర్యాలు, శిక్షణ, కోచింగ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. శారీరక దారుఢ్యం కోసం షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును పోలీసు సిబ్బందికి అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణంలో అహర్నిశలు కష్టపడి పనిచేసిన పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందిస్తూ ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు (ఏఆర్) కుమారస్వామి, విజయ బాబు, ఏఆర్ ఏసిపి లు సుశీల్ సింగ్, నర్సయ్య, ఎస్బి ఏసిపి మహేష్, సిసిఎస్ ఏసీపీ సర్వర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కామరాజు, శ్రీశైలం,సాంబశివరావు సురేష్, నాగుల్ మీరా, ఇన్స్పెక్టర్లు రాజిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# పోలీసు కుటుంబాలకు బాసటగా భద్రత స్కీం

- ఎస్పీ కె.నరసింహ



ముద్ర, సూర్యాపేట: పోలీసుల కుటుంబాలకు పోలీస్ భద్రత స్కీం బాసటగా నిలుస్తుందని జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు. ఏఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. అతని కుటుంబానికి పోలీసు భద్రత స్కీం ద్వారా మంజూరైన చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. పోలీసు శాఖలో పని చేస్తూ అకాలంగా ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలను పోలీసు శాఖ అన్ని విధాలుగా ఆదుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి, పోలీసు సంఘం అధ్యక్షులు ఎస్సై రామచందర్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.

## నిఘా పటిష్టం

ముద్ర, ఖమ్మం: ఈవీఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘాతో భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ నెలవారీ తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ సీళ్లను కలెక్టర్ పరిశీలించారు.




సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 09-04-2026
www.mudranews.in | @mudranews



**కోడిగుడ్డు**
ఎముకల బలానికి ఉపయోగం

విటమిన్ డి, కాల్షియం ఎముకలను బలంగా ఉంచుతాయి. ఆస్టియోపోరోసిస్ ప్రమాదం తగ్గుతుంది.



# సురక్షిత మాతృత్వంతో ఆరోగ్యకరమైన సమాజం









- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి

ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:

సురక్షిత మాతృత్వంతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న హెల్త్ వీక్ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో "సేఫ్ మదర్ డే" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, తల్లి–బిడ్డల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల వైద్య సదుపాయాలను అందిస్తున్నదన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ,సురక్షిత ప్రసవాలు, తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణకు వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గర్భధారణ సమయంలో సమయానుకూల వైద్య పరీక్షలు,టీకాలు,పోషకాహారం ద్వారా తల్లి మరియు శిశువు ఆరోగ్యాన్ని కాపాడవచ్చన్నారు. సమగ్ర ప్రణాళికతో పనిచేసి మాతృ మరణాల రేటును జీరోకు తీసుకు రావడానికి కృషి చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాతా, శిశు ఆరోగ్య పరిరక్షణ, సురక్షిత ప్రసవాల ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సేఫ్ మదర్ హుడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వసంత్ రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. మురళీకృష్ణ,డీసీహెచ్ఎస్ డా. కవిత,ప్రోగ్రాం అధికారులు డా.నాగనిర్మల, డా.శశాంక్, డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్లు, గర్భిణీలు పాల్గొన్నారు.

## గర్భిణీల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

ముద్ర ప్రతినిధి, మెదక్:

గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతి మాసింగ్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కలెక్టరేట్లో సురక్షిత మాతృత్వ దినోత్సవం నిర్వహించారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని, దాంతో ఆరోగ్యవంతమైన కుటుంబం, సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. వివాహానికి ముందు, తర్వాత, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవసరమైన వైద్య పరీక్షలపై అవగాహన కల్పించడం సేఫ్ మదర్ డే ముఖ్య ఉద్దేశ్యమని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డా. సునీత, డిసిహెచ్ఎస్ శివదయాల్, రాజేశ్వరి, ప్రియదర్శిని సృజన, డి.డబ్ల్యు.ఓ హేమ భార్గవి, డిఎఫ్ఓ జోజి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, డిప్యూటీ డీఎం హెచ్ఓలు, ప్రోగ్రామ్ అధికారులు, వైద్యాధికారులు, ఏ.ఎన్.యం.లు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ప్రైవేట్, ప్రభుత్వ ప్రసూతి వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

## మాతాశిశు కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు

ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:

సిద్దిపేట జిల్లాలోని అన్ని ప్రభుత్వ మాతా–శిశు ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణీలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, గర్భిణులు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యం పొందాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. బుధవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని జిల్లా జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన "సేఫ్ మదర్ డే" కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏప్రిల్ 6 నుండి 11 వరకు హెల్త్ వీక్‌గా నిర్వహిస్తూ రోజువారీ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గర్భధారణ ప్రారంభం నుంచి శిశువు జననం వరకు తల్లి–శిశువుల ఆరోగ్యాన్ని కాపాడడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. గర్భిణులు వైద్యుల సూచనలు పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవడం, మానసిక ప్రశాంతతను కాపాడుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. గర్భధారణ నిర్ధారణ అయిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సదుపాయాలు ఉన్నాయని, 7వ, 8వ, 9వ నెలల్లో తప్పనిసరిగా పరీక్షలు చేయించుకుని, ప్రసవం కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే చేయించుకోవాలని సూచించారు.గర్భిణుల ఆరోగ్యానికి భర్తలు కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా. ధనరాజ్, సైకియాట్రి విభాగం హెచ్‌వోడి డా. శాంతి, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డా. బాబ్జి, డిప్యూటీ డీఎం హెచ్ఓ డా. మహేందర్ రెడ్డి, నర్సింగ్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా జనరల్ ఆసుపత్రిలో డిపార్ట్మెంట్ ఆఫ్ సైకియాట్రిస్ట్, డి అడిక్షన్ సెంటర్ లో కుటుంబ సమస్యలతో సతమతమవుతూ డిప్రెషన్ కి గుర వుతున్న రోగి తో మాట్లాడారు.



### భవన నిర్మాణ కార్మికులకు
# విదేశాల్లో ఉపాధి అవకాశాలు

- అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాస్

ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:

సిద్దిపేట జిల్లా పరిధిలోని భవన నిర్మాణ రంగాల కార్మికులకు విదేశాల్లో ఉపాధి అవకాశం కల్పించే ప్రత్యేక ప్రణాళిక కార్మిక శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్నామని, ఈ అవకాశంను ఉపయోగించు కోవాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో ఉన్నా కార్మిక సంఘాల నాయకులతో సిద్దిపేట కార్మిక శాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీఎల్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మొదటి 10,000 మంది భవన నిర్మాణ కార్మికులకు అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. న్యాక్ సహకారంతో నైపుణ్య కార్యక్రమాలు నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్మాణ రంగంలో సంవత్సరంలో 90 రోజులు పని చేసిన ప్రతి భవన నిర్మాణ కార్మికుడు వెల్ఫేర్ బోర్డులో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. తద్వారా సం క్షేమ బోర్డు ద్వారా వచ్చే పథకాలు ఉప యోగించుకోవాలని కోరారు. పీఎం–ఎస్ఎం స్కీంలో ప్రతి కార్మికుడు పేరు నమో దు చేసుకొని 60 సంవత్సరాల తర్వాత రూ.3,000 పెన్షన్ సౌకర్యం పొందాలని కోరారు. కార్మికుల సంక్షేమ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఓ వికర్ బాబా, జూనియర్ అసిస్టెంట్ దివ్య, దాసు, కార్మిక సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

## పీఎస్ హెచ్ఎంఏ ఆధ్వర్యంలో పంచాంగం ఆవిష్కరణ




ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:

సిద్దిపేట జిల్లాలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యం (పీఎస్ హెచ్ఎంఏ)లో సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశంలో 2026–27 ఉగాది సందర్భంగా తెలుగు పంచాంగాన్ని రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా శాఖ పనితీరును ప్రశంసించారు. సమస్యల పరిష్కారంలో సంఘం ఎప్పుడూ ముందుంటుందని, ప్రాథమిక విద్య బలోపేతమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రాథమిక ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యా రంగంలో బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాథమిక విద్యకు కనీసం సగభాగం కేటాయించాలని, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించాలని కోరారు. సిబ్బంది పునర్వ్యవస్థీకరణలో ప్రధానోపాధ్యాయ పదవిని సాధారణ ఉపాధ్యాయ పదవిగా పరిగణించవద్దని సూచించారు. పాఠశాల సముదాయాల నిర్వహణ బాధ్యతలను ప్రధానోపాధ్యాయులకే అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా అధ్యక్షుడు సత్యానందం మాట్లాడుతూ పంచాంగం ప్రచురణకు కృషి చేసిన శ్యాంసుందర్ రావును అభినందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు పద్మారెడ్డి, సహాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, హరిహర ప్రసాద్ పాల్గొన్నారు.

## జైలు, పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు




ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య కంది సెంట్రల్ జైలు, గిర్మాపూర్ లోని గురుకుల బాలుర పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి సెంట్రల్ జైలు నందు ఉన్న బెరక్స్లా, గదులు, వంట గది, బాత్రూంలు జైలు ఆవరణ పరిశీలించారు. ఖైదీలను జైలులో ఉన్న సదుపాయాలను, భోజనం గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో మాట్లాడుతూ సమయానికి బెయిల్స్, ములాఖత్ అందుతున్నాయా.. కేసులు పరిష్కరించేందుకు న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు.

గిర్మాపూర్ లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణగా ఉంటూ పరీక్షలను అధైర్యపడకుండా రాసి ఉన్నత అవకాశాలను అందుకోవాలన్నారు. విద్యార్థుల బాగోగులను కూడా చూడాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు ప్రత్యేకంగా బాలల సంరక్షణ చట్టం, ఫోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, బాల కార్మిక నిరోధక చట్టం, భారత రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం, సంగారెడ్డిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, జైలు అధికారులు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖలో ఆర్టిజన్ కార్మికుల నిరవధిక సమ్మె






ముద్ర ప్రతినిధి,సంగారెడ్డి:

సమస్యల పరిష్కారం కోసం జోగి పేట డివిజన్ కార్యాలయం ఎదుట రాష్ట్ర విద్యుత్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు బుధవారం ఆర్టిజన్ కార్మికులే నిరవధిక సమ్మె చేపట్టారు. ఆర్టిజన్ కార్మికులకు ప్రభుత్వం నిబంధన ప్రకారం ఏపీఎస్సీబీ రూల్స్ వర్తింప జేయాలని, సమాన పనికి సమాన వేతనం అందజేయాలని, విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని, మీటర్ రీడింగ్ వర్కర్లను, పోల్ టు పోల్ వర్కర్లను ఎఫ్ఓసి వర్కర్లను విద్యుత్ సంస్థలో విలీనం చేసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జోగిపేట డివిజన్ విద్యుత్ కార్మికులకు ఎస్పీడీసీఎల్ కంపెనీ చైర్మన్ వెంకట్ నాయక్, జిల్లా కన్వీనర్ దుర్గ్య నాయక్ మద్దతు తెలిపారు. అనంతరం యాజమాన్యం, ప్రభుత్వం కరెంట్ కార్మికులకు న్యాయమైన హక్కులు ఇవ్వడానికి వెనుకాడవద్దని, 24 గంటలు కుటుంబాలకు దూరంగా ఉంటూ సుదూర ప్రాంతాల్లో నుండి వచ్చి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా పని చేస్తున్న కార్మికులకు ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టిజన్ లు రంజిత్, జోగినాథ్, రాజేందర్, సాయిలు, పవన్, నాగరాజు, మల్లేశం, సుధాకర్, హరి క్రిష్ణ, సురేష్, వసీం, ముక్తార్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ లో..

ముద్ర ప్రతినిధి, మెదక్:

ఆర్టిజన్ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెకు దిగారు. ఆర్టిజన్ కార్మికులకు అందరికి కూడా కన్వర్షన్ కావాలని, కార్మికులకు ఏపీఎస్పీ రూల్స్ అమలు చేయాలని, 2016 డిసెంబర్ 4కు ముందు అన్ని అర్హతలు ఉండి ఆర్టిజన్లుగా గుర్తించని వారందరినీ ఆర్టిజన్ ఉద్యోగులుగా గుర్తించాలని, టీజీ ఎస్పీడీసీఎల్ ఎన్పీడీసీఎల్ కంపెనీలో పరిధిలో పనిచేస్తున్న ఆన్ మన్ కార్మికులను ఆర్టిజన్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తు సమ్మె చేస్తున్నారు. మొదటి రోజు సమ్మెలో మెదక్ డివిజన్ చైర్మన్ సిహెచ్.నాగరాజు, కార్యదర్శి పృథ్వీ రాజ్ గౌడ్, ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ బిఎన్ స్వామి, ఉపాధ్యక్షులు పి. ప్రదీప్ గౌడ్, కన్వీనర్ షాదుల్ హుస్సేన్, జిల్లా, డివిజన్ నాయకులు చంద్రభాను. సురేష్, శ్రీశైలం, శరత్, మల్లేష్, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పక్కాగా ఇండ్ల గణన బ్లాక్ తయారుచేయాలి

- కలెక్టర్ ప్రతిమా సింగ్

ముద్ర ప్రతినిధి, మెదక్:



ఇండ్ల గణన బ్లాక్ పక్కాగా తయారు చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్లో జనగణన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో 9 మంది అధికారులు టీంగా ఏర్పడి క్లస్టర్ లో జరుగుతున్న గణనలో సందేహాలు నివృత్తి చేస్తారని తెలిపారు. జనాభా, గ్రామ, మండల, పట్టణ సరిహద్దులపై పలు సూచనలు చేస్తారని తెలిపారు. టీం సభ్యులు, జనాభా గణాంక అధికారులు సమన్వయంతో ఇండ్ల గణన బ్లాక్ లిస్టు పక్కాగా తయారు చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఈడియం సందీప్, తహసీల్దారులు, గణాంక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ విస్తృత పర్యటన

రామాయంపేటలో కలెక్టర్ ప్రతిమా సింగ్ బుధవారం విస్తృతంగా పర్యటించి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, రేషన్ షాపును పరిశీలించారు. కేజీబీవీలో మౌలిక వసతులు, విద్యా నైపుణ్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. 10వ తరగతి విద్యార్థినిలకు పాఠాలు బోధించారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని, నాణ్యమైన, గుణాత్మక విద్య అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం అమలును పర్యవేక్షించారు. భోజనశాలను పరిశీలించి, ఆహారం నాణ్యత, వంటశాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పాఠ శాల పరిసరాలు, తాగునీరు, మరుగు దొడ్లు, మూత్రశాలలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు.

## స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు చేపట్టాలి..

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:

సంగారెడ్డి జిల్లాలో కొనసాగుతున్న స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేయాలని కలెక్టర్ ప్రావీణ్య వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తూ చట్టాన్ని ఉల్లంఘించే సెంటర్లపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం (1994 మరియు నిబంధనలు 1996) అమలుపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని స్కానింగ్ సెంటర్లకు రిజిస్ట్రేషన్, రెన్యూవల్ ప్రక్రియలను నిబంధనలు పాటించే అర్హత కలిగిన కేంద్రాలకు మాత్రమే ఇవ్వాలని ఆదేశించారు. గర్భిణీలకు స్కానింగ్ చేసిన తర్వాత పుట్టబోయే శిశువు లింగాన్ని వెల్లడించడం పూర్తిగా నిషేధితమని, అలాంటి చర్యలు చేపట్టిన వారిపై పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. లింగ నిర్ధారణ, భ్రూణహత్యలను ప్రోత్సహించిన, సహకరించిన వారిపై చట్ట ప్రకారం జైలు శిక్షతో పాటు జరిమానాలు విధించడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలు తమ రికార్డులు, నివేదికలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, వాటిని సంబంధిత వైద్యాధికారులు పరిశీలించాని తెలిపారు. నమోదైన కేసులను విభాగాలవారీగా వర్గీకరించి, కారణాలతో సహా సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ స్కానింగ్‌లు జరగకుండా విస్తృత స్థాయిలో తనిఖీలు మైనర్/ మేజర్ ఉల్లంఘనలపై తక్షణమే నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ బి.సౌజన్య,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వసంత్ రావు,జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. మురళీకృష్ణ, ఎంసిహెచ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డా.నాగనిర్మల, డా. శశాంక్, మెడికల్ నిపుణులు, పోలీస్ శాఖ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**కోడి గుడ్డు : హృదయ ఆరోగ్యానికి మేలు**

సరైన పరిమాణంలో తింటే గుడ్డు హృదయానికి హాని కాదు. మంచి కొలెస్ట్రాల్ (HDL) పెంచడంలో సహాయపడుతుంది.



# తెలంగాణలో ఏరోస్పేస్ విప్లవం

- రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి!
- తెలంగాణలో ఏరోస్పేస్ కార్యకలాపాల విస్తరణ
- సీఎంతో టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్ ఎండీ భేటీ



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్రంలో పారిశ్రామిక రంగం మరో కీలక ముందడుగు వేసింది. ప్రపంచ ప్రఖ్యాత ఏరోస్పేస్ దిగ్గజం టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ టిమ్ రైఫిల్ బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని జూబ్లీ హిల్స్ లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తమ సంస్థ కార్య కలాపాల విస్తరణ, నూతన పెట్టుబడులపై కీలక చర్చలు జరిపారు. రక్షణ రంగంలో ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంఆర్ఓ) ఫెసిలిటీతో పాటు ఇతర డిఫెన్స్ హబ్‌గా విస్తరిస్తున్న నేపథ్యం లో, తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి ఉన్నట్లు టిమ్ రైఫిల్ సీఎం రేవంత్ రెడ్డికి వివ రించారు. లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ దేశంలో సి130జె సూపర్ హెర్క్యులస్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను ఏర్పాటు చేయనుంది. అంతర్జాతీయ అవసరాల కోసం దేశంలోని టీఏఎస్ఎల్ లో ఎఫ్16 వింగ్స్ ను ఉత్పత్తి చేసేందుకు టీఏఎ స్ఎల్ తో లాక్‌హీడ్ మార్టిన్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ క్రమంలో తెలంగాణలోనూ పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నట్లు టిమ్ రైఫిల్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**సీఎంతో రిపబ్లిక్ ఆఫ్ ఘనా హైకమిషనర్ భేటీ..**

భారత్‌లో రిపబ్లిక్ ఆఫ్ ఘనా హైకమిషనర్ ప్రొఫెసర్ క్వాసి ఒబిరిడాన్సో సీఎం రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. హైకమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారిగా హై దరాబాద్‌కు వచ్చారు. ఈ భేటీలో పరస్పర సహకారం, సుహృద్భావ సంబంధాలపై చర్చించారు. ఘనా, తెలంగాణ మధ్య సంబంధాలు కొనసాగాలని హైకమిషనర్ అభిలషించారు. ప్రధానంగా విద్య, శాస్త్ర సాంకేతిక, ఆరోగ్య, వాణిజ్య రంగాల్లో పర స్పర సహకారం ఉండాలని కోరగా, ముఖ్య మంత్రి సానుకూలంగా స్పందించారు.





# ఆర్టీసీ ఉద్యోగులకు ఆర్థిక భరోసా

- సహజ మరణాలకూ రూ.10 లక్షల ఉచిత బీమా
- రూపాయి ప్రీమియం లేకుండా సామాజిక భద్రత
- ప్రకటించిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ఆర్టీసీ ఉద్యోగులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఊరట కల్పించింది. తమ బ్యాంకులో వేతనాల ఖాతా కలిగిన ఆర్టీసీ సిబ్బందికి సామాజిక భద్రతను మరింత పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు కేవలం ప్రమాదవశాత్తూ జరిగే మరణాలకు మాత్రమే వర్తిస్తున్న బీమా సౌకర్యాన్ని, ఇప్పుడు సహజ మరణాలకు కూడా వర్తింపజేస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. సాలరీ అకౌంట్ కలిగి ఉన్న ఉద్యోగి సహజంగా మరణించినా, వారి కుటుంబానికి రూ. 10 లక్షల ఉచిత బీమా సొమ్ము అందిస్తామని ప్రకటించింది.

**ఏప్రిల్ 1 నుంచి అమలు:**

ఈ నూతన నిబంధన 2026, ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. ఈ సౌకర్యం కోసం ఉద్యోగులు రూపాయి కూడా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఇది పూర్తిగా బ్యాంకే భరిస్తుంది. గతంలో ఉన్న రూ. కోటి ప్రమాద బీమా సౌకర్యం యథాతథంగా కొనసాగుతూనే, ఈ సహజ మరణ బీమా అదనంగా చేరింది. సంస్థ వీసీ, ఎండీ నాగిరెడ్డి చేసిన ప్రత్యేక సూచనల మేరకు యూనియన్ బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకుంది. తద్వారా సంస్థలో పనిచేస్తున్న దాదాపు 38వేల పైగా ఉద్యోగుల కుటుంబాలకు గొప్ప ఆర్థిక భరోసా లభించనుంది.

# మురికివాడల్లో డబుల్ బెడ్ రూం ఇండ్లు

- మంత్రి పొన్నం ప్రభాకర్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్ లోని మురికివాడలను డబుల్ బెడ్ రూంలుగా మార్చేలా ప్రణాళికలు రూ పొందిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. కంటోన్మెంట్ స్థలాలు ఇస్తే ఇల్లు కట్టించేలా చర్యలు తీసుకుంటామన్న ఆయన అందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి స్థలం ఇప్పిం చాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరారు. ముందుగా స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. స్థలం లేని వారికి ఒకే దగ్గర 56 అంతస్తుల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేలా ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేస్తున్నట్లు వివరిం చారు. ఇందుకు మూడు జిల్లాల కలెక్టర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్యాచరణతో ముందుకు తీసుకుపోతున్నట్లు వెల్లడించా రు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవ ర్గంలో క్లాసిక్ గార్డెన్స్ లో మారేడుపల్లి లోని ఏసీఎస్ నగర్ ,ఓల్డ్ మారేడుపల్లి,సాయి చరణ్ కాలని, కట్టమైసమ్మ సికింద్రాబాద్ లలోని ఈరోజు 155 మంది అర్హులైన లబ్ధి దారులకు డబుల్ బెడ్ రూం ఇండ్ల పట్టాల ను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం లు పంపిణీ చేస్తామని తెలిపారు. అర్హత కలిగిన వారందరికి రేషన్ కార్డులు పంపిణీ చేశామని పేర్కొన్నారు.




# రాష్ట్రవ్యాప్తంగా మిడ్‌వైఫరీ సేవలు బలోపేతం

- సురక్షిత మాతృ దినోత్సవం కార్యక్రమంలో మంత్రి దామోదర
- మాతృ మరణాల తగ్గింపుపై ప్రత్యేక దృష్టి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**




మహిళా, శిశు మరణాలను తగ్గించడం ద్వారా ప్రసవం తర్వాతా ఇద్దరు సురక్షితంగా, ఆరోగ్యం గా ఉండాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. తెలంగాణలో అధికంగా ఉన్న సిసెక్ష న్ శాతాన్ని తగ్గించేందుకు మిడ్‌వైఫరీ సేవలను బలోపేతం చేయాలని వైద్యాధికారులను ఆదేశిం చారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మహిళా కేంద్రిత ఆరోగ్య సేవలను విస్తరించడం పై దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. మిడ్‌వైఫరీ పై ప్రత్యేక విధానాన్ని రూపొందించి సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తామన్న మంత్రి, శిశు మరణాల రేటును సింగిల్ డిజిట్‌కు తీసుకురా వడంపై ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. బుధవారం సికింద్రాబాద్ బోయిగూడ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో సురక్షిత మాతృత్వ దినోత్స వం కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. వైద్య విభాగంలో వైద్యులు, సిబ్బంది అత్యధికులు మహిళలే కావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన సివిల్ అసిస్టెంట్ సర్జన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఎంపికలో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు మహిళలు ఎంపికైన విషయాన్ని గుర్తు చేశారు.

వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు మాట్లాడుతూ సురక్షిత మాతృత్వం కోసం యవ్వన దశ నుంచే ఆరోగ్య అవగాహన, పోషణపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నా రు. మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెట రీ అనితా రామచంద్రన్ మాట్లాడుతూ రాష్ట్రంలో అనీమియా ప్రధాన సమస్యగా ఉన్నందున ఆరో గ్యలక్ష్మి పథకం ద్వారా రోజుకు రెండు లక్షలకుపై గా గర్భిణీలకు పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమి షనర్ సంగీత సత్యనారాయణ మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి గర్భిణుల పోషణ, గర్భధా రణలో తీసుకోవాల్సిన జాగ్రత్త లు, పోషక ఆహారం, మందుల వినియోగంపై ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను పరిశీలించారు. అనీమియా ముక్త భారత్ కార్యక్రమం సంబం ధించిన ఈలెర్నింగ్ మాడ్యూల్స్ పోస్టర్‌ను ఆవి ష్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ డా. రవీంద్ర నాయక్, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. నరేంద్ర, వైద్య విధాన పరిషత్ డై రెక్టర్ డా. అజయ్, ఆయుష్‌డైరెక్టర్ డా. శ్రీకాంత్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ సంస్థ చైర్‌పర్సన్ డా. కవిత, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వెంకటి, యూనిసెఫ్ ప్రతినిధులు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ అధికారులు పాల్గొన్నారు. మరోవైపు రాష్ట్రంలో అత్యధికంగా నార్మల్ డెలివరీలు చేసిన ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రానికి చెందిన గైనకాలజిస్ట్ వైద్యురాలు ఎం. శ్రీలతను మంత్రి దామోదర రాజనర్సింహా హైదరాబాదులోని రవీంద్ర భారతిలో అవార్డుతో సత్కరించారు.



# ఏఐసీసీకి ఏటీఎంలా తెలంగాణ

- దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఇక్కడి నుంచే డబ్బులు
- హైడ్రా పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి వసూళ్లు
- జాగృతి అధ్యక్షురాలు కవిత

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణ కాంగ్రెస్ కు ఏటీఎంగా మారిందని జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినా సరే వాటి ఖర్చు కోసం ఆ పార్టీ అధిష్ఠానం తెలంగాణపై ఆధారపడుతోం దని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి తన కుర్చీని కాపాడుకునేందుకు ఢిల్లీకి డబ్బుల సంచులు మోస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీకి గులాంగిరి చేస్తూ తన కుర్చీని కాపాడుకుంటున్నారని మండిప డ్డారు. అందుకే హైడ్రా పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులను, ప్రజలను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నడిగడ్డ (గద్వాల) హక్కుల పోరాట సమితి అధ్యక్షు డు గొంగళ్ల రంజిత్ కుమార్ తో పాటు ఆ జిల్లాకు చెందిన వెయ్యి మంది ఆయన అను చరులు బుధవారం జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ వస్తే స్వయంపాలన వస్తుందనుకుంటే ఢిల్లీకి ఘోరమైన గులాంగిరి చేసే నేతలు వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. హామీలు నెరవేర్చకుం డా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కానీ తెలంగాణలో అన్ని చేశామంటూ పచ్చి అబద్ధాలు చెప్పుకుంటూ సీఎం రేవంత్ రెడ్డి కేరళకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేస్తుండటం సి గ్గుచేటన్నారు. అప్పర్ భద్రకు కేంద్రం జాతీయ హోదా ఇస్తే రేవంత్ రెడ్డి మౌనంగా ఉన్నారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ హోదా కారణంగా తుంగభద్రకు నీళ్లు రాక నష్టపోయే ది ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాయేనని కవిత ఆందోళన వ్యక్తం చేశారు.

**25న తెలంగాణ చరిత్ర మర్చబోతున్నాం..**

ఈ నెల 25న తాము ప్రకటించనున్న కొత్త పార్టీతె తెలంగాణ భవిష్యత్, చరిత్ర ను మార్చే రోజుగా నిలుస్తుందని కవిత అన్నారు. ఆరోజు తాము ఏర్పాటు చేయబోయే పార్టీ ద్వారా ఈ గడ్డకు కొత్త నెత్తురును, కొత్త రాజకీయాలను పరిచయం చేస్తుందన్నారు.

**గద్వాల్ గడీలో ఉద్యమకారుల జెండా ఎగరాలి..**

నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు రంజిత్ ను జాగృతి పెట్టబోయే పార్టీలోకి ఆహ్వానించామని తెలిపారు. గద్వాల్ జిల్లాలో 70 ఏళ్లుగా గడీల కుటుంబాల కారణంగా ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. గద్వాల్ గడీలో టేకేదార్లు పోయి ఉద్యమకారుల జెండా ఎగరాలని పిలుపునిచ్చారు.

# జీవన్ రెడ్డికి.. లైన్ క్లియర్

- పార్టీలోకి తీసుకునేందుకు కేసీఆర్ ఒకే
- కేటీఆర్, హరీష్ తో భేటీలో నిర్ణయం
- జీవన్ ను పార్టీలోకి ఆహ్వానించనున్న కేటీఆర్
- నేడు జగిత్యాలలో కేటీఆర్‌తో కీలక భేటీ



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

తెలంగాణ రాజకీయాల్లో మరో భారీ కుదుపు చోటుచేసుకోబోతోంది. కాంగ్రెస్ పార్టీకి కంచుకోటలాంటి సీనియర్ నేత, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి గులాబీ గూటికి చేరేందుకు రంగం సిద్ధమైంది. గత కొంతకాలంగా సొంత పార్టీ తీరుపై అసంతృప్తితో ఉన్న ఆయన, చివరకు 'కారు' ఎక్కాలని నిర్ణయించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**కేసీఆర్ గ్రీన్ సిగ్నల్..**
**కేటీఆర్ రంగప్రవేశం**

జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించే అంశంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులతో భేటీ అయి చర్చించారు. అనంతరం కేటీఆర్ స్వయంగా జీవన్ రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారని, రాష్ట్ర రాజకీయ పరిస్థితులతో పాటు జగిత్యాల నియోజకవర్గ అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది.

**నేడు జగిత్యాలలో భారీ పరిణామం**

ముందుగా కుదిరిన ఒప్పందం ప్రకారం గురువారం మధ్యాహ్నం కేటీఆర్ స్వయంగా జగిత్యాల వెళ్లనున్నారు. జీవన్ రెడ్డి నివా సానికి వెళ్లి ఆయనతో ముఖాముఖి భేటీ కానున్నారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని అధికారికంగా బీఆర్ఎస్ పార్టీలోకి కేటీఆర్ ఆహ్వానించనున్నారు. ఇప్పటికే దీనికి సంబం ధించిన ప్రాథమిక చర్చలన్నీ ముగిశాయని, చేరిక ప్రక్రియ కేవలం లాంఛనమేనని పార్టీ వర్గాలు ధృవీకరిస్తున్నాయి. అలాగే ఈ నెల 15 నుంచి 20 వ తేదీ లోపు జీవన్ రెడ్డి చేరిక పూర్తి చేయాలని, ఇందుకోసం భారీ బహిరంగ సభ నిర్వహించాలని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.

**రాజీనామా వెనుక అసలు కారణం?**

జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో చోటుచేసుకున్న పరిణామాలు, ముఖ్యంగా ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు ప్రాధాన్యత పెరగడం పట్ల జీవన్ రెడ్డి తీవ్ర అసహనంతో ఉన్నట్లు సమాచారం. సొంత పార్టీలోనే గౌరవం దక్కడం లేదన్న ఆవేదనతోనే ఆయన కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పినట్లు తెలుస్తోంది.


**ఘన స్వాగతానికి ఏర్పాట్లు..**

కేటీఆర్ రానున్న సందర్భంగా జగిత్యాల పట్టణ శివారులోని ధరూర్ కెనాల్ వద్ద ఘన స్వాగతం పలికేందుకు బీఆర్ఎస్ నాయకులు, జీవన్ రెడ్డి వర్గీయులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పార్టీలోకి ఆహ్వానించనున్నారు. కాగా జీవన్ రెడ్డి వంటి బలమైన, అనుభవజ్ఞుడైన నాయకుడు పార్టీలోకి రావడం వల్ల ఉత్తర తెలంగాణలో, ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి భారీ మైలేజ్ లభిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# నేడే ముక్కోణపు పోరు!

- అస్సాం, కేరళ, పుదుచ్చేరిలో ముగిసిన ప్రచార పర్వం..
- మూడు రాష్ట్రాల్లో 'అసెంబ్లీ' ఎన్నికలకు అంతా రెడీ
- కేరళలో 'విజయం' ఎవరిది?
- అస్సాంలో బీజేపీ పట్టు నిలుస్తుందా?
- పుదుచ్చేరిలో రంగస్వామికి విజయ్ చెక్
- తుది అంకానికి సిద్ధమైన ఓటరు దేవుడు

**ముద్ర డెస్క్:**



దేశంలో మినీ సంగ్రామానికి తెరలేచింది. అస్సాం, కేరళ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. మంగళవారం సాయంత్రం తో ఈ మూడు ప్రాంతాల్లోనూ ప్రచార పర్వం ముగిసింది. అస్సాంలోని 126 స్థానాలు, కేరళలో ని 140 స్థానాలు, పుదుచ్చేరిలోని 30 స్థానాలకు గురువారం ఒకే విడతలో పోలింగ్ జరగనుంది.

**కేరళ: కంచుకోటను కాపాడుకునే పనిలో ఎల్డీఎఫ్**

దేశంలో వామపక్షాలు అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం కేరళ కావడంతో, ఈ ఎన్నికలు ఎల్డీఎఫ్ కూటమికి జీవన్మరణ సమస్యగా మారాయి. ఎలాగైనా అధికారాన్ని నిలబెట్టుకోవాలని పినరయి విజయన్ సర్కార్ శ్రమిస్తుండగా, పీఠాన్ని దక్కించుకోవాలని యూడీఎఫ్ గట్టి పో టీనిస్తోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇక్కడ విస్తృతంగా పర్యటించి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

**అస్సాం: బీజేపీ వర్సెస్ కాంగ్రెస్**

అస్సాంలో అధికారాన్ని నిలబెట్టుకోవాలని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే భావిస్తుండగా, పాత వైభవాన్ని తిరిగి తెచ్చుకోవాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది. ప్రధాని మోదీ, అమిత్ షా వంటి అగ్రనేతలు ఇక్కడ భారీ బహిరంగ సభలతో హోరెత్తించారు. ప్రధానంగా పౌరసత్వ సవరణ చట్టం (CAA) వంటి అంశాలు ఇక్కడ కీలకం కానున్నాయి.

**పుదుచ్చేరి: విజయ్ స్పీడ్ బ్రేకులు!**

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో రాజకీయ సమీకరణలు ఆసక్తికరంగా మారాయి. ఎన్. రంగస్వామి నేతృత్వంలోని కూటమికి, దళపతి విజయ్ రాజకీయ ప్రవేశం, ఆయన పార్టీ ప్రభావం ఎలాంటి 'స్పీడ్ బ్రేకులు' వేయబోతుం దో అన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగియడంతో అభ్యర్థులు ఇంటింటి ప్రచారానికి (డోర్‌టుడోర్) తెరలేపారు. మరి ప్రజలు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాలి.

**కోడి గుడ్డు : చర్మం మరియు జుట్టు మెరుగుదల**

బయోటిన్, ప్రోటీన్ వల్ల చర్మం మెరుగుపడుతుంది. జుట్టు బలంగా, ఆరోగ్యంగా ఉంటుంది.



# ఆర్థిక సంక్షోభాల పట్ల మోదీ మౌనం వీడాలి

- **సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**

**ముద్ర, గద్వాల:**

దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాల పట్ల ప్రధాని నరేంద్ర మోడీ మౌనం విడాలని, తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక వాల్మీకి కమ్యూనిటీ హాల్లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ సభాధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాలను నివారించడంలో కేంద్రం దారుణంగా విఫలమైందన్నారు. ఇరాన్ పై సామ్రాజవాద అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల పట్ల మౌనం వహిస్తూ బీజేపీ రాజ్యాంగ విలువలను కాల రాస్తున్నదని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. శ్రీరాం నాయక్, వెంకట్రాములు మాట్లాడుతూ తెలంగాణ సమాజానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేరళకు వెళ్లి రేవంత్ రెడ్డి నాటకాలు ఆడితే రాష్ట్ర ప్రజలు ఒప్పుకోరన్నారు. జిల్లా కార్యదర్శి ఏ వెంకటస్వామి, జిల్లా కమిటీ సభ్యులు జి రాజు, పరం జ్యోతి,వివి నరసింహ, మద్దిలేటి,ఈదన్న, నర్మదా, రమేష్, మండలాల కార్యదర్శులు విజయ్ కుమార్, రాముడు, నరసింహులు, నరేష్,మంచాల నరసింహ, వెంకటేష్ పాల్గొన్నారు.

# యుద్ధానికి బ్రేక్

- **పశ్చిమాసియాలో శాంతి వీచికలు..**
- **14 రోజుల కాల్పుల విరమణతో ఉపశమనం**

**ముద్ర, డెస్క్:**



అమెరికా. ఇరాన్ 14 రోజుల పాటు కాల్పుల విరమణకు అంగీకరించడంతో అంతర్జాతీయ సమాజం ఊపిరి పీల్చుకుంది. దీంతో యుద్ధ ప్రమాదం తప్పింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై జరగబోయే సైనిక దాడిని చివరి నిమిషంలో నిలిపివేశారు. నిర్ణయించిన గడువు ముగిసే 90 నిమిషాల ముందే ఈ ఆదేశాలను వెనక్కి తీసుకోవడం ద్వారా ఉద్రిక్త పరిస్థితులకు చెక్ పెట్టారు. ఈ కాల్పుల విరమణ వెనుక పాకిస్థాన్ దౌత్య ప్రయత్నాలు కీలక పాత్ర పోషించాయని ట్రంప్ వెల్లడించారు. ఇస్లామాబాద్‌లో ఈ నెల 10న ఇరు దేశాల ప్రతినిధుల మధ్య కీలక సమావేశం జరగనుంది. అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈ చర్చల్లో పాల్గొననున్నారు. ఈ సమావేశం ద్వారా దీర్ఘకాలిక పరిష్కారం దిశగా అడుగులు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ఈ ఒప్పందంలో భాగంగా ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలని ఇరాన్‌కు అమెరికా షరతు విధించింది. అంతర్జాతీయ వాణిజ్యానికి ఇది అత్యంత ముఖ్యమైన మార్గం కావడంతో దీని పునఃప్రారంభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపనుంది. ఈ పరిణామాల్లో చైనా కూడా కీలక పాత్ర పోషించిందని సమాచారం. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చి చర్చలకు ఒప్పించడంలో చైనా దౌత్యం పనిచేసిందని ట్రంప్ పేర్కొన్నారు. కాల్పుల విరమణ ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. ఒక దశలో భారీగా పెరిగిన ధరలు ప్రస్తుతం 90 డాలర్లకు పడిపోవడం ప్రపంచ దేశాలకు ఊరటనిచ్చింది. మొత్తానికి, ఈ తాత్కాలిక విరామం శాశ్వత శాంతికి దారితీస్తుందా లేదా అన్నది రాబోయే చర్చలపై ఆధారపడి ఉంది. అయితే, ప్రస్తుతం యుద్ధం అంచున ఉన్న పరిస్థితుల్లో వచ్చిన ఈ విరామం పశ్చిమాసియాలో శాంతి వీచికలుగా భావించవచ్చు.

# రెచ్చిపోతున్న మట్టి మాఫియా

- **ప్రభుత్వ, అసైన్డ్ భూములే టార్గెట్**
- **అనుమతులు లేకుండానే తరలింపు**
- **చీకటి పడితే చాలు రోడ్లపైకి వస్తున్న మట్టి టిప్పర్లు, ట్రాక్టర్లు**
- **ప్రభుత్వ ఆదాయానికి గండి**
- **పట్టించుకోని సంబంధిత అధికారులు**

**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:**



జోగులాంబ గద్వాల్ జిల్లాలో మట్టి మాఫియా విచ్చలవిడిగా రెచ్చిపోతోంది. కొండలు, గుట్టలు, వాగులు, వంకలు.. చివరకు చెరువులను సైతం వదిలి పెట్టడం లేదు. ప్రభుత్వ, అసైన్డ్ భూములే టార్గెట్‌గా చేసుకోని రేయింబవళ్లు ప్రొక్లెయిన్‌లతో తవ్వేస్తూ టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. కేటిదొడ్డి మండలంలో ఇర్కిచేడు గ్రామ కంఠం భూమి నుంచి మట్టి తవ్వకాలు జరుపుతున్న జేసీబీ, ట్రాక్టర్లను అధికారులు సీజ్ చేశారు. కుచినెర్ల గ్రామ శివారులో గల ప్రభుత్వ భూమి నుంచి మట్టి తరలిస్తున్న క్రమంలో స్థానికులు అడ్డుకున్నారు. కేటిదొడ్డిలోని ప్రభుత్వ భూమి నుంచి కూతవేటు దూరంలో ఉన్న పోలీస్ స్టేషన్ మీదుగా మట్టి తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంఓ అధికార పార్టీకీ చెందిన నాయకుల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ భూములు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని, వారి ఆగడాలను అడ్డుకోవాలని స్థానిక అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వ భూముల్లో మట్టితవ్వకాలపై చర్యలు తీసుకుంటాం**

**– కేటిదొడ్డి తహసీల్దార్ కరుణాకర్**

కేటిదొడ్డి మండలంలోని వివిధ గ్రామాలలోని ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చింది. అక్రమార్కులు రాత్రి సమయంలో అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు తెలిసింది. వారిపై చర్యలు తీసుకోవడం కోసం సిద్ధంగా ఉన్నం. ఇప్పటికే కొన్ని కేసులు నమోదు చేశాం. పోలీసుల సహకారంతో రెవెన్యూ శాఖ ప్రభుత్వ భూములను కాపాడుతాం అని తహసీల్దార్ తెలిపారు.

# హైడ్రా పనితీరు భేష్

- **చెరువుల పునరుద్ధరణ, కుంటలు, నాలాలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ అభినందనీయం**
- **ఏడాదిన్నర కాలంలోనే 1,166 ఎకరాల ఆక్రమిత భూమి స్వాధీనం రికార్డ్**
- **చెన్నైకీ హైడ్రా వంటి వ్యవస్థ అవసరం**
- **నగరంలో చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ బృందం పర్యటన**
- **హైడ్రా కార్యకలాపాలపై అధ్యయనం**
- **ఏడాదిన్నర ప్రగతిని నివేదించిన కమిషనర్ రంగనాథ్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చెరువుల పునరుద్ధరణ, కుంటలు, నాలాల పరిరక్షణ, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా హైడ్రా తీసుకుంటున్న చర్యలపై చెన్నై మెట్రోపొలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఆర్డీఏ ) ప్రశంసల వర్షం కురిపించింది. సముద్ర తీరం, భారీ నివాసాల మధ్య వరద సమస్యలను ఎదుర్కొంటున్న చెన్నైకి కూడా హైడ్రా వంటి వ్యవస్థ అవసరమని ఆ బృందం అభిప్రాయపడింది. కేవలం ఏడాదిన్నర కాలంలోనే 1,166 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి కాపాడటం గొప్ప విజయంగా పేర్కొంది. వివిధ శాఖలకు చెందిన విభాగాలను ఒకే గొడుగుకింద కు తీసుకువచ్చి ఆయా శాఖలతో సమన్వయంతో హైడ్రా పనిచేసి అనతి కాలంలోనే మంచి ఫలితాలను సాధించిందని కొనియాడింది. బుధవారం నగరంలో పర్యటించిన చెన్నై బృందం హైడ్రా కార్యకలాపాలపై అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా సీఎండీఏ ను దేశంలోనే అతి పురాతనమైన ఏజెన్సీ అని పేర్కొంది. హైడ్రా లాంటి వ్యవస్థ ఎలా ఉపయోగపడుతుందో పరిశీలించడానికి హైదరాబాద్ వచ్చినట్టు సీఎండీఏ ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించిన సీఎండీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్ సాఖమూరి తెలిపారు. చెరువులు, నాలాలు, పార్కుల ఆక్రమణలు తొలగించడంతో పాటు ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల పరిరక్షణ సాధారణ విషయం కాదని అన్నారు. వరదల కట్టడితో పాటు, భూగర్భ జలాలను పెంచి వేసవి కాలంలో నీటి ఎద్దడి నివారణలో చెరువుల పునరుద్ధరణ ప్రధాన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులతో పాటు ఆయా శాఖల సమన్వయం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హైడ్రా పునరుద్ధరించిన చెరువులతో పాటు వర్షా కాలంలో నాలాల పూడిక తీత కార్యక్రమం, వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో నిత్యం నిఘా మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌ల పనితీరుకు సంబంధించి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మరోవైపు అమీర్‌పేటలో పూడుకుపోయిన నాలాలను పునరుద్ధరించటం, సికింద్రాబాద్‌లోని ప్యాట్నీ నాలా విస్తరణతో వరదలను ఆయా ప్రాంతాల్లో ఎలా నివారించామో వీడియోలతో చూపించారు. గతంలో వరద ముంచెత్తిన ప్రాంతాల్లో ప్రజల ఇబ్బందులను చూపించి అక్కడివారు ఈ ఏడాది ఎంత భద్రంగా ఉన్నారో వారి వాయిస్‌లను వినిపించారు. చెన్నైలో ఎలాంటి చర్యలు చేపడుతున్నారో కూడా హైడ్రా అధికారులు ఆరాతీశారు. హైడ్రా, హెచ్ఎండీఏ, జలమండలి, జీహెచ్ఎంసీ పనితీరును అధ్యయనం చేయడానికి వచ్చిన సీఎండీఏ ప్రతినిధి బృందంలో సీడీఎంఏ చీఫ్ ప్లానర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డి. సభాపతి, సీనియర్ ప్లానర్ ఆర్ కే వేదవతి, పలువురు సూరింటెండెంట్ ఇంజినీర్లు ఉన్నారు.

# పాలమూరు కాంగ్రెస్ లో ఎవరికి వారే..!

- **మున్సిపల్ ఎన్నికల తరువాత పార్టీలో కల్లోలం**
- **ఎమ్మెల్యే కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న డీసీసీ అధ్యక్షులు**
- **తమ వర్గం నేతకు మేయర్ పదవి ఇవ్వలేదని ఎమ్మెల్యే పై తిరుగుబాటు**
- **టీపీసీసీ అధ్యక్షుల ముందు నేతల ఎడమోహం**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**



వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పాలమూరులో మళ్ళీ తామే గెలుస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పాలమూరుకు వచ్చిన సందర్భంగా అన్న మాటలకు, ఇక్కడి పరిస్థితికి పొంతన లేకుండా ఉంది. పాలమూరు కాంగ్రెస్ లో ఏమి జరుగుతుందో తెలిసి కూడా ఆయన ఇలా మాట్లాడారా? రెండు వర్గాలు ఏర్పడానికి ఆజ్యం పోసిందే టీపీసీసీ నేతలే అని పాలమూరులో బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ నేతలు రెండు వర్గాలుగా ఏర్పడి ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ మనుగడ ఎలా సాధిస్తుందో వారికే తెలియాలి. కాంగ్రెస్ లో జరుగుతున్న వర్గ పోరు ను బీఆర్ఎస్ అనుకూలంగా మార్చుకునే పనిలో పడింది.

**వర్గ పోరు మొదలైంది ఇలా..**

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులందరూ ఒక్కటై పార్టీని విజయతీరాలకు చేర్చారు. ఎమ్మెల్యే గా యెన్నం శ్రీనివాస్ రెడ్డిని మంచి మెజారిటీతో గెలిపించారు. రెండేళ్ల పాటు అందరూ కలిసి ఒక్క తాటిపై నిలబడ్డారు. అంతా మంచి జరుగుతుందనే సమయంలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వర్గ పోరు మొదలైంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కు చెందిన కార్పొరేటర్లు అధిక సంఖ్య లో గెలిచారు. మేయర్ పదవి కోసం ముందుగా అనుకున్న వారు ఓటమి పాలుకాగా, ఎన్ పి వెంకటేష్ కూతురు నేహాశ్రీ, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ భార్య స్వప్న ఓటమి చెందారు. తమ ఓటమికి కాంగ్రెస్ కు చెందిన వారే కారణమని ఆరోపించారు. తన భార్యకు మేయర్ పదవి కోసం ఆనంద్ గౌడ్ తమ ఓడించేందుకు డబ్బులు, మద్యం సరఫరా చేశారని వారు ఆరోపించారు. ఆనంద్ గౌడ్ గతంలో బీఆర్ఎస్ నుంచి కౌన్సిలర్ గా గెలిచి పాలమూరు మున్సిపాలిటీకి చైర్మన్ అయ్యారు. కొద్ది రోజులకు అప్పటి బీఆర్ఎస్ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తో విభేదాలు వచ్చి బీఆర్ఎస్ ను వీడి చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. తరువాత కాంగ్రెస్ కౌన్సిలర్ల అండతో మళ్ళీ చైర్మన్ పదవి దక్కించుకున్నారు. అనంతరం వచ్చిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆనంద్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్ రెడ్డి తరపున ఎన్నికల ప్రచారం చేశారు. యెన్నం గెలిచిన తరువాత ఆనంద్ గౌడ్ మున్సిపల్ చైర్మన్ గా ఉండడంతో ఇద్దరి మధ్య మంచి సాన్నిహిత్యం ఏర్పడింది. కొద్ది రోజులకు వీరిద్దరి మధ్య విభేదాలు చోటు చేసుకున్నాయి. అప్పటి నుంచి ఎమ్మెల్యేకు ఆయన దూరంగా ఉంటూ వచ్చారు. ఇటీవల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి బీసీ మహిళ కు రిజర్వేషన్ రావడం, ఆనంద్ గౌడ్ భార్య విజయం సాధించడం, అందరూ ఈమెకే మేయర్ పదవి వస్తుందని ఊహించారు. కానీ అనుకోని విధంగా ముదిరాజ్ ఆడబిడ్డ మమతకు మేయర్ పదవి దక్కింది. దీంతో ఆనంద్ గౌడ్ కు మేయర్ పదవి దక్కకుండా ఎమ్మెల్యే పావులు కదిపారనే కొందరు కాంగ్రెస్ నేతలు ఒక వర్గంగా ఏర్పడ్డారు. మేయర్ పదవి ఆనంద్ గౌడ్ కు ఇవ్వాలని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, మార్కెట్ యార్డు చైర్మన్ అనిత మధుసూదన్ రెడ్డి పట్టుబట్టినా ఫలితం దక్కకపోవడంతో ఎమ్మెల్యేకు దూరమయ్యారు. డిప్యూటీ చైర్మన్ పదవి తన కుమారునికి ఇవ్వాలని డీసీసీ మాజీ అధ్యక్షులు ఓబేదుల్లా కొత్వాల్ పట్టుబట్టారు. కాని ఆ పదవి సైతం ఎమ్మెల్యే అనుచరుడు సురేందర్ రెడ్డికి దక్కడంతో ఆయన కూడా ఎమ్మెల్యేకు దూరమయ్యారు. వీరంతా ఎమ్మెల్యే కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఎమ్మెల్యే కూడా వీరిని పట్టించుకోవడం లేదు. ఒక వర్గానికి టీపీసీసీ మద్దతుగా ఉందని, అందుకే ఆ నలుగురు ఎమ్మెల్యే కు దూరంగా ఉంటున్నారని కాంగ్రెస్ నాయకులే గుసగుసలాడుతున్నారు.

**రెండు వర్గాలను కలపని టీపీసీసీ**

డీసీసీ కొత్త కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంగళవారం పాలమూరుకు వచ్చిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పార్టీలో వర్గ పోరును ఆయన పట్టించుకోలేదు. రెండు వర్గాలను సమన్వయం చేసేందుకు ప్రయత్నం చేయలేదు. కాంగ్రెస్ పార్టీలో వర్గ పోరును బీఆర్ఎస్ కు అనుకూలంగా మార్చుకునే పనిలో ఆ పార్టీలో పడింది. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సైతం కాంగ్రెస్ లో ఒక వర్గం టచ్ లో ఉన్నట్లు స్వయంగా ప్రకటించడం ఆందోళన కలిగిస్తోంది.



# బాలల భద్రత, హక్కుల పరిరక్షణకు సమష్టి బాధ్యత

**ముద్ర, అమరావతి :**

రాష్ట్రంలో బాలల భద్రత, హక్కుల పరిరక్షణ సమాజంలోని ప్రతి ఒక్కరి ప్రధాన బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏవీఎస్ఎస్ రాజు అన్నారు. హెల్ప్ సంస్థ రూపొందించిన “బాలల పై జరుగుతున్న లింగ ఆధారిత హింసను అర్థం చేసుకోవడం, ఎదుర్కోవడం” అనే పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. కమిషన్ సభ్యులు వి. గాంధి బాబు, కే.జి, వెంకట పద్మలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల పై జరుగుతున్న లింగ ఆధారిత హింస పై ప్రజలకు, బాలలకు అవగాహన పెంచేందుకు ముందుకు వచ్చిన హెల్ప్ సంస్థను ఆయన అభినందిస్తూ, ఇటువంటి ప్రయత్నాలు సమాజంలో సానుకూల మార్పుకు దోహదం చేస్తాయన్నారు. ప్రతి చిన్నారి సురక్షితంగా, గౌరవప్రదంగా ఎదగాలంటే సమాజం మొత్తం కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో హెల్ప్ సంస్థ కార్యదర్శి నిమ్మరాజు రామ్మోహన్, హెల్ప్ ప్రోగ్రాం మేనేజర్ వి.భాస్కర్ పాల్గొన్నారు.

# మేధావులు దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు**

**ముద్ర, శేరిలింగంపల్లి :**





ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చెయ్యాలి తప్ప అభివృద్ధిలో అందరూ కలిసి ముందుకు రావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు అన్నారు. బుధవారం మాదాపూర్ డివిజన్ ఉదయ క్రిసెంట్ గేటెడ్ కమ్యూనిటీ వాసులతో జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్, సీనియర్ సిటిజన్ ఫోరం కన్వీనర్ రమేష్ బాబు, అసెంబ్లీ ఇన్చార్జ్ రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 12 ఏళ్ల క్రితం దేశం ఆర్థికంగా 12వ స్థానంలో ఉండగా, ఇప్పుడు 4వ స్థానంలో ఉన్నామని, 2014లో మన ఎకానమీ 106.57 లక్షల కోట్లు ఉండగా ఇప్పుడు 2025 నాటికి 331.03 లక్షల కోట్లని, ఎంత గొప్పగా దేశం అభివృద్ధి చెందిందో అందరికీ తెలియచేయాలని కోరారు. మోదీ దేశాన్ని చాలా శక్తివంతమైన దేశంగా మార్చారని, మన సిద్ధాంతం ఎప్పుడూ సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్ అని, ప్రతి వర్గానికీ అభివృద్ధి, ప్రతి కుటుంబానికి భద్రత, ప్రతి యువకునికి అవకాశాలు అందించాలన్నదే తమ లక్ష్యమని, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, మేకిన్ ఇండియా, వికసిత్ భారత్ లక్ష్యంగా స్వదేశీ వస్తువుల తయారీ, నగరాల్లో మంచి తాగు నీరు అందించడానికి అమృత 2.0, పరిసరాల శుభ్రతకు స్వచ్ఛ భారత్ కృషి చేస్తుందని, ఈ పథకాలను చదువుకున్న వారు వినియోగించుకుంటే దేశం చాలా వేగంగా ఒకటవ స్థానానికి వస్తుందని తెలిపారు. కమ్యూనిటీ వాసులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్, సభ్యులు రమణ రావు, ఉదయ్, వంశీ,తరుణ్, చంద్రశేఖర్, కృష్ణయ్య,సూర్య తేజ,పూర్ణ చంద్ర రావు, శ్రీనివాస్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజిత్, ప్రొఫెషనల్ ఫోరం కన్వీనర్ బాల్దా అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, జితేందర్, ప్రధాన కార్యదర్శి శివ యాదవ్, నాయకులు శ్రీశైలం కురుమ, పవన్, రాజేశ్వర్ రెడ్డి, మహేందర్, బాలు నాయక్, యాదయ్య, ఆనంద్, కుర్మయ్య, వంశీ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
09.04.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews






# రహానేకు మద్దతుగా సైమన్ డూల్..



- **విమర్శలపై ఆసక్తికర వ్యాఖ్యలు**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభం నుంచే కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ అజింక్య రహానే తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్నాడు. బ్యాటింగ్ స్టైల్, కెప్టెన్సీపై ప్రశ్నలు వెల్లువెత్తుతుండగా, ఇప్పటివరకు జట్టు ఒక్క విజయం కూడా నమోదు చేయకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది.

ఇటీవల సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఓటమి అనంతరం తన స్ట్రైక్ రేట్‌పై వచ్చిన విమర్శలకు రహానే గట్టిగా స్పందించాడు. 2023 నుంచి తన స్ట్రైక్ రేట్ అత్యుత్తమంగా ఉందని, తనపై కొంతమంది ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నారని వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యల తర్వాత మాజీ న్యూజిలాండ్ క్రికెటర్ సైమన్ డూల్ రహానేకు మద్దతుగా నిలిచాడు. గత నాలుగేళ్లలో రహానే గణాంకాలు చెడ్డవి కావని, సుమారు 30 సగటుతో 148 స్ట్రైక్ రేట్‌తో రాణిస్తున్నాడని తెలిపాడు. ఈ రికార్డు ముంబై ఇండియన్స్ ఆటగాడు రోహిత్ శర్మ కంటే మెరుగ్గానే ఉందని, సన్‌రైజర్స్ కెప్టెన్ ఇషాన్ కిషన్‌తో సమానంగా ఉందని పేర్కొన్నాడు. 2024లో టైటిల్ గెలిచిన కేకేఆర్, 2025లో ఎనిమిదో స్థానంలో నిలవడం, ఈ సీజన్‌లో కూడా దారుణ ఆరంభం చేయడం వల్లే రహానేపై ఒత్తిడి పెరిగిందని డూల్ అభిప్రాయపడ్డాడు. జట్టు సమిష్టిగా రాణించకపోవడమే ప్రధాన సమస్యగా పేర్కొంటూ, అన్ని తప్పులను రహానేపై మోపడం సరైంది కాదని స్పష్టం చేశాడు.



# జట్టులోకి తీసుకోండి.. సూర్యవంశీపై ఇర్ఫాన్ సూచన

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్‌లో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఈ నేపథ్యంలో అతడిని వెంటనే భారత జట్టులోకి ఎంపిక చేయాలని మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ సూచించాడు. ఇటీవల ముంబయి ఇండియన్స్‌పై జరిగిన మ్యాచ్‌లో సూర్యవంశీ కేవలం 14 బంతుల్లో 39 పరుగులు చేసి తన దూకుడును చాటాడు. అంతకుముందు సీఎస్‌కేపై 17 బంతుల్లో 52 పరుగులు చేసి కూడా ఆకట్టుకున్నాడు. వరుసగా ఇలాంటి ఇన్నింగ్స్‌లతో అతడు లీగ్‌లో హాట్ టాపిక్‌గా మారాడు. సూర్యవంశీ ప్రతిభపై ప్రశంసలు కురిపించిన ఇర్ఫాన్, చిన్న వయసులోనే ఇంత స్థాయి ఆట అరుదని పేర్కొన్నాడు. బుమ్రా వంటి ప్రపంచ స్థాయి బౌలర్‌ను ధైర్యంగా ఎదుర్కోవడం అతడి నమ్మకాన్ని చూపిస్తోందని అన్నాడు. ఇలాంటి టాలెంట్‌ను ఎక్కువ కాలం నిరీక్షింపజేయకుండా వెంటనే జాతీయ జట్టులోకి తీసుకోవాలని, అలా చేస్తే అతడు దీర్ఘకాలం భారత క్రికెట్‌కు సేవలందించగలడని ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు.



# కేకేఆర్ కు బిగ్ రిలీఫ్

**కామెరాన్ బౌలింగ్‌కు గ్రీన్ సిగ్నల్..**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026లో భారీ ధరకు కొనుగోలు చేసిన స్టార్ ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ బౌలింగ్‌కు సంబంధించిన కీలక నవీకరణ వెలుగులోకి వచ్చింది. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత గ్రీన్ మళ్లీ బౌలింగ్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీంతో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు ఇది ఊరట కలిగించే అంశంగా మారింది. ఏప్రిల్ 9న ఈడెన్ గార్డెన్స్ వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరగనున్న మ్యాచ్‌లో గ్రీన్ బౌలింగ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఐపీఎల్ 2026లో ఈ మ్యాచ్ కోల్‌కతా జట్టుకు కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించడం జట్టుకు ఎంతో అవసరంగా మారింది. ఐపీఎల్ 2026లో తొలి మూడు మ్యాచ్‌ల్లో గ్రీన్ ఒక్క ఓవర్ కూడా బౌలింగ్ చేయలేదు. దీనికి కారణం అతడికి ఉన్న లోయర్ బ్యాక్ గాయం. టోర్నీ ప్రారంభానికి ముందు కొన్ని రోజుల పాటు బ్యాటర్‌గా మాత్రమే ఆడతానని, 10 నుంచి 12 రోజుల తర్వాత బౌలింగ్‌కు సిద్ధమవుతానని క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించింది. ప్రస్తుతం తగినంత విశ్రాంతి లభించడంతో గ్రీన్ పూర్తి స్థాయిలో బౌలింగ్ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. గ్రీన్ బౌలింగ్ చేయకపోవడం వల్ల కోల్‌కతా జట్టు సమతౌల్యం దెబ్బతిన్నట్లు కనిపించింది. ఇప్పటికే జట్టు పలువురు ఆటగాళ్ల గాయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ముస్తాఫిజుర్ రెహ్మాన్ జట్టుకు దూరమవ్వగా, హర్షిత్ రాణా, ఆకాశ్ దీప్ గాయాల కారణంగా ఇబ్బంది పడుతున్నారు. అనారోగ్యంతో సునీల్ నరైన్, చేతి గాయం కారణంగా వరుణ్ చక్రవర్తి గత మ్యాచ్‌లో ఆడలేకపోయారు. ఐపీఎల్ 2026 వేలంలో కోల్‌కతా నైట్ రైడర్స్ రూ.25.20 కోట్లకు కామెరాన్ గ్రీన్‌ను కొనుగోలు చేసింది. అయితే ఇప్పటివరకు అతడి ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోయింది. మూడు ఇన్నింగ్స్‌ల్లో వరుసగా 18, 2, 4 పరుగులు మాత్రమే సాధించాడు. దీంతో ప్లేయింగ్ ఎలెవన్‌లో అతడి స్థానంపై చర్చలు మొదలయ్యాయి. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఆరోన్ ఫించ్ గ్రీన్ ప్రదర్శనపై ఆందోళన వ్యక్తం చేశాడు. గ్రీన్ గతంలో ఉన్న ఆత్మవిశ్వాసం ప్రస్తుతం కనిపించడం లేదని పేర్కొన్నాడు. అతడిని దిగువ స్థానంలో కాకుండా టాప్ ఆర్డర్‌లో పంపాలని లేదా కొంత విశ్రాంతి ఇవ్వాలని సూచించాడు. ఇక గ్రీన్ మళ్లీ బౌలింగ్ ప్రారంభించిన తర్వాత జట్టుకు ఎంతగా ఉపయోగపడతాడో చూడాల్సి ఉంది. అతడు ఆల్‌రౌండ్ ప్రదర్శన చేస్తే కోల్‌కతా జట్టుకు విజయావకాశాలు మెరుగుపడే అవకాశం ఉంది.

# స్టార్ బ్యాటర్లకు సవాల్ విసురుతున్న సందీప్ శర్మ

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్‌లో ఉత్కంఠభరిత మ్యాచ్‌లు అభిమానులను అలరిస్తున్నాయి. కొందరు బ్యాటర్లు పరుగుల వరద పారిస్తుండగా, బౌలర్లు వికెట్లతో సత్తా చాటుతున్నారు. ఈ క్రమంలో అనుభవజ్ఞుడైన బౌలర్ సందీప్ శర్మ తన ప్రత్యేక శైలితో స్టార్ బ్యాటర్లకు వరుస షాక్‌లు ఇస్తూ దూసుకెళ్తున్నాడు. 32 ఏళ్ల ఈ బౌలర్ వచ్చిన అవకాశాలను సమర్థంగా వినియోగించుకుంటూ కీలక మ్యాచ్‌ల్లో వికెట్లు సాధిస్తూ తన ప్రతిభను నిరూపిస్తున్నాడు. భారత జట్టు తరపున అవకాశాలు పరిమితంగా వచ్చినా, ఐపీఎల్ వేదికపై మాత్రం తన ప్రతిభను నిరంతరం చాటుతున్నాడు. ఐపీఎల్‌లో ఇప్పటివరకు మూడు జట్లకు ప్రాతినిధ్యం వహించిన సందీప్ శర్మ మొత్తం 140 మ్యాచ్‌లు ఆడి 149 వికెట్లు సాధించాడు. అతడు తీసిన వికెట్లలో ఎక్కువగా ప్రముఖ బ్యాటర్లవే ఉండడం ప్రత్యేకతగా నిలిచింది. స్టార్ ఆటగాళ్లను ఔట్ చేయడంలో అతడు ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. సందీప్ శర్మ బౌలింగ్‌కు ఇబ్బంది పడ్డ బ్యాటర్ల జాబితాలో విరాట్ కోహ్లీ ముందంజలో ఉన్నాడు. అతడిని ఐపీఎల్‌లో ఏడు సార్లు పెవిలియన్‌కు పంపించాడు. రోహిత్ శర్మను ఆరు సార్లు ఔట్ చేయగా, క్రిస్ గేల్, సూర్యకుమార్ యాదవ్‌లను నాలుగుసార్లు చొప్పున ఔట్ చేశాడు. అలాగే శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లను తలో మూడు సార్లు ఔట్ చేశాడు. సందీప్ శర్మ ఎక్కువసార్లు ఔట్ చేసిన ఆటగాళ్లలో చాలా మంది టాప్ ఆర్డర్ బ్యాటర్లే ఉండటం గమనార్హం. మ్యాచ్ ప్రారంభ దశలోనే ప్రత్యర్థి జట్టుకు షాక్ ఇవ్వగల బౌలర్‌గా అతడు గుర్తింపు పొందాడు.




# బూమ్రా వర్సెస్ వైభవ్.. ఇదే మ్యాచ్ హైలైట్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్ ఫలితం కంటే కూడా ఒక ఆసక్తికర పోరాటం అభిమానులను ఎక్కువగా ఆకట్టుకుంది. అదే జస్ప్రీత్ బుమ్రా వర్సెస్ 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మధ్య జరిగిన సమరం. వర్షం కారణంగా 11 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ బ్యాటింగ్ దూకుడుగా సాగింది. ఈ క్రమంలో బుమ్రా బౌలింగ్‌కు వచ్చిన ఓవర్‌లో క్రీజులో ఉన్న వైభవ్ ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా అద్భుతంగా ఆడాడు. తొలి బంతికే భారీ సిక్స్ బాదిన అతడు, అదే ఓవర్‌లో మరో సిక్సర్ కొట్టి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆ ఓవర్లో వచ్చిన పరుగుల్లో ఎక్కువ భాగం అతడే సాధించడం విశేషం. అనుభవజ్ఞుడైన బుమ్రాను ఎదుర్కొంటూ వైభవ్ చూపించిన ధైర్యం, ఆత్మవిశ్వాసం ప్రత్యేకంగా నిలిచాయి. సాధారణంగా బుమ్రా బౌలింగ్‌ను జాగ్రత్తగా ఆడే బ్యాటర్లు ఉండగా, ఈ యువ ఆటగాడు మాత్రం తన సహజ దూకుడుతో ప్రత్యర్థిని ఛాలెంజ్ చేశాడు. అతని షాట్స్ క్రికెట్ విశ్లేషకులను కూడా ఆకట్టుకున్నాయి. రెండు సిక్సర్లు ఇచ్చినప్పటికీ బుమ్రా నవ్వుతూ స్పందించడం క్రీడాస్ఫూర్తిని ప్రతిబింబించింది. ఈ పోరులో వైభవ్ మెరిసినా, ఇద్దరి మధ్య జరిగిన పోటీ అభిమానులకు మంచి వినోదాన్ని అందించింది. ఈ ఇన్నింగ్స్‌తో వైభవ్ సూర్యవంశీ తన ప్రతిభను మరొకసారి చాటుకున్నాడు. చిన్న వయసులోనే అతడు చూపిస్తున్న ఆట భవిష్యత్తులో పెద్ద స్టార్‌గా ఎదిగే సూచనలు ఇస్తోంది. ఐపీఎల్ మరోసారి యువ ప్రతిభకు వేదికగా నిలిచిందని ఈ మ్యాచ్ నిరూపించింది.


# అందుబాటులో లేకుంటే చర్యలు తీసుకోవాల్సిందే

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్‌లో జట్టుకు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకుండా ఆడే విదేశీ ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా కొందరు ఆల్‌రౌండర్లు కేవలం బ్యాటింగ్‌కే పరిమితమవుతున్న తీరు సరికాదని పేర్కొన్నాడు. ఒక మ్యాచ్‌లో బౌలర్‌కు నాలుగు ఓవర్లు మాత్రమే ఉండగా, వాటిని కూడా వేయకుండా ఉండటం అర్థం కావడం లేదని గావస్కర్ ప్రశ్నించాడు. ఒకవేళ ఆటగాడు పూర్తిగా ఫిట్‌గా లేకపోతే టోర్నీ ప్రారంభానికి ముందే తప్పుకోవాలని, అప్పుడు ఫ్రాంఛైజీకి ప్రత్యామ్నాయాన్ని ఎంపిక చేసే అవకాశం దొరుకుతుందని తెలిపాడు. ఈ అంశంపై బీసీసీఐ జోక్యం చేసుకుని స్పష్టమైన నిబంధనలు తీసుకురావాలని ఆయన కోరాడు. మ్యాచ్‌లకు పూర్తిగా అందుబాటులో లేని ఆటగాళ్లపై కూడా నియంత్రణలు అవసరమని సూచించాడు.



జట్టుకు పూర్తిగా కట్టుబడి ఆడే ఆటగాళ్లే ఫ్రాంఛైజీలకు అవసరమని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాల్సిన అవసరం ఉందని గావస్కర్ స్పష్టం చేశాడు.





# సీఎస్‌కేకు బ్రెవిస్ గుడ్ న్యూస్..

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్‌లో ఐదుసార్లు టైటిల్ సాధించిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ప్రస్తుత సీజన్ ఆశించిన విధంగా ప్రారంభం కాలేదు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడిన సీఎస్‌కే మూడింటిలోనూ ఓటమి పాలైంది. ఈ పరిస్థితుల్లో జట్టుకు ఊరట కలిగించే వార్త వెలుగులోకి వచ్చింది. దక్షిణాఫ్రికా యువ బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్ ఫిట్‌గా మారి తిరిగి జట్టులో చేరేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఏప్రిల్ 11న ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగే మ్యాచ్‌లో అతడు ఆడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన బ్రెవిస్ అభిమానులతో మాట్లాడాడు. ఈ సందర్భంగా అభిమానులు సందేశం ఇవ్వమని కోరగా, ఏప్రిల్ 11న మైదానంలో కలుస్తానని పేర్కొన్నాడు. సీజన్ ప్రారంభానికి ముందు బ్రెవిస్ సైడ్ స్ట్రెయిన్ గాయంతో బాధపడటం వల్ల తొలి మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఆర్సీబీతో జరిగిన మ్యాచ్ అనంతరం సీఎస్‌కే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ కూడా బ్రెవిస్ తదుపరి మ్యాచ్‌కు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని వెల్లడించాడు. ప్రస్తుత సీజన్ కోసం సీఎస్‌కే అతడిని రూ.2.20 కోట్లకు జట్టులో కొనసాగించింది. గత సీజన్‌లో బ్రెవిస్ సీఎస్‌కే తరఫున మిడిల్ ఆర్డర్‌లో కీలక పాత్ర పోషించాడు. అధిక స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేస్తూ మొత్తం 225 పరుగులు సాధించాడు. ఈ సీజన్ ప్రారంభ మ్యాచ్‌ల్లో అతడి గైర్హాజరీ బ్యాటింగ్ క్రమంలో స్పష్టంగా కనిపించింది. సీఎస్‌కే తదుపరి మ్యాచ్‌ను ఏప్రిల్ 11న స్వదేశ మైదానం ఎంఏ చిదంబరం స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఆడనుంది.


సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
09.04.2026 గురువారం, హైదరాబాద్
mudranews.in | @mudranews
12 సినిమా Movie



## రాకా'గా అల్లు అర్జున్.. షాకింగ్ లుక్ వైరల్

ముద్ర, సినిమా డెస్క్ :

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ తాజాగా విడుదలై అభిమానుల్లో భారీ చర్చకు దారి తీసింది. ఇప్పటివరకు #AA22గా పిలిచిన ఈ చిత్రానికి మేకర్స్ 'రాకా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ముందుగా పలువురు వేర్వేరు టైటిల్స్ ఊహించినప్పటికీ, చివరికి 'రాకా' పేరును ఫిక్స్ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ కనిపించిన విధానం అభిమానులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. విభిన్నమైన గెటప్‌లో, కాస్త భయానకమైన లుక్‌తో ఆయన దర్శనమిచ్చాడు. ఈ లుక్‌పై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. సమాచారం ప్రకారం ఈ సినిమాలో అల్లు అర్జున్ ద్విపాత్రాభినయం చేస్తున్నాడని, అందులో ఒకటి నెగటివ్ షేడ్స్ కలిగిన పాత్రగా ఉంటుందని టాక్. ఆ పాత్రకు సంబంధించిన లుక్‌ను మేకర్స్ ముందుగా విడుదల చేసినట్లు తెలుస్తోంది. ఈ పాత్రకు జోడీగా రష్మిక మందన్న నటించనుందనే ప్రచారం కూడా జరుగుతోంది. ప్రతీ సినిమాలో కొత్తదనాన్ని చూపించే అల్లు అర్జున్, ఈసారి కూడా పూర్తిగా భిన్నమైన లుక్‌తో ప్రేక్షకులను సర్ప్రైజ్ చేశాడు. 'రాకా' ఫస్ట్ లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది.



## మృణాల్ అవుట్, మానస ఇన్?

పెద్ది స్పెషల్ సాంగ్‌లో ట్విస్ట్..

ముద్ర, సినిమా డెస్క్ :

రామ్ చరణ్, బుచ్చిబాబు సనా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమాపై అంచనాలు పెరుగుతున్న వేళ, ఇందులోని స్పెషల్ సాంగ్ గురించి ఆసక్తికర వార్తలు వినిపిస్తున్నాయి. మొదట ఈ పాటలో మృణాల్ ఠాకూర్ కనిపించనుందని ప్రచారం జరిగినప్పటికీ, ఆమె ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఆమె స్థానంలో మానస శర్మను తీసుకున్నట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. 'కపుల్ ఫ్రెండ్లీ'తో గుర్తింపు పొందిన మానస, ఈ పాటలో తన గ్లామర్‌తో ఆకట్టుకోనుందన్న వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన మాత్రం లేదు. ఇక సినిమా విడుదల విషయానికి వస్తే, ముందుగా ప్రకటించిన ఏప్రిల్ 30 తేదీ మారే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. పోస్ట్ ప్రొడక్షన్ పనుల కారణంగా జూన్ చివరి వారంలో సినిమా రిలీజ్ అయ్యే అవకాశముందని తెలుస్తోంది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.



## ర్యాంప్‌పై అదరగొట్టిన దిశ

ముద్ర, సినిమా డెస్క్ :

బాలీవుడ్ నటి దిశా పటానీ ఫ్యాషన్ షోలలో మరోసారి తన స్టైల్‌తో మెరిసింది. బాంబే టైమ్స్ ఫ్యాషన్ వీక్ 2026లో భాగంగా ముంబైలో జరిగిన ఈ ఈవెంట్‌లో ఆమె ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ బ్రాండ్ షోను ముగిస్తూ ర్యాంప్‌పై ఆమె చూపించిన ఆత్మవిశ్వాసం అందరినీ ఆకట్టుకుంది. నల్లటి స్టైలిష్ అవుట్‌ఫిట్‌లో, క్రాప్ టాప్‌తో పాటు వైడ్ లెగ్ ప్యాంట్ ధరించి దిశా బోల్డ్ లుక్‌లో కనిపించింది. సిల్వర్ యాక్సెసరీస్, మిడ్‌రిఫ్ చైన్ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేశాయి. ర్యాంప్‌పై ఆమె నడక స్టైలిష్‌గా, ఎనర్జీతో నిండుగా కనిపించింది. లాంగ్ వేవీ హెయిర్, కాన్ఫిడెంట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో దిశా పటానీ ఫ్యాషన్ ప్రపంచంలో మరోసారి తనదైన ముద్ర వేసింది. ఫిట్‌నెస్, స్టైల్‌లో ఎప్పుడూ ముందుండే ఆమె, ఈ ఈవెంట్‌తో అభిమానులను మరింత ఆకట్టుకుంది.

## ఒంపు సొంపులతో కవ్విస్తున్న అవ్నీత్ కౌర్

ముద్ర, సినిమా డెస్క్ :


యువ నటి అవ్నీత్ కౌర్ మరోసారి తన అందాలతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా షేర్ చేసిన ఫోటోలలో ఆమె స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంటోంది. తెల్లటి అవుట్‌ఫిట్‌లో, క్రాప్ టాప్‌తో పాటు స్లిట్ ఉన్న స్కర్ట్ ధరించి ఆమె గ్లామర్‌ను ఎలిగెంట్‌గా ప్రదర్శించింది. సింపుల్ బ్యాక్‌గ్రౌండ్‌లో తీసిన ఈ ఫోటోలు ఆమె అందాన్ని మరింత హైలైట్ చేస్తున్నాయి. వేవీ హెయిర్ స్టైల్, నేచురల్ మేకప్‌తో ఆమె ఫ్రెష్ మరియు కాన్ఫిడెంట్ లుక్‌ను చూపించింది. చిన్న వయసులోనే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అవ్నీత్, ప్రస్తుతం ఫ్యాషన్ ఐకాన్‌గా ఎదిగింది. టీవీ, సినిమాలు, మ్యూజిక్ వీడియోల ద్వారా మంచి గుర్తింపు పొందిన ఆమె, తన ప్రతి లుక్‌తో అభి మా ను ల ను ఆ క ట్టు కుం టూ



## వారణాసి స్టోరీ లీక్...

### శతాబ్దాల కథ ను వెలికితీస్తున్న రాజమౌళి...

దర్శక ధీరుడు రాజమౌళి నుంచి వచ్చే ప్రతి సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది. ఆయన చేసిన 12 సినిమాల్లో 12 మూవీస్ సూపర్ సక్సెస్ అయ్యాయి. 100% సక్సెస్ రేట్ కలిగిన ఏకైక దర్శకుడిగా చరిత్రని క్రియేట్ చేయడం అనేది అతనికే దక్కింది... ప్రస్తుతం ఆయన మహేష్ బాబుతో చేస్తున్న 'వారణాసి' సినిమా మీద తన పూర్తి ఫోకస్ పెట్టాడు. ఇప్పటివరకు ఈ సినిమా కోసం రాత్రి పగలు అనే తేడా లేకుండా విపరీతంగా కష్టపడుతున్నాడట. ఇక తన కష్టాన్ని చూడలేక వల్ల ఇంట్లో వాళ్ళు సైతం ఇబ్బంది పడుతున్నట్టుగా తెలుస్తుంది. ఇక ఏది ఏమైనా కూడా ప్రపంచ స్థాయి ప్రేక్షకుడిని మెప్పించాలి అంటే రాజమౌళి ఈ రేంజ్ లో కష్టపడాల్సిన అవసరమైతే ఉంది. ఇక ఇదిలా ఉంటే వారణాసి సినిమాకి సంబంధించిన స్టోరీ ఒకటి సోషల్ మీడియా విపరీతంగా వైరల్ అవుతుంది... హాలీవుడ్ కి చెందిన ఒక విఎఫ్ఎక్స్ సంస్థ వారణాసి సినిమాకి సంబంధించిన కీలక సన్నివేశాలకు విఎఫ్ఎక్స్ వర్క్ చేస్తున్నారు. అయితే వీళ్ల తర్వాత ప్రాజెక్ట్ గా వారణాసి సినిమా పేరును మెన్షన్ చేస్తు దాని కింద ఈ సినిమాకు సంబంధించిన కొంత స్టోరీ రాసుకోవచ్చారు. దాంతో ఆ స్టోరీని చదివిన ప్రతి ఒక్కరు సోషల్ మీడియాలో వారణాసి స్టోరీ ఇదే అంటూ దాన్ని వైరల్ చేస్తున్నారు. ఇంతకీ ఆ స్టోరీ ఏంటి అంటే రుద్ర (మహేష్ బాబు) అనే ఒక శివ భక్తుడు కాలానికి అతీతమైన ఒక శక్తి ఉందని దానికి సంబంధించిన ఒక ఆభరణాన్ని దక్కించుకోవడానికి చాలా అడ్వెంచర్లను చేస్తాడట.ఇక ఇలాంటి క్రమంలోనే తను ప్రాచీన విషయాలను సైతం వెలికితీస్తూ ఒకదానితో ఒకటి



లింక్ చేసుకుంటూ తను ఎక్కడికి వెళ్తున్నాడు. దానివల్ల ప్రపంచానికి ఉపయోగమేమిటి దుష్టులకు (కుంభ) ఇది దక్కితే దానివల్ల ప్రపంచం వినాశనం అయిపోయిందనే విషయాలను తెలుసుకొని వాళ్ల నుంచి దాన్ని ఎలా కాపాడాడు అనేది ఈ సినిమా కథ అంటూ సోషల్ మీడియాలో ఒక న్యూస్ విపరీతంగా వైరల్ అవుతుంది. ఇక జక్కన్న ఇలాంటి ఒక సూపర్ కథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. కాబట్టి ఈ మూవీ సూపర్ సక్సెస్ ను సాధిస్తే 3000 కోట్లకు పైన కలెక్షన్స్ ను కొల్లగొడుతుందని చెప్పడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు...

## #Mega158 ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రానున్న పవన్ కళ్యాణ్..




'మన శంకర వరప్రసాద్ గారు' వంటి భారీ ఇండస్ట్రీ హిట్ తర్వాత , మెగాస్టార్ చిరంజీవి , డైరెక్టర్ బాబీ తో ఒక సినిమా చేయబోతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఎప్పుడో జనవరి నెలలోనే జరగాల్సి ఉంది. కానీ కొన్ని అనుకోని పరిస్థితుల వల్ల , ఇన్ని రోజులు ఆగిపోయింది. అయితే ఈ చిత్రానికి సంబంధించిన పూజ కార్యక్రమాలు ఈ నెల 10 న జరగబోతుంది. ఈ సందర్భంగా ఆ చిత్ర నిర్మాత లోకేష్, డైరెక్టర్ బాబీ కలిసి నేడు పవన్ కళ్యాణ్ ని కలిసి , ముఖుర్తం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ఆహ్వానం పలికారు. ఆయన్ని కలిసిన తర్వాత వీళ్లిద్దరు సెల్ఫీ తీసుకొని సోషల్ మీడియా లో అప్లోడ్ చేయడం బాగా వైరల్ అయ్యింది. చాలా కాలం తర్వాత చిరంజీవి , పవన్ కళ్యాణ్ ఒక సినిమా ఈవెంట్ లో పాల్గొనబోతుండడం తో మెగా అభిమానుల ఆనందానికి హద్దులే లేకుండా పోయింది. ఎప్పుడెప్పుడు వీళ్లిద్దరు కలిసిన ఫోటోలు సోషల్ మీడియా లోకి వస్తాయా అని ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఇక #Mega158 విశేషాల్లోకి వెళ్తే, ఈ చిత్రం లో మెగాస్టార్ చిరంజీవి గ్యాంగ్ స్టర్ గా కనిపించబోతున్నాడు . అనురాగ్ కశ్యప్ ఇందులో విలన్ గా నటించబోతుండగా , మలయాళం సూపర్ స్టార్ మోహన్ లాల్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఇదంతా పక్కన pedite ee చిత్రం లో చిరంజీవి కి కూతురు పాత్ర కోసం చాలా మంది హీరోయిన్లను సంప్రదించారు , చివరికి మలయాళం క్యూట్ బ్యూటీ అనశ్వర రాజన్ ని ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఈమె మన టాలీవుడ్ లోకి శ్రీకాంత్ కొడుకు హీరోగా నటించిన 'ఛాంపియన్' అనే చిత్రం ద్వారా ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా కమర్షియల్ గా పెద్దగా వర్కౌట్ అవ్వలేదు కానీ, తమిళం లో చేసిన '#Withlove' చిత్రం మాత్రం భారీ బ్లాక్ బస్టర్ గా నిల్చింది. ఈమె కూడా ఎల్లుండి జరగబోయే పూజ కార్యక్రమాల్లో పాల్గొనబోతున్నట్టు తెలుస్తోంది. ఇక మెగాస్టార్ చిరంజీవి కి జోడీగా ఎవరు నటించబోతున్నారు అనేదాని పై ప్రస్తుతం స స్పె న్స్ నడుస్తోంది. చాలా మంది ఐశ్వర్య రాయ్ నటించబోతుందని చెప్పుకొచ్చారు , కానీ ప్రియమణి పేరు కూడా గట్టిగానే వినిపిస్తోంది. వీళ్ళిద్దరిలో ఎవరో ఒకరు ఖరారు అవ్వడం మాత్రం పక్కా, ఎవరు అనేది మాత్రం ఎల్లుండి వరకు సస్పెన్స్. మెగా స్టార్ కెరీర్ లోనే అత్యంత భారీ బడ్జెట్ తో తెరకెక్కబోతున్న ఈ సినిమాని కేవలం తెలుగు లోనే కాదు , హిందీ, తమిళం మరియు ఇతర ప్రాంతీయ భాషల్లో కూడా విడుదల చేయనున్నారు.

## 'డెకాయిట్' మూవీ స్పెషల్ షో.. టాక్ ఏంటంటే

ఇప్పటివరకు ఎవరికీ సాధ్యం కానీ రీతిలో వరుస సినిమాలతో సక్సెస్ లను సాధిస్తున్న వారిలో అడవి శేషు ఒకరు... ఆయన వరుసగా విజయాలను సాధించడం అనేది అసాధ్యమనే చెప్పాలి. మధ్యలో చాలా ఫ్లాప్స్ పడుతూ ఉంటాయి. ఆ తర్వాత భారీ హిట్స్ దక్కుతుంటాయి. కానీ సక్సెస్ ఫార్ములాని తెలుసుకున్న అడివి శేషు మాత్రం సినిమా సినిమాకి ఏదో ఒక డిఫరెంట్ ప్రజెంటేషన్ ఇస్తూ ప్రేక్షకులను మైమరపింప చేస్తున్నాడు. ప్రస్తుతం డెకాయిట్ సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈనెల 10వ తేదీన ఈ సినిమా రిలీజ్ అవ్వనున్న నేపద్యంలో ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ఒక స్పెషల్ షో ని ఇండస్ట్రీ లో ఉన్న కొంతమంది పెద్దలకు వేసి చూపించారట. మొత్తానికైతే ఈ సినిమాలు చూసిన ప్రతి ఒక్క ఇండస్ట్రీ పెద్ద సైతం పాజిటివ్ రివ్యూ ఇచ్చినట్టుగా తెలుస్తుంది. అందువల్లే సినిమా యూనిట్ ఈ మూవీ భారీ సక్సెస్ ను సాధిస్తుందనే కాన్ఫిడెంట్ తో ఉన్నారు. ఇక ప్రేక్షకులు ఈ సినిమాకి ఎలాంటి సక్సెస్ ని కట్టబెడతారు. అడవి శేషు మరో సక్సెస్ ను తన ఖాతాలో వేసుకుంటాడా? లేదా అనేది ఇప్పుడు ప్రతి ఒక్కరిలో క్యూరియాసిటిని రేకెత్తిస్తుంది... అయితే అడవి శేషు మాత్రం ఈ మూవీ మీద చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడు. మొదటి నుంచి ఆయన ఈ సినిమా సూపర్ సక్సెస్ ని సాధిస్తుందని నమ్మాడు కాబట్టే ఈ మూవీ ఔట్ పుట్ బాగా




వచ్చింది అంటూ ప్రతి ఒక్కరు అతన్ని ప్రశంసిస్తున్నారు. ఇక ఫైనల్ గా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రావాలంటే మరి కొద్ది గంటలపాటు వేచి చూడాల్సిన అవసరమైతే ఉంది. ప్రేక్షకుల జడ్జిమెంట్ ఎలా ఉంటుంది. శేషు ఎక్కడ కూడా తడపడకుండా ఈ సినిమాని ముందుకు తీసుకెళ్లాడు. కాబట్టి ఆయన అనుకుంటున్నట్టుగా ఈ సినిమా నెక్స్ట్ లెవెల్ లో బ్లాస్ట్ అవుతుందా? లేదా అనేదీ తెలియాల్సి ఉంది. ఇంటర్వెల్ సీన్ క్లైమాక్స్ సన్నివేశాలు చాలా అద్భుతంగా ఉంటాయని మొదటి నుంచి చెప్పుకుంటూ వస్తున్నారు. మరి ఆ రెండు సీన్స్ ఎలా ఎలివేట్ అవుతాయో చూడాలి...

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com